

నవంబరు 2020
రు. 20/-
చైతన్యం
సంకల్ప బలం
సామాజిక విలువల మాసపత్రిక
దీపావళి శుభాకాంక్షలు


చాచా నెహ్రూ




వ్యవస్థాపక సంపాదకురాలు

**తీగవరపు శాంతి**

చైతన్యం

సాంకేత్య బలం

సామాజిక విలువల మాస పత్రిక

సంపుటి -10 నవంబరు 2020 సంచిక - 2


## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అభిప్రాయ వేదిక | 5 |
| ఆకాశంలో చిల్లులు | 6 |
| అహం బ్రహ్మాస్మి | 9 |
| పూరీ జగన్నాధస్వామి వైభవం | 11 |
| శ్రీ లక్ష్మీ కవచం | 14 |
| పదవ జన్మదిన శుభాకాంక్షలు | 17 |
| సప్త మోక్ష నగరాలు | 18 |
| సినిమా | 21 |
| పదునాలుగవ రాష్ట్రపతి రామ్ నాధ్ కోవింద్ | 22 |
| గ్రీసు దేశపు పురాణ గాథలు | 27 |
| దీపావళి శుభాకాంక్షలు | 31 |
| ప్రేమంటే ఇంతే | 32 |
| బహుముఖ ప్రజ్ఞాశీలి భానుమతీ రామకృష్ణ | 36 |
| గడి-నుడి | 42 |
| తెలుగు పద్య రత్నాలు-19 | 44 |
| పట్టుదల | 46 |
| మా ఊరి నందుల కథ | 47 |
| మాటే పాటగా చేసుకున్న గోరటి ఎంకన్న | 49 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక
యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

# కరోన కట్టడికి వ్యాక్సిన్- రేస్

పిల్లలు స్కూల్ కి వెళ్లాలంటే కోవిడ్ వస్తుందేమో! అని భయపడే పరిస్థితి. ఆన్ లైన్ లో టీచర్స్ పాఠాలు చెప్పి, పిల్లలు స్కూలు మిస్ అవకుండా చూడాలని ప్రభుత్వం ఈ విధంగా ఏర్పాటు చేసింది. కానీ మన దేశంలో అందరూ సెల్ ఫోన్లు, లాప్ టాప్ లు కొనుక్కునేంత స్థోమత చాలా మందికి లేకపోవడంతో, అదో ఇబ్బంది. ఇంకా కొందరికి అది ఫాలో అవడం చేతకాని పరిస్థితి. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం స్కూల్స్ ఓపెన్ చేసి, పెద్ద క్లాసుల వాళ్లకి ఏర్పాటు చేయడం జరిగింది. అయితే అక్కడ మళ్ళీ కోవిడ్ భయం మొదలయ్యింది. మళ్ళీ సమస్య మొదలయ్యింది. అక్కడే కాదు ప్రపంచ వ్యాప్తంగా మళ్ళీ కోవిడ్ వ్యాపించడం మొదలయ్యింది. ఇది వరకటి కన్నా ప్రజల్లో తొందరగా వ్యాపించడం మొదలయ్యింది. అంతే కాదు మరణాలు కూడా తొందరగా జరుగుతున్నాయి. ఇటువంటి క్లిష్ట సమయంలో దేముడి వరంలా ఫైజర్ వ్యాక్సిన్ డిసెంబర్ కల్లా అందే అవకాశాలు ఉన్నాయి అని ప్రజలంతా ఆసక్తిగా ఎదురు చుస్థున్నారు, 44,000 మంది వాలంటీర్లను తయారు చేశారు 22,000 ల మందికి మెడిసిన్, ఇచ్చి 22,000 ల మందికి మెడిసిన్ ఇవ్వకుండాను ప్రయోగం చేస్తున్నారు, అది 90% పూర్తి అయ్యిందని అంటున్నారు. అలాగే NIH లో జరుగుతున్న క్లినికల్ ప్రయోగాల్లో "Moderna" ఫార్మా సంస్థ కనిపెట్టిన కోవిడ్ వ్యాక్సిన్ మందు వలన 95% సమర్ధ వంతంగా పనిచేసే సూచనలు కనిపిస్తున్నాయి. ఇది ప్రజలకందరికీ ఆసక్తికరమైన వార్త. అయితే కరోనా వ్యాక్సిన్ వచ్చే వరకు ప్రజలంతా మాస్క్ ధరించి, ప్రజలంతా దూరం పాటించి, శానిటైజ్ చేసుకుంటూ జాగ్రత్తలు పాటించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి.

అమెరికా అధ్యక్షుడిగా జో బైడెన్ చరిత్రలో మొదటి సారిగా వయోధికుడైన 77 ఏళ్ల వయస్సుతో అమెరికా అధ్యక్ష పదవిని చేపట్ట బోతు న్నారు, అలాగే భారత సంతతికి చెందిన 56 సంవత్సరాల శ్రీమతి హారిస్ అమెరికా చరిత్రలోనే మొదటి మహిళా ఉపాధ్యక్షురాలిగా పదవిని చేపట్టబోతున్నారు.

అమెరికన్లందరికీ అధ్యక్షుడిగా ఉంటానని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని ప్రజలకు తెలిపారు బైడెన్. 2021 జనవరి 20 వ తేదీ నుండి వీరు అధికారంలోకి వస్తారు.

ప్రపంచమంతా ఎదురుచూస్తున్న కోవిడ్ వ్యాక్సిన్ తొందర్లో రావాలని, ప్రజలంతా సుఖ శాంతులతో ఉండాలని చైతన్యం సంకల్పబలం కోరుకుంటోంది.

తీగవరపు శాంతి

# అభిప్రాయవేదిక

అక్టోబర్ సంచిక చాలా బాగుంది. మీ సంపాదకీయం పత్రికకే హైలైట్. వాస్తవాలకు అద్దం పట్టేలాగా ఉంది. దుర్గ అమ్మవారి కవర్ ఫోటో బాగుంది.

**సంతోష్ కుమార్, లక్ష్మి - అమలాపురం**

పత్రిక పదవ జన్మదిన శుభాకాంక్షలు. పత్రిక మొన్న మొన్ననే స్టార్ట్ అయినట్లు అనిపిస్తోంది. అప్పుడే పదవ సంవత్సరంలోకి ప్రవేశించిందా అని ఆశ్చర్యంగా ఉంది. పత్రిక ఇలాగే దినదిన ప్రవర్ధమానం కావాలని ఆశిస్తున్నాం.

**లక్ష్మణరావు, సరోజ - విజయనగరం**

పత్రిక జన్మదిన సందర్భంగా తుమ్మూరివారి మరియు రాజ్యశ్రీ గారి కవితలు బాగున్నాయి.విడియో కూడా చాలా బాగుంది.

**సుధాకరరావు, లాస్య - విజయవాడ**

మురళీమోహన్ గారి విడియో బాగుంది. ఆయన మనసు విప్పి మాట్లాడారు. ఆ విడియో చూసాక ఆయన చెప్పిన గుండుగొల్లు నుంచి వెళ్ళే రోడ్డులో వెళ్ళాను. నిజంగానే కారు పెట్రోలు ఆదా అయింది. ఆయన లాగా పదవులలో ఉన్నవారందరూ ఇలా తలో కాస్త మంచి పనులు చేస్తే దేశం త్వరగా అభివృద్ధి చెందుతుంది కదా!

**షణ్ముఖరావు, సామ్రాజ్యం - ఏలూరు**

భువనచంద్ర గారు ఎస్ పి బి గారి గురించి చక్కగా చెప్పారు. చాలా మంచి విడియో మా పాఠక దర్శకులకు ఇచ్చినందుకు ధన్యవాదాలు.

**రామశర్మ,లలిత - విశాఖ**

ఎలెక్ట్రాన్ వారి తిన్నింటివాసాలు కథ గొప్పగా ఉంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసి, అక్కడ జరిగిన పరిశోధనల ఫలితాలని తీసుకుని ప్రైవేట్ గా పరిశ్రమలు పెట్టుకుని కోట్లు గడించి, మన ప్రభుత్వ రంగ సంస్థల్ని నిర్వీర్యం చేసి వాటిని ప్రైవేట్ వ్యక్తుల పరం చేయటం నేనం చూస్తూనే ఉన్నాం. చాలా చక్కగా వ్రాసారు రచయిత.

**ప్రసాద్ - విజయవాడ**

అరి షడ్వర్గాల గురించి విన్నాం గాని ఈ ప్రియ షడ్వర్గాలేమిటా అని అనుకుంటూ భువనచంద్ర గారి కథ చదివాను. చాలా గొప్పగా వ్రాసారు. రచయితకు అభినందనలు.

**సాంబశివరావు, వెంకటలక్ష్మి- అమరావతి**

పూరి జగన్నాథస్వామి వైభవం గురించి మురళీ కృష్ణ గారు చక్కగా వ్రాస్తున్నారు. స్థల పురాణం గురించి మాకు తెలుపుతున్నందుకు ధన్యవాదాలు.

**శ్యామలరావు, రుక్మిణి - కుకట్ పల్లి, హైదరాబాద్**

సప్తమోక్ష నగరాలలో భాగంగా మధుర గురించి చక్కగా వ్రాస్తున్నారు రామానందం గారు. అక్కడ ఏమేమి చూడాలో ముందే తెలుసుకోగలుగుతున్నాం. ఇది చాలా ఉపయోగకరం .

**కృష్ణారెడ్డి , నీలిమ - నల్లకుంట**

నండూరి సరోజ గారి 'సినిమా' బావుంది. రచయిత్రికి మా అభినందనలు.

**సుబ్రహ్మణ్యం, శ్రీలక్ష్మి - వరంగల్**

పాలకుర్తి రామమూర్తిగారి విద్యావిధానం పై విశ్లేషణ బాగుంది. మాకు ఉన్న సందేహాలు చాలామటుకు తీరాయి.

**సుబ్బారావు, వనజ - రాజమండ్రి**

బుచ్చిరాజుగారు మన రాష్ట్రపతుల గురించి ధారావాహికంగా చక్కగా వ్రాస్తున్నారు.

**నరసింహారావు, రమ - కరీం నగర్**

గ్రీసు దేశపు పురాణ గాధలు మాకు అందిస్తున్నందుకు వేమూరిగారికి కృతజ్ఞతలు. ఎంతో ప్రాచీన సంస్కృతి ఉన్న గ్రీకు గాధలు తెలుసుకోవగలగటం మా అదృష్టం.

**కేశవరావు, రాణీ - గుంటూరు**

ఇంద్రగంటి గారి ప్రేమంటే ఇంతే చదువుతుంటే ఏదో ఒక చక్కని సినిమా చూస్తున్న ఫీలింగ్ కలుగుతోంది. రచయితకు అభినందనలు.

**కృష్ణారావు, జలజ, నళిని - హైదరాబాదు**

బాలుగారి గురించి పోడూరి గారు చక్కగా వ్రాసారు. మాకు ఎంతో నచ్చింది.

**శంకరరావు, నరేష్ - నిజామాబాద్**

హనుమంతుడి బుద్ధి కుశలత గురించి చక్కగా వివరించారు పద్యరత్నాలలో దంతుర్తివారు.

**సతీష్ వనిత - ఖైరతాబాద్**

ఆదూరివారి కథ బావుంది. అలాగే నందులవారి ధారావాహికం బాగుంటోంది. మంచి కథలు అందిస్తున్నందుకు మా ధన్యవాదాలు.

**రాం ప్రసాద్, సుజాత - సైనిక్ పురి**

# ఆకాశంలో చిల్లులు



ఎలెక్ట్రాన్

రంభా, ఊర్వశీ, తిలోత్తమా ముగ్గురు అప్సరసలూ అలుపూ, సొలుపూ లేకుండా ఇంద్రసభలో నాట్యవేదికమీద నృత్యాభినయనం అలవోకగా చేస్తున్నారు. విశ్వామిత్రుని తపోభంగం చేయడానికి వెళ్ళిన మేనక ఆ రాజర్షితో సంసారం చేసి వచ్చినందుకు ఇంద్రుడు కినుక వహించి, శాశ్వత శిక్షగా ఆమెకు సభోత్సవాలలో వేలాది సంవత్సరాలుగా ప్రాముఖ్యతనివ్వకపోవడంతో, ఆమె దీనవదనంతో ఇంద్రసభలో ఓ పక్కగా ఒదిగి నిల్చింది. సురాపానంతో మదమెక్కిన దేవతలందరూ ఆశలు నింపుకున్న నేత్రాలతో ముగ్గురు దేవనర్తకీమణుల ఒంపుసొంపుల్ని పరిశీలిస్తూ, కేవలం ఇంద్రునికే ఏకపక్షమైన అదృష్టానికి లోలోపలే మథన పడ్తున్నారు. రాజు వలచిన స్త్రీలను సామాన్యులు ఆశించడం సబుబు కాదు కదా?

అంతలో సభానిర్వహణాధికారి రంగదేవుడు చేయెత్తి నృత్యకలాపాల్నిఅపుచేశాడు. ఇంద్రుడు చిరాకుగా రంగదేవునివైపు చూశాడు. "దేవేంద్రా! సభాభంగం కావించినందుకు క్షంతవ్యుణ్ణి. స్వర్గానికి ముప్పు వాటిల్లింది. స్వర్గానికి ఎవరో వేలాది తూట్లు పొడుస్తున్నారని భద్రపాలకులు చెబ్తున్నారు. సమవర్తి దూత అఘమేఘాలమీద వచ్చి, దక్షిణాధిపతి ఆకాశ నరకంలోకూడా లక్షలాది తూట్లు పడ్డాయని సమాచారం తీసుకు వచ్చాడు. కర్తవ్యం?"

"తెలుసుకోవలసిన బాధ్యత నీది కాదా?"

"ఇంద్రా మన్నించాలి! ఆ విధి నిర్వహించాల్సింది సేనాపతి కదా?"

"ఆయనెక్కడ? సభకి ఎందుకు రాలేదు?"

"ఇంద్రా మరోసారి మన్నించాలి. సేనాపతి తమరి పుత్రులు జయంతుడే కదా? ఏ రాక్షసుల రాజ్యానికో వాయస రూపాన గూఢచర్యలు కొనసాగించడాని పోయుంటారు. ఆ సంగతి మీకే తెలియాలి." ('మీ లాగా మధిరాపానం చేస్తూ ఇలా నృత్యగానాదులతో కాలక్షేపం చెయ్యడం జయంతుడికి ఇష్టం లేని పని' ఈ మాటలూ అందామనుకొన్నాడుకాని ఏ శాపమో ఇచ్చి, భూలోకంలో కండువాలు అతి శీఘ్రంగా మారే ఏ రాష్ట్రనికో సభాపతిగా పంపేస్తాడన్న భయం కొద్దీ స్వగతంలో అనుకొన్నాడు)

"లేదు, ఆయన స్వర్గంలో తమ నివాసంలోనే ఉన్నారు. దూతని పంపి పిలిపించండి. పనిలోపని దక్షిణ దిశాధిపతి యమధర్మరాజుగారికి కూడా రమ్మని కబురు పంపండి. యమదూతలు తరుచూ ప్రపంచ విహారం చేస్తారు కాబట్టి వారికి విశేషం తెలిసి ఉండొచ్చు. లేదా నారదులవారు వస్తే ఇంకెవర్నీ పిలవకుండానే సమాచారం తెలుస్తుంది," అన్నాడు దేవగురువు బృహస్పతి.

"నాకు వేరే కబురెందుకయా బృహస్పతీ? కబురు చెప్పడానికే, ముందుగా సమవర్తిని కలుసుకొని తర్వాత ఇలా వచ్చాను. ద్వారపాలకులు సర్వసంగపరిత్యాగినైన నన్ను కూడా వదలకుండా, భద్రతా పరీక్షలు జరిపి, నా మహతిని విరగ్గొట్టినంత పని చేసి వదలడంతో ఆలశ్యమైంది!" అంటూ నారదుడు సభాప్రవేశం చేశాడు. ఇంద్రుడు తన సింహాసనం మీదనుంచి లేచి, నారదుడికి ప్రణమిల్లి, తన పక్కనే ఉన్న ఉపసింహాసనం మీద ఆసీనుణ్ణిగావించి, తానూ ఆసీనుడయ్యాడు.

"మహర్షీ! ఆకాశ పరిధిలో ఉన్న ఉత్తర స్వర్గ, దక్షిణ నరకాలకు ఈ తూట్లేమిటి?"

"ఇంద్రా! అంతా కార్య కారణ సంబంధం. దానికి మూల

కారణం నువ్వే! ఆధిపత్యం పోతుందేమో నన్న భయంతో పలు సందర్భాలలో నువ్వె-న్నో చేయరాని పనులు చేశావు. మేనకని భూమ్మీదకు పంపడంతో నీ పాపం పండడం మొదలైంది."

"అదెట్లా దేవఋషీ?" ఇంద్రుడు విస్తుపోతూ అడిగాడు.

"త్రిశంకు స్వర్గాన్ని సృష్టించిన వి-శ్వామిత్రుడికి తపోభంగం చేసే ప్ర-యత్నంలో నువ్వు పంపిన మేనక ఆయనతో సంసారం చేసి శకుం-తలను కన్నది. శకుంతల దుష్యం-తుణ్ణి గాంధర్వమాడి భరతుణ్ణి కన్నది. ఈ భరతుడు కురుపాం-డవులకు కొన్ని తరాల వెనుకటి వాడు. ఆసేతుహిమాచలపర్యం-తం అఖండ మహారాజ్య స్థాపన గావించి. పాలనని సుస్థిరం చేసిన చక్రవర్తి భరతుడు. ఆయనేలిన రాజ్యమే భారతదే-శం. కురుపాండవులు ద్వాపర, కలి యుగ సంధిలో- హస్తినలో రాజ్యకాంక్షతో కౌరవులు, ధర్మ-రక్షణకై పాండవులు కురుక్షేత్ర మహాసంగ్రామాన్ని చేసినప్పుడు కురువంశం నాశనమై ధర్మపక్ష-పు పాండవులు రాజ్యపాలన కొ-నసాగించారు. శ్రీకృష్ణావతారం సమాప్తితో కలియుగం ఏకపాద ధర్మసంచారంతో ఆరంభమైం-ది. ప్రాంతీయ రాజ్యాలు ఏర్పడ్డా-యి. యుద్ధాలు జరిగాయి. కొ-న్నిరాజ్యాలు విస్తరించాయి. కొన్ని కుచించుకు పోయాయి. వారసు-లకి రాజ్యాధికారం లభించేది.

"కళింగయుద్ధంలో రక్తపుటేరు-లు పారడంతో బౌద్ధం అవతరిం-చింది. శంకరాచార్యుడు తిరిగి హైందవతత్త్వాన్ని పునరుద్ధరిం-చాడు. తర్వాత ఆఫ్గన్ రాజులు భారతదేశంలో తమ బావుటాలు ఎగరవేశారు. తర్వాత వర్తక వాణి-జ్యాల కోసమై వచ్చిన డచ్, ఫ్రెంచ్, ఆంగ్ల దేశస్థులు తమ పతాకా-లను ఎగరవేశారు. భారతదేశం-లో ఆంగ్లసామ్రాజ్యం నెలకొంది. మెలికలుపెట్టి, కలతలు లేపి, భేదాభిప్రాయాలని సృష్టించి రాజ్యమేలారు. భారత జనవా-హినిలో చైతన్యం మేలుకొంది. శాంతియుత స్వాతంత్ర్య సమరం కొనసాగింది. ఆంగ్లేయులు దేశాన్ని రెండు ముక్కలు చేసి తమ పాలనకి స్వస్తి చెప్పి వెళ్ళి-పోయారు. రాజసంస్థానాలన్నీ అఖండ భారత్ లో పునర్విలీ-నమైపోయాయి. ప్రజాస్వామ్యం నెలకొంది.

"భూకాలమాన ప్రకారం ఆం-గ్లపాలనలో మొదటిసారిగా పందొమ్మిది వందల ముప్పై నాలుగులో ప్రజాప్రతినిధుల ఎంపికకై సాధారణ ఎన్నికలు దేశవ్యాప్తంగా జరిగాయి. ఇరవై అయిదు అక్టోబరు పందొమ్మిది-వందల ఏభై ఒకటి నుంచి ఇరవై ఒకటి ఫిబ్రవరి పందొమ్మిదివం-దల ఏభైరెండు వరకు స్వతంత్ర భారతదేశంలో మొదటి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అప్పుడు మతదాతల(ఓటర్ల) చిట్టాలు తయారుచేయడం జరిగింది. పోటీకి దిగిన అభ్యర్థుల నిర్ధా-రిత చిహ్నాలతో ముద్రించిన చి-రుపత్రాల ఆవిర్భావం ఓటు అనే పేరుతో జరిగింది. తడిక చాటుకి వెళ్ళి మతదాతలు ఓటు మీద తాము ఎంచుకోదలిచిన అభ్యర్థి చిహ్నానికి ఎదురుగా ముద్రవేసి బాలట్ బాక్స్ అనే పత్ర పేటికలో పడవేసేవారు. తర్వాత గణన చేసి, నెగ్గిన ప్రతినిధి పేరు చెప్పడం జరిగేది. తమతమ సిద్ధాంతాల-కనుగుణంగా పలు రాజకీయ పార్టీలు రంగప్రవేశం చేశాయి. దానితో ఎన్నికల సమయంలో గొడవలు జరగడం ఆరంభమైం-ది. మతదాతల జాబితాలోంచి పేర్లు తొలగించడం, దేశంలో అక్రమంగా చొరబడ్డ సరిహద్దు దేశాలవారిని మతదాతల చిట్టా-ల్లోకి ఎక్కించడం, మతదాతల్ని బెదిరించడం, ఒకరే పలువురి ఓట్లను దౌర్జన్యంగా వేయడం, ఓట్లు వేసిన డబ్బాలను గల్లంతు చేయడం లాంటి వికృత చర్యలు ఆరంభమైయ్యాయి. ముంద-స్తుగా మతదానం చేసిన వారికి చేతివేలు మీద చెరగని సిరాతో గీత ఒక్కటే వేసేవారు. తర్వాత్త-ర్వాత నాయకుల అభీష్టాలకు వి-రుద్ధంగా మతదాతలకు గుర్తిం-పుకార్డులు ఇవ్వబడ్డాయి. జనాభా శీఘ్రగతిన పెరిగినకొద్దీ ఎన్నిక-లను సులభతరం చెయ్యడానికి సాంకేతిక పరిజ్ఞానంతో తయా-రుచేసిన ఎలెక్ట్రానిక్ పరికరాలు ఉపయోగించడం ఆరంభమైం-ది. ప్రస్తుతం భారతదేశపు జనాభా నూటముప్పై కోట్లు దాటగా,

అందులో తొంభై కోట్లమంది మతదానానికి అర్హులు. కనీసం ఏభై శాతం తమ ఓట్లను వేసినా నలభై అయిదు కోట్ల చీటీలను లెక్కపెట్టి, అభ్యర్థులవారీగా ఫలితాలు చెప్పడం శ్రమతో కూడిన పని. ఈవీఎం లనబడే ఈ ఎలెక్ట్రానిక్ పరికరాలతో దేశమంతటి ఎన్నికల ఫలితాలను ఒక్కదినంలో వెల్లడి చేయవచ్చు.

"సమాంతర శాస్త్ర, సాంకేతికాభివృద్ధి జరగడంతో ఒకనాటి తంత్రీ దూరవాణి యంత్రాలూ, ఛాయాగ్రహణ పరికరాలూ విలీనమై, నిస్తంత్రీ కరభూషిత చురుకు చరవాణిల రూపకల్పనతో సుదూర, సుదీర్ఘ సంభాషణలు చెయ్యవచ్చు, ఎదుటి దృశ్యాలనే కాక తమ ఛాయాచిత్రాల్ని తామే తీసుకోవచ్చు.

"మనిషి చూపుడు వేలు చాలా శక్తివంతమైనది. కలం, కుంచెల్ని చేపట్టడానికి, వింటినారి లాగడానికి, మీసం మెలివేయడానికి, ఇతరులను భయపెట్టూ హెచ్చరికలు చెయ్యడానికి, ఇతరత్రా అనేకానేకమైన పనులు చెయ్యడానికి తర్జని ఎంతో అవసరమని నీకు తెలియంది కాదు. ఈ నాటి ఎన్నికల సంరంభంలో ఈవీఎంల మీటల్ని నొక్కి వివిధ స్థాయిల ప్రజానాయకుల్ని నిర్ణయించేది చూపుడు వేలే! ఆ వేలిమీదనే చెరగని సిరాతో మతదానం చేసిన ఆనవాలుగా వెడల్పాటి గీత గీస్తారు. దేశాధ్యక్షులు, మంత్రులు, చలనచిత్ర



తారలు, వాణిజ్యప్రముఖులు, క్రీడాకారులు-ఒకరనేమిటి, ప్రముఖులందరూ మతదానం చేసినట్టు వేలెత్తి చూపితే, వార్తాప్రపంచం ఆ చిత్రాల్ని సంచలనంగా ప్రసారం చేస్తుంది, పత్రికల్లో ప్రచురిస్తుంది. మతదానం చేసిన కేంద్రంనుంచి ఎవరు బయటకు వచ్చినా, తాముకూడా మతదానం చేశామన్నా గర్వంతో వేలెత్తి చూపుతున్నారు. ఎవరికి మతదానం చేశారని ముందస్తు ఫలితాలు అంచనా వెయ్యడానికి మతదాతల్ని దువ్వడం జరుగుతోంది. అదీకాక ఈ స్వయం ఛాయాచిత్రగ్రహణ పరికరాల సౌలభ్యంతో గుంపులు గుంపులగా చూపుడువేళ్ళను పైకెత్తి ఛాయాచిత్రాలు తీసుకొంటున్నారు. ఒకటా, రెండా? కొన్నికోట్ల చూపుడు వేళ్ళని ఆకాశంవైపు చూపించడం జరుగుతోంది. శక్తివంతమైన ఆ వేళ్ల చివరనుంచి అదృశ్య శక్తికిరణాలు ఆకాశంలో రంధ్రాలు చేస్తున్నాయి ఇంద్రా!" నారదుడు ముగించాడు.

"మన ఆకాశ స్వర్గధామాలకి ముప్పు వాటిల్లదు కదా?" ఇంద్రుడు ప్రశ్నించాడు ఆదుర్దాగా.

"నేను త్రిలోక సంచారిని, నాకా భయం లేదు. స్వర్గాధిపత్యానికీ, నీతో కలిపి అష్టదిక్పాలకులకి ఎన్నికలు పెడ్తే ముక్కోటి దేవతలు మీ సింహాసనాల కింద సదా ప్రకంపనలు సృష్టిస్తోనే ఉంటారు! కలియుగప్రభావానికి స్వర్గం కూడా అతీతం కాదు."

"ఇంత విన్న తర్వాత అటువంటి బుద్ధితక్కువ పని చెయ్యను. ఈ మన్వంతరం గడిచేదాక నాదే అధికారం!"

"సమవర్తి ఎవరు ధన, కనక, వస్తు, వాహనాల్ని స్వీకరించి, లేదా మద్యపు సీసాలనందుకొని మతదానం చేశారో తెలుసుకోవడం కోసం, అదృశ్య కిరణాలు చేసిన రంధ్రాలను కొందరు సూక్ష్మశరీర నిపుణులచేత విశ్లేషణ చేయిస్తున్నాడు. చిత్రగుప్తుడు తనకి పని భారం తప్పుతుందని ఆశిస్తున్నాడు. అన్నట్టు మరో సంగతి చెప్పడం మరిచాను. ముక్కోటి దేవతల్ని సృష్టించిన భారతదేశ రక్షణకై పాటుపడు. ఎందుకంటే మీ దేవతల మనుగడకీ, భారతదేశపు మనుగడకీ విడదీయలేని అనుబంధముందన్న సంగతి మరవకు యింద్రా!" నారదుడు ఇంద్ర సభనుంచి మాయమై, ఆనాటి ఎన్నికల ఫలితాలు తెలుసుకోడానికి హస్తినకి పయనించాడు.

# అహం - బ్రహ్మాస్మి



**భువనచంద్ర**

ఒక చిన్న ఆవగింజ నేలమీద పడింది. ఆ మట్టి సువాసనకి ఆ ఆవగింజ పులకరించింది. మెల్లగా చల్లగా వీస్తున్న గాలి ఉధృతమై ధూళి చెలరేగి ఆ ఆవగింజను పూర్తిగా కప్పెట్టేసింది. తనలో తాను ఆవగింజ కుములుతున్న వేళ సన్నటి చినుకులు మొదలై వానగా పరిణమించింది. దుమ్ము ధూళి పొరల్లోకి ఇంకిన వానచినుకుల తడితో ఆవగింజ పూర్తిగా తడిసి బలం పుంజుకుంది. లోపల్లోపల పెరుగుతూ తనపై పొరని చీల్చుకుని, ఆ తరవాత దుమ్ము పొరని చీల్చుకుని ధైర్యంగా, ఆనందంగా రెండు దళాలనే రెండు కళ్ళనూ విప్పి ఉదయిస్తున్న సూర్యుడికి వందనాలర్పించింది.

*******

ఓ చిన్న గుడ్డు పెంకుని తలతో కుమ్మీ కుమ్మీ చిట్లగొట్టి, ఆ చిట్లిన దారుల్లోంచి ఎంతో కఠినమైన శ్రమ చేసి, బయటికొచ్చిందో చిట్టి చీమ. కళ్ళు తెరచి, తనలాగే బయటికొచ్చిన మిగతా చీమల సమూహంతో కలిసి, వాటిలాగే ఆహారాన్ని అన్వేషిస్తూ, దొరికిన ఆహారాన్ని జాగ్రత్తగా పుట్టలోకి చేర్చడం మొదలుపెట్టింది ఆ చిట్టి చీమ,

****

ఓ గర్భిణీ భారంగా నడుస్తోంది. రోడ్డంతా మిట్టపల్లాలు. మిట్ట ఎక్కుతున్నప్పుడల్లా ప్రాణం పోయేట్టుంది. అయినా పళ్ళబిగిని ఎక్కి, జాగ్రత్తగా పల్లాలని అధిగమిస్తోంది. సడెన్ గా మెరుపులు మెరిసినంత నెప్పి. బాధతో కెవ్వుమంటూ కూర్చుండిపోయింది. స్పృహ పోతోంది అనుకున్న క్షణంలో దూరంగా ఓ గుర్రబ్బండి కనిపించింది. 'దేవుడా'అని ఓ అరుపు అరిచింది.

కళ్ళు తెరిచాక చూస్తే అదో హాస్పటలు. పక్కనే చక్కగా నిదురిస్తున్న బిడ్డ.

"ఎన్ని కలలు కన్నానో. నా జన్మ దరిద్రం ఆ కలల్ని నిజం చేసుకోనివ్వలేదు. నీకేమొచ్చిందిరా వెధవా? నిన్ను డాక్టరు చేద్దామని ఒళ్ళు విరుచుకుని సంపాయించాను. ఛీ.. ఎంత అవమానం? ఎంట్రెన్సులోనే ఏబ్రాసి మొహం వేలాడేసుకుని వచ్చావు. నేను టాప్ బిజినెస్ మాన్ ని. నువ్వా?" పిచ్చికోపంతో అరిచాడు రంజిత్ కుమార్..ద బిజినెస్ టైకూన్.

వీడు ఇలా తగలడితే అది 'ప్రేమా ప్రేమా' అంటూ అలా తగలడింది. హూ... నా తరవాత విమెన్ ఇంటర్నేషనల్ క్లబ్ కి ప్రెసిడెంట్ గా, అదీ యంగెస్ట్ ప్రెసిడెంట్ ని చేద్దామనుకున్నాను. నా ప్రెస్టీజ్ ని బూడిదలో పోసింది. ఎవడో యిడియట్ ని పెళ్ళి చేసుకోబోతున్నానని ప్రెస్ స్టేట్ మెంట్ ఇచ్చింది. మనని నిట్ట నిలువుగా నీళ్ళలో ముంచింది. వికృతంగా మొహం పెట్టి కూతుర్ని నానా మాటలూ అన్నది శ్రీమతి మృణాలినీ రంజిత్ కుమార్.

ఆ రాత్రి 12 గంటలకి రంజిత్ కుమార్ కూతురు లలన ఇంట్లోంచి సెక్యూరిటీ కళ్ళు కప్పి ప్రేమించినవాడితో పారిపోతే- కొడుకు ఆదిత్య తెల్లకితెల్లవారుఝామున ఫేన్ కి ఉరేసుకుని చచ్చిపోయాడు. రాత్రంతా కూర్చుని అతను వ్రాసిన 22 పేజీల ఉత్తరం అతని జేబులోనూ, అతని చివరి మాటలు సెల్ ఫోన్ లోనూ పోలీసులకి దొరికినా, అవి డబ్బు మూటలకింద కప్పెట్టబడ్డాయి.

ఏసోబు కోళ్ళఫాం లోకి అడుగుపెట్టగానే బ్రాయిలర్ కోళ్ళన్నీ ఆత్మబంధువును చూసినంత ఆనందంగా అరిచాయి. ముప్పూటలా వాటికి తగినంత మేత వేస్తూ పెంచి పోషిస్తున్నాడతను.

"చూశావా... ఎంత ప్రేమగా వారానికోసారి మన బరువు తూచి కాపాడుతున్నాడో! దేవుడు అంటే ఇతనే" ఆనందంగా అన్నదో కోడి.

"బరువు పెరిగిన కోళ్ళని ఇనప కడ్డీల పంజరంలో కుక్కి వారానికోసారి బయటకు తీసికెళ్ళడం నువ్వు గమనించలేదా?

ఏ కోడైనా ఒక్కసారి తిరిగి మన దగ్గరికొచ్చిందా? పిచ్చిముండావాడు మనిషి. డబ్బుకోసం అన్నిట్నీ, అందర్నీ అమ్ముకు తినగల మనిషి. వీడు దేవుడా? ఇంకొంచెం బరువు పెరిగాక నీకే తెలుస్తుంది" అన్నిట్నీ గమనించే ఓ తెలివైన కోడి నిట్టూర్చి అన్నది.

"అవును... పెంచేది మన మెడని తృంచడానికే!" నిట్టూర్చింది మరో సీనియర్ కోడి.

****

కాలం అనే నదిలో ఓ బుడగ పుట్టింది. పెరిగింది... కాలంతో-పాటే కొంతదూరం ప్రవహించింది. ప్రవహించీ,పయనించీ,పగిలి నీటిలోనే అంటే, కాలంలోనే కలిసిపోయింది. పుట్టిందీ గిట్టిందీ కూడా కాలంలోనే. జాగ్రత్తగా ఆలోచించి చూడండి. ఆ పుట్టుకా చావూ నిజమైనవేనా?" శేషాచార్యులుగారు ఎదుట వున్న భక్త సమూహాన్ని అడిగారు. భక్తులందరూ చక్కగా వింటున్నారు.

"సరిగ్గా అర్ధమైనా, ఇంకేదో తెలియనట్టు ఉంది స్వామీ"అడిగాడు కుమ్మరి నారాయుడు.

"నారాయుడూ, నువ్వు పచ్చి మట్టితో కుండలూ బొమ్మలూ చెసి, వాటిని బట్టీలో (ఆవిలో) కాల్చి అమ్ముతావు గదూ?" సూటిగా అడిగారు ఆచార్యులవారు.

"అవునండీ"

"సరే! ఓ పాతిక పచ్చి కుండలు తయారుచేసి ఆరబెట్టావు, పెద్ద వర్షం వచ్చింది. అన్నీ కరిగిపోయాయి. ఆ మట్టిని మళ్ళీ పోగుచేసి కుండలు చేద్దామనుకుంటుండగా ఒకడొచ్చి ఓ యాభై వినాయకుడి బొమ్మలు కావాలన్నాడు. కుండలు చేసిన మన్ను, అంటే, కరిగిన మన్నుతోనే వినాయకుడి విగ్రహాలు చేశావు. మళ్ళీ వర్షం వచ్చి అవీ కరిగాయి. ఇప్పుడు మరొకడు వచ్చి ఓ పెద్ద గుర్రం బొమ్మ కావాలన్నాడు. అడిగినంత డబ్బిస్తానన్నాడు. వినాయకుడి బొమ్మలు కరిగిన మట్టితోనే ఇప్పుడు గుర్రం బొమ్మ తయారు చేశావు. దాన్ని చక్కగా ఆరబెట్టావు" ఆగారు ఆచార్యులవారు.

"అయ్యా" అర్ధం అయినట్టు తలూపాడు నారాయుడు.

"అసలు ప్రశ్న వున్నది ఇక్కడే. మొదట నువు చేసిన కుండలూ, వినాయకుడి బొమ్మలూ ఏమయ్యాయి?"

"అవి కరిగిపోతేనేగా గుర్రం బొమ్మ చేసిందీ?"

"అదే నిన్ను అడిగేది... ఆ కుండలూ వినాయకులూ గుర్రంలో వున్నారా?"

"ఎట్లా ఉంటారని. ఆ బొమ్మల్ని చేసిన మట్టే గుర్రంగా మారింది. అన్నిట్లో వున్నదీ ఒకే మట్టి కదండీ?" అన్నాడు నారాయుడు.

"నీరే బుడగ, బుడగే నీరు... మధ్యలో వచ్చిన గాలి అంటే 'రూపం' పోయింది అంతే. మట్టి మట్టే. అదేమీ మారలేదు. పోయినవి కుండ, వినాయకుడు అనే నామాలూ, రూపాలూ" నవ్వారు ఆచార్యులు.

*****

పాఠకులారా... యీ కథ కాని కథలో ఏమి అర్ధం అయిందీ? చీమకి తన తల్లిదండ్రులూ, అక్కచెల్లెళ్ళూ, అన్నదమ్ములూ ఎవరో తెలీదు. 'అహం' అనే పెంకుని చీల్చుకుని తన పని తను చేసుకుంటూ పోతుంది.

ఓ చిట్టి ఆవగింజ 'అహం' అనే గింజని చీల్చుకుని లోకంలోకొచ్చి తనని తాను పెంచుకుంది. దానికీ తెలీదు తన పుట్టుకకు కారణమైన ఆవ మొక్క ఎక్కడిదో, ఎవరి చేలేదో ఎవరు నాటారో.

ఓ గర్భిణీ రోడ్డు మీద నడుస్తోంది. ఆమె ఓ వలస కూలీ. నా అనేవారెవరూ దాపున లేనప్పుడు నెప్పులొచ్చి రోడ్డు మీద కూలబడింది. ఎవరు ఆమెని హాస్పటల్ కి చేర్చారో తెలీదు. కానీ, బిడ్డని చూసుకోగలిగింది. మాతృ మమకారంతో పెంచుతుంది. ఆ బిడ్డ ఏమవుతాడో తల్లికేం తెలుసు. తెలిసిందల్లా జన్మనివ్వడం ఒక్కటే.

శ్రీ అండ్ శ్రీమతి రంజిత్ కుమార్లు బిడ్డల్ని కన్నారు. కానీ వాళ్ళని మనుషులుగా కాక క్రోటన్ మొక్కల్లా తమకిష్టం వచ్చినట్టు పెంచాలనుకున్నారు. తమ తమ తీరని కోర్కెలనీ, సాధించిలేని విజయాల్నీ తమ బిడ్డల ద్వారా తీర్చుకోవాలనే వికృత ప్రయత్నం చేశారు. బిడ్డల్నే చివరికి ఆ ప్రయత్నంలో కోల్పోయారు.

కొన్ని ఉదాహరణలతో తనకి తెలిసిన జీవితాన్ని శ్రోతలకు వినిపించి, జ్ఞాన భిక్ష పెట్టే ప్రయత్నం చేశారు ఆచార్యులవారు.

ఒకటి మాత్రం నిజం. ఎవరి జీవితం వారిదే కానీ, ఏ ఒక్కరి అనుభవమూ మరొకరి అనుభవంతో సమం కాదు. 'నిన్ను

(26 వ పేజీ చూడండి )

# పూరి జగన్నాథ స్వామి వైభవం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ

పూరి జగన్నాథుని రథయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమైనది.కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాథ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.
స్కాందపురాణాంతర్గతమైన జగన్నాథ క్షేత్ర మాహాత్మ్యాన్ని యథామూలంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందండి.

- సంపాదకురాలు

" రాజా! ఈ ప్రతిమలను వస్త్రము లేకుండా ఎవరు చూడకూడదు, విష్ణువునకు నల్లని రంగు, బలభద్రునకి తెలుపు రంగు, సుభద్రకు కుంకుమ ఎరుపు,చక్రానికి ఎర్రరంగు వేయాలి. వేరు,వేరు అలంకారాలు చేయాలి.ఈ శిల్పాలను నారతో కప్పి ఉంచాలి. ప్రతి సంవత్సరం కొత్తనారను చుడుతు ఉండాలి. నీకోరిక తీర్చుటకే స్వామి ఇక్కడ ఆవిర్భవించాడు. సమస్త జీవరాసులు భగవంతుని దర్శించుకొని మోక్షాన్ని పొందుతారు. ఈ కల్పవృక్షానికి వాయవ్య దిశలో వందచేతులదూరంలో, ఒక భవనాన్ని నిర్మించు. ఈ భవనం నరసింస్వామి దేవాలయానికి ఉత్తర దిక్కున వేయిచేతులదూరంలో ఉండాలి. ఆ భవనంలో స్వామిని అక్కడ ప్రతిష్ఠించు. బోయవాడయిన విశ్వావసువు, పురోహితుడయిన విద్యాపతి వంశం వారికి మాత్రమే పూజించే అధికారం ఉంది." అని ఆకాశవాణి చెప్పింది. ( 1- 34 )

ఆ మాటలు విన్న రాజు చాల ఆనందించాడు. రాజు విగ్రహాలపై ఉన్న వస్త్రాన్ని తొలగించాడు. ఆవిగ్రహాలను చూచి అందరు ఆనందించారు. ఆకాశవాణి చెప్పినట్లు విగ్రహాలను అలంకరింప చేసారు.

ఉన్నత ఆసనంపై ఉన్న ఆ శ్రీకృష్ణుడు పద్మాసనంలో కూర్చుని ఉన్నాడు. ఆయన చూపులు పాపాలను నశింపచేస్తున్నాయి. నల్లని మబ్బులవలె ఉన్నాడు. పొడవైన భుజాలు ఉన్నాయి. తామరలవంటి కన్నులు ఉన్నాయి. బలరాముడు ఉన్నతమైన వక్షస్థలం ఉంది. నాగలి, చక్రము, గద, పద్మంధరించి ఉన్నాడు. కుండలలాలు, దండకడియాలు, కిరీటం, తురాయి ధరించు ఉన్నాడు.

వారిద్దరి మధ్య సుభద్ర ఉంది. ఆమె ముఖం విరిసిన కమలంలా ఉంది. ఆమె పాప సముద్రాన్ని దాటించగలదు. వరద, అభయ, హస్తాలతో, పద్మాన్ని ధరించి ఉంది. ఎర్రని శరీరం కలదై, అలంకారాలతో ప్రకాశిస్తోంది. ఆ ప్రతిమలు ఉదయిస్తున్న సూర్యునిలాగ ప్రకాశిస్తున్నాయి. రాజు భక్తి పరవశుడై



ఆనందంతోనమస్కరిస్తూ ఉండిపోయాడు. ( 35 - 50 )

" ఓ రాజా! నీ కోరిక తీరింది. ఈ భూమి మీద నీవు ఒక్కడివే ధన్యుడవు. స్వామి దారు రూపంలో ఇక్కడ ఆవిర్భవించాడు. ఈ స్వామిని స్తుతించు. నీ కోరికలన్ని తీరుతాయి" అని నారదుడు నవ్వుతూ అన్నాడు. ( 51 - 56)

స్కాంద పురాణంలోని వైష్ణవ ఖండంలో పురుషోత్తమ క్షేత్రవైభవంలోని జైమిని ఋషి సంవాదం అను పంతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

## 20 వ అధ్యాయం

## జైమిని - ఋషి సంవాదం

### ఇంద్రద్యుమ్న, నారదులు జగన్నాథుని స్తుతించుట.

" ఓ మురారీ! నేను పూర్వ జన్మలో ఎప్పుడు నీ పాదాలను అర్చించలేదు. ఆ కర్మ ఫలాన్ని ఇప్పుడు అనుభవిస్తున్నాను. దయాసముద్రుడవైన నీవు నన్ను రక్షించు. ఇంద్రాది దేవతల కిరీటాలలో ప్రకాశిస్తున్న నీ పాదాలు ఎక్కడ? రక్త, మాంసాదులతో నిండిన నా శరీరం ఎక్కడ? ఈ సంసార దుఃఖంలో ఉన్న నన్ను రక్షించు. అనేక జన్మలలో చేసిన పాపాలతో బాటు, చేసిన కొద్దిపాటి పుణ్య కర్మలు చేదు మాత్రలపై పూసిన తీపిలాగ ఉంది. పూర్వజన్మలలో చేసిన పాపకర్మల ఫలితాన్ని అనుభవిస్తున్న నేను నిన్ను ఎప్పటికి చేరుకుంటాను.

ఈ లోకంలో ఉన్న అనేకబంధాలనుపశువువలె అనుభవిస్తున్నాను. వాటినుండి దూరం చెయ్యి. దీన స్థితిలో ఉన్న ఏనుగును రక్షించావు. గడియారంలోని ముల్లువలె క్రిందకి, మీదకి తిరుగుతున్న నన్ను రక్షించు." అని ఇంద్రద్యుమ్నుడు ప్రార్థించాడు.

నారదుడుజగన్నాథునిఈవిధంగాప్రార్థించాడు. "యోగులచే ప్రార్థింపబడువాడా! మాయచే కప్పివేయబడిన చరా చరములు కలవాడా! మూడు తత్వాలు, మూడు దండాలు, మూడు అగ్నులచే, దేవతలచే స్తుతింపబడువాడా! గరుత్మంతునిచే సేవింపబడు వాడా! విశ్వరూపా! విశ్వ ప్రకాశా! విశ్వమే అవయవములుగా

కలవాడా! అన్ని లోకాలకు ఆత్మ స్వరూపుడైన వాడా! అన్ని లోకాలలోను సుఖాలు కల్పించిన వాడా! ఇంద్రాది దేవతలచే నమస్కరింపబడువాడా! నీకు నమస్కారం” అని ప్రార్థించాడు.( 1-26)

తరువాత మిగిలిన రాజులు, పండితులు, బ్రాహ్మణులు, విద్వాంసులు స్వామిని స్తుతించారు. ఇంద్రద్యుమ్నుడు బ్రాహ్మణుచే స్వామికి సకలోపచారాలు చేయించాడు. రాజు స్వయంగా నాలుగు మూర్తులను మంత్రయుక్తంగా అర్చించాడు. బలభద్రుని ద్వాదశాక్షరితో పూజించాడు. దేవీ సూక్తంతో సుభద్రను పూజించాడు. సౌదర్శన సూక్తంతో సుదర్శన చక్రాన్ని పూజించాడు. బ్రాహ్మణులకు దానం చేసాడు. (27-34)

గోదానం చేయడానికి కోట్లాది గోవులను తీసుకువచ్చారు. ఆ గోవుల గిట్టల తాకిడి వలన పెద్ద గొయ్యి ఏర్పడింది. గోదానం చేసేటప్పుడు విడిచిన నీటివలన పెద్ద సరస్సుగా మారింది. అక్కడ అందరు తర్పణాలు విడుస్తున్నారు, ఆ సరస్సును ఇంద్రద్యుమ్న సరస్సు అని పిలుస్తున్నారు. ఈ సరస్సు గంగా నదితో సమానమైనది.

అక్కడ రాజభవనాన్ని నిర్మించడానికి దైవజ్ఞులు ముహూర్తం నిర్ణయించారు. ఆ సమయానికి రాజు జగన్నాథుని తలచుకొని పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. వాస్తుహోమం నిర్వహించారు. బీదలకు దానాలు చేసాడు.

అశ్వమేధ యాగంలో నేను సంపాదించినది అంతా స్వామి మందిరం నిర్మించడానికి వినియోగిస్తాను. ఇంతకన్న భాగ్యము నాకు మరొకటి లేదు.బ్రహ్మ, శివుడు ఏవిధంగా జగన్నాథుని అర్చించి శక్తిని పొందెనో అదేవిధంగా నేను శక్తిని పొందుతాను. ఈ క్షేత్రం స్వామి శరీరం. ఇక్కడ స్వామిని అర్చిస్తే నాలుగు వర్ణాలవారు ధర్మాన్ని పొందుతారు. భూమండలంలో ఉన్న పూజాద్రవ్యాలన్ని తీసుకు వచ్చి స్వామిని పూజిస్తాను. స్వామికి తగిన ఆభరణాలు సంపాదించని నా పౌరుషం ఎందుకు? అని రాజు సభలో ప్రకటించాడు. ( 35 - 59)

స్కాంద పురాణంలోని వైష్ణవ ఖండంలో పురుషోత్తమ క్షేత్ర మాహాత్మ్యములోని జైమిని- ఋషి సంవాదము అను ఇరవై అధ్యాయం సమాప్తం.

## 21 వ అధ్యాయం

## జైమిని - ఋషి సంవాదం

### ( నారదుడు బ్రహ్మలోకానికి తిరిగి వెళ్ళుట)

ఋగ్వేద పండితుడైన ఒక పండితుడు రాజు దగ్గరకు వచ్చి, “ రాజా! నీవు చాల అదృష్టవంతుడవు. నీకోసం స్వామి ఇక్కడ అవతరించాడు. ఈ మూర్తిని ఆరాధించినచో ముక్తి సులభంగా లభిస్తుంది. దారు రూపంలో ఉన్న ఈ స్వామిని వేదాలు అంగీకరించాయి. బారత దేశంలో ఓఢ్రదేశం(ఒరిస్సా) ఉత్తమమైనది. ఇక్కడ ఉన్నవారు స్వామిని ప్రత్యక్షంగా చూడగలుగుతున్నారు. వేదాలలోను, స్మృతులలోను చెప్పిన మార్గంలో స్వామిని చేరడం కష్టం. ఇక్కడ ఉన్న స్వామిని అర్చించినచో ముక్తిని సులభంగా పొందవచ్చు. దర్శించినంత మాత్రాన వేయి అశ్వమేధయాగాలు చేసిన ఫలితం లభిస్తుంది. భక్తితో అర్చిస్తే బ్రహ్మసాయుజ్యాన్ని పొందుతాడు. దుఃఖాలు నశిస్తాయి. ఈ క్షేత్రంలో స్వామి మనకు అత్యంత సన్నిహితంగా ఉంటాడు. రాజా! నీవు ఇక్కడే నివాసం ఉండు. స్వామినిఅర్చిస్తూఉండు” అని బోధించాడు. (1 - 28) )

(ఇంకా వుంది)

# శ్రీ లక్ష్మి కవచం



పి భారతీ శర్మ

ఇది శుకునకు స్వయంగా బ్రహ్మ చెప్పిన కవచం. దీనిని ఒక్కసారి పఠించినా మహాలక్ష్మి ప్రసన్నురాలవుతుందని బ్రహ్మ వాక్యం.

అనేక జన్మల పుణ్యఫలంగా ఈ కవచం లభిస్తుందని, సకల పాపాలనూ, వ్యాధులనూ ఇది నశింపచేస్తుందని, గ్రహపీడ నుంచి విముక్తం చేస్తుందని, ఇంకా అనేక ఫలితాలను ప్రసాదిస్తుందని బ్రహ్మ చెప్పాడు. ఈ కవచం లోని విశేషం మహాలక్ష్మీ స్వరూపాన్ని కన్నులకు కట్టినట్టు అభివర్ణించటం. దానివల్ల ఆమె రూపాన్ని ధ్యానించటానికి వీలవుతుంది. ఈ కవచ పాఠం వల్ల కలిగే అనేక ఫలితాలను బ్రహ్మ వివరించాడు.

దీనిని భక్తి శ్రద్ధలతో పఠించినవారికి మహాలక్ష్మి అనుగ్రహం లభిస్తుందని పెద్దల వాక్యం.

అన్ని కోర్కెలను తీర్చునది, అన్ని పాపాలను నశింపచేయునది, ఘోరమైన వ్యాధులను నశింపచేయునది, నవగ్రహముల బాధను తొలగించునది, భూతప్రేతాది గ్రహములవలన ఏర్పడు బాధలను పెనుగాలి వలె పోగొట్టునది,, ఘోరమైన మృత్యువును శాంతింపచేయునది, తీవ్ర దారిద్ర్యమును నశింపచేయునది, కొడుకులను, మనుమలను ప్రసాదించునది, ఇష్టమైనవారితో వివాహము జరుగునట్లు అనుగ్రహించునది, దొంగలు, శత్రువులను నశింపచేసేది, జపించినవారికి అన్ని కోరికలూ తీర్చునది, అనేక జన్మల పుణ్యఫలముగా లభించునది, ముక్తిఫలాన్ని అనుగ్రహించునది, ధనమును, ధాన్యమును, మహారాజ్యమును, అన్ని సంపాదనలను ప్రసాదించునది. ఒక్కసారి స్మరించినంత మాత్రముననే



మహాలక్ష్మి ప్రసన్నురాలగునట్లు చేయునది అయిన మహాలక్ష్మి కవచమును చెబుతున్నాను. ఓయీ శుకుడా, ఏకాగ్ర మనస్కుడై వినుము.

పాలసముద్రము మధ్యలో కమలవనం ఉంది.దానిలో మణులతో చేసిన మంటపం ఉంది. ఆ మంటపం మధ్యలో జ్ఞానులచేత సేవింపబడుచున్నది. చక్కగా స్నానము చేసినది, పూలపరిమళములతో నిండిన శిరోజములు కలది, నిండు చంద్రుని వంటి ముఖము కలది. కమలముల వంటి కన్నులు కలది. మన్మథుని విల్లువంటి కనుబొమలు కలది, నువ్వు పువ్వుతో పోటీ పడు నాసిక కలది. మొల్ల పువ్వుల వంటి దంతములు కలది. మోదుగ చివుళ్ళవలె ఎర్రనైన పెదవులు కలది. అద్దములవలె నిర్మలమైన రెండు చెక్కిళ్ళతో వెలుగులీనునది. రత్నములతో కూర్చిన తాటంకములతో అందమైన చెవులు కలది. మాంగల్యా ఆభరణములతో కూడిన శంఖము వంటి మెడ కలది, సర్వ లోకములను కన్న తల్లి.

నక్షత్ర హారాలతో అందమైన స్తన కుంభములు కలది. రత్నములతో కూర్చిన భుజాభరణములతో కూడిన పద్మముల వంటి నాలుగు చేతులు కలది. కమలమును, కుంభమును, అభయ వరద ముద్రలనూ ధరించునది. నూగారుతోను, లోతైన నాభితోను మనోహరమైన ఉదరము కలది. నితంబ వస్త్రముతో ప్రకాశించు కటిదేశము కలది. బంగారు స్థంభములవంటి ఊరువులతో శోభించునది.

మన్మధుని కాహళుల గర్వమును పోగొట్టునటువంటి జంఘాలు కలది. విష్ణువునకు ప్రియమైనది. తాబేలు డిప్ప వంటి పాదపద్మములు కలది. చంద్రునితో సమానమైనది.

తామరమొగ్గలవంటి సుకుమారమైన అంఘ్రములు కలది, ఎల్లప్పుడును తృప్తి కలది, నారాయణునకు ప్రియమైనది, ఎల్లప్పుడూ దయామూర్తియైనది. కస్తూరి అద్దిన శరీరము కలది. అన్ని మంత్రముల రూపమైనది. వేదశాస్త్రముల రూపమైనది. పరబ్రహ్మమైనది. నారాయణుని భార్య అయిన లక్ష్మీదేవిని ఈ విధంగా స్మరించిన తరువాత కవచాన్ని పఠించాలి.

**కవచం:**

నా శిరస్సును మహాలక్ష్మి, నుదుటిని పంకజ, చెవులను రమ, కన్నులను నళినాలయ,



ముక్కును అంబ, వాక్కులను వాగ్రూపిణి, దంతములను నాలుకను శ్రీ, పెదవులను హరిప్రియ, గడ్డమును వరద, గొంతును గంధర్వసేవిత, రొమ్ము, పొట్ట, చేతులు, పృష్టములను రమ, కటి, తొడలు, మోకాళ్ళు, పిక్కలను రమ, అన్ని అవయవములను, ఇంద్రియములను, ప్రాణములను ఆయాస హారిణి, నా శరీరములోని ఏడు ధాతువులను, రక్తమును, శుక్రమును, మనస్సును, జ్ఞానమును, బుద్ధిని, గొప్ప ఉత్సాహము అన్నిటినీ పంకజ, నేను చేసిన ఏ కొంచెమైనా దాని నంతయూ ఇందిర, ఆయువును, భార్యను, భర్తను, కొడుకులను, కూతుళ్ళను లక్ష్మి కాపాడుగాక. నా పాతకములను నశింపచేయుగాక, నాకు కలుగు అరిష్టములను రమ హరించునుగాక.

నశించుటకు, మాయను, మృత్యువును జయించుటకు బకమును చేకూర్చి, అన్ని వాంఛితములనూ ప్రసాదించి కమలాలయ నన్ను రక్షించుగాక.

దివ్యమైన ఈ లక్ష్మీ కవచమును పఠించటం వలన అన్ని కోరికలు సిద్ధిస్తాయి. శాశ్వతంగా అన్నింటినుండి రక్షణ కలుగుతుంది.



దీర్ఘాయుష్మంతులవుతారు. ఎల్లప్పుడూ అన్ని సౌభాగ్యాలనూ పొందుతారు. సర్వజ్ఞులవుతారు. సమస్తమునూ దర్శించగలుగుతారు. ఇతరులకు సుఖమును కలిగించి, తాము సుఖములతో ప్రకాశిస్తారు. మంచి సంతానము కలుగుతుంది. పశుసంపద లభిస్తుంది. శ్రీమంతులవుతారు. దీనిలో సందేహము లేదు.

ఓయీ బ్రహ్మజ్ఞానీ, అటువంటి వారి ఇంటిలో దారిద్ర్యము గానీ, పాపములు గానీ సంభవించవు. ఆ ఇల్లు అగ్నిచే దగ్ధము కాదు. దొంగల భయము వుండదు.

భూత ప్రేతములు మొదలైనవి భయముతో దూరంగా పారిపోతాయి. ఈ కవచాన్ని వ్రాసి ఎక్కడ స్థాపిస్తే అక్కడ పై సిద్ధులు కలుగుతాయి. అకాల మృత్యువు సంభవించదు. మరణానంతరం ముక్తికి పాత్రులవుతారు. ఆయువును పెంచునది, పుష్టిని కలిగించునది, బుద్ధిని వృద్ధి చెందించునది, ధనమును ఇచ్చునది, పీడకలలను నశింపజేయునది. సంతానమును ప్రసాదించునది, పవిత్రమైనది, భయమును, బాధలను తొలగించునది మనస్సుకు ఆహ్లాదమును కలిగించునది. మహా మృత్యువును శాంతింపచేయునది. తీవ్ర రోగములను, జ్వరములను హరించునది. బ్రహ్మాహత్య మొదలైన వానినుండి విముక్తులను చేయునది. గొప్ప సంపదలను ప్రసాదించునది అయిన ఈ కవచమును సుఖములను కోరువారందరూ పఠించాలి. ధనమును కోరినవారికి ధనము, వివాహమును కోరినవారికి వివాహము, విద్యను ఆశించినవారికి విద్య, పుత్రులను కోరినవారికి గుణవంతుడైన కుమారుడు, రాజ్యమును కోరినవారికి రాజ్యము అంటే అధికారము లభిస్తాయి.

ఓయీ శుకుడా, నాచేత చెప్పబడిన ఈ మాట సత్యము. ఈ విధముగా దేవి కృప వలన శుకుడు ఈ కవచాన్ని పొంది, ఈ కవచము యొక్క అనుగ్రహము వలన అన్ని వాంఛితములనూ సాధించుకున్నాడు.

ఓంశాంతి: ఓం శాంతి:
ఓం శాంతి:

# పత్రిక పదవ పుట్టిన రోజు శుభాకాంక్షలు



చైతన్యం మాస పత్రిక "10 వార్షికోత్సవానికి " నా అభినందనలు:-

"చైతన్యం మాస పత్రిక" పాఠకులు అందరి మనసుని ఎంతో ఆకట్టుకోవడమే గాకా.. మరెంతగానో చైతన్య పథం ల్లో,ముందు ముందుకు దూసుకు వెడుతూ..అప్పుడే 9 వసంతాలు పూర్తి చేసుకుని 10 లోనికి అడుగు పెడుతున్నందుకు మా ఆనందాన్ని కూడా వ్యక్తం చేస్తూ, "ఆ మాస పత్రిక సారధి, మహిళా ఎడిటర్ శ్రీమతి తీగవరపు శాంతి గారికి, ఆవిడకి ఎంతో వెన్ను-దన్నుగా వుంటూ తన వంతు సహాయ సహకారాలను నిర్విరామంగా అందించే, వారి భర్త TNKS ప్రసాద్ గారికి" ప్రధమంగా నా హార్దిక శుభాభినందనలు తెలియచేస్తున్నాను. ఈ పత్రిక రూపంలో 'సామాజిక విలువలతో కూడిన' ఎన్నెన్నో అంశాల ద్వారా కూడా ప్రజలలో చైతన్యం కలగచేస్తే బాగుంటుందనే, గట్టి సంకల్పంతో 2010 లో విజయ-దశమి రోజున "చైతన్యం,సంకల్ప బలం" అనే పేరుతొ, పత్రికను ప్రారంభించడమే గాకా.. అందులో నావంటి రచయిత్రులకు వెనువెంటనే అవకాశం కలిగించడంతో, ఆ మొదటి సంచిక నుండే "మిస్ మేఘమాలా IAS" అనే సీరియల్ ని అందివ్వగలగడంతో..ఆ పత్రికతో చిరకాల సన్నిహితం ఏర్పడి ఉందనే భావన,నాలో ఎంతో సంతోషాన్ని కలిగిస్తూ వుంటుంది! అంతేకాదు,నేను "లోక్ సత్తా పార్టీ లో" నాయకత్వంతో, నావంతు బాధ్యతలు ని-ర్వహిస్తూ వస్తున్న కారణంగ..'చైతన్యం పత్రిక కి' సాటి రచయితుల లాగ "ఏదైనా కథ కాని, వ్యాసం కానీ" ఆ తర్వాత తర్వాత ఇద్దామనుకున్నా సాధ్యపడక, మధ్యలో కొంత కాలము గ్యాప్ రావడం నాకెంతో నిరాశ కలిగించే విషయమే అయ్యిందని కూడా చెప్పాలి! అయితే, తిరిగి మళ్ళీ ఇప్పుడు "సినిమా"ని (ఇదో సప్త వర్ణాల సినీ జగత్) నేపథ్యం-గా తీసుకుని, 'అందులో కార్మిక సమస్యని, ప్రభుత్వ విధానాన్నీ,లాక్ డౌన్ సమయంలో ఎదుర్కున్న ఇబ్బందుల-ను' కూడా కొంత క్రోడీకరింప చేస్తు'ధారావాహిక వ్యాస రూపకంగా' రాస్తూ, పాఠకుల ముందుకు వచ్చే అవకాశం, ఎడిటర్ శాంతి గారు ఇవ్వడం అన్నది నాకు రెట్టించిన ఉత్సహాన్ని కలిగిస్తోందనే చెప్పాలి. ఇన్ని సంవత్సరాలుగా చైతన్యం పత్రికలో,తమ తమ రచనా ప్రజ్ఞత్వంతో "ధారావాహికాలు కథలు, వ్యాసాలు, వివిధ క్షేత్రాలు - భగవత్ సంబంధ విషయాలతో పాటుగా, కొన్ని వీడియో రూపక అంశాలు వంటి వాటిని అందించే" ఆ ఆ రచయిత్రు-లు, రచయితుల పట్ల..ఎడిటర్ శాంతి గారు 'వారి మాట మంచితనంతో,మర్యాదతో కనబరిచే గౌరవాభిమానలు' ఆవిడకి వున్న సంస్కారాన్ని తేటతెల్లం చేస్తాయి.

ఈ ఆన్ లైన్ పద్ధతిలో కూడా "e- చైతన్యం పత్రిక" ప్రచురణ మొదలైనప్పట్టి నుండి,స్వదేశంలోనే కాకుండా ఇతర దేశాలు ఎన్నింటి నుండో కూడా..ఎంతో మంది తెలుగు పాఠకుల అభిమానాన్ని పెంపొందించుకో గలుగుతోంది అంటే, అది శాంతిగారి యొక్క చాకచెక్యమేను! ** అలాగే వేరే దేశాలలో వున్నా,ఇక్కడే దగ్గరగా వున్నా..పిల్లలు,భర్త మనస్ఫూర్తిగా అందించే సహకారమే "చేసే మంచి పనికి,ఆ మనిషికి..ఎంతో ప్రోత్సహాన్ని,ఊపిరిని అందిస్తాయని" ఆత్మ సంతృప్తితో వేగంగా ముందుకు అడుగులు వేస్తున్న, శ్రీమతి శాంతి గారిని చుస్తే అర్ధమవుతుంది.

ఇదే సపోర్ట్ ఆవిడ కుటుంబం నుండి వేయేళ్ళకి, స్నేహశీలి శాంతిగారికి అందాలని"చైతన్యం పత్రిక వార్షికోత్సవా-లు" ఇలాగే మరెన్నెన్నో జరుపుకోవాలని హృదయపూర్వకంగా మరొకసారి కోరుకుంటూ..

నండూరి సరోజా దేవి. (రచయిత్రి)

# సప్త మోక్ష నగరాలు



కొత్త రామానందం

జీవితం ---- ముఖ్యంగా మానవ జీవితం గొప్పది. అమూల్య మైనది. ఆధ్యాత్మిక లో చెప్పాలంటే దుర్లభమైనది. కేవలం లౌకిక జీవితాన్ని ఆరాధించే వారి సంగతి పక్కనుంచితే భగవంతుడే పర-మావధిగా ఆయనను పొందేందుకే మానవ జీవితం అనే స్పృహ కలిగి, ఆ గమ్యానికే దృఢ చిత్తంతో సమాయతమైన వారికి జీవితం అపురూపమై నది. మానవ జన్మ ఓ దివ్య వరంగా లభించింది. దీనిని దుర్వినియోగం చేసుకోకూడదంటారు మన పెద్దలు. జ్ఞానం లేకుండా ముక్తి లక్తి భించదు. అందుకే మహాపురుషులను ఆశ్రయించి, ఆత్మ --పరమాత్మ జ్ఞానం పొందాలి. ధర్మార్థ కామమోక్షాన్ని విడిచి మధ్య ఉన్న అర్థ కామాల వెంట నేటి మనిషి పరుగులు చేస్తు న్నారు. పరమాత్మ పట్ల చిత్తం అంటే మనసును లగ్నం చేయాలి. మన మనసు ప్రవర్తనను నిరోధించడమే యోగం.

ఎన్ని ఒడుడుకులు ఎదురైనా పదిలంగా బతకాలని ప్రతి జీవి తాపత్రయపడుతుంది. అందులో ప్రమా-దరహితంగా, ప్రమోద భరితంగా సాగాలనే కాంక్ష అంతర్లీనమై ఉంటుంది. జటిల సమస్యలు ఎదురైన-ప్పుడు ఏమైనా మహిమాన్విత శక్తి తనకు సహక క్తి రించాలని ఆశించడం సహజం. భగవంతుని అను-గ్రహం పొంది, సమస్యలను అధిగమించగల శక్తి పొందాలనే ప్రయత్నమే --- భక్తి మార్గం. భగవంతుడు అపార కరుణా సముద్రుడు. దయాళుడు. ఆయన మానవునికి సద్బుద్ధినిచ్చి సన్మార్గంలో నడిపిస్తా డు. అందరికీ ప్రేరణ ఇస్తాడు. ఆయన ప్రేరణ జగతి జాగృతికి ఆధారం. భవ బంధాలనుండి విముక్తి చేయ-డానికి ఎన్నెన్నో మార్గాలు చూపాడు. ఎన్నో దివ్య ధామాలను సృష్టించాడు. వేదాలు పుట్టిన ఈ పవిత్ర భూమిపై ముక్తి ధామాలుగా సప నగరాలు ఉన్నాయి. అందు పరమాత్మ అనేక అనేక అవతారాలుగా ఉద్భవించి దుష్ట శిక్షణలు గావించి తన మహిమలతో కృపాదృష్టితో కాపాడుతున్నాడు, మరియు నూ-తనోత్సాహాన్ని నింపుతున్నాడు.. "అయోధ్యా, మధురా మాయా, కాశీ కంచి అవంతికాపురి ద్వారవతి చైవ సప్తైతే మోక్ష దాయకా" భారత దేశంలో అనేక దివ్య క్షేత్రాలు ఉన్నాయి. అయితే సప మోక్ష నగరాలు మోక్ష ధామాలుగా ప్రసిద్ధి గాంచి మనందరకూ సుఖ శాంతులు, విజయ కాంతులు ప్రసాదిస్తు న్నాయి. అం-దువల్ల మనకు ఆధ్యాత్మిక చైతన్యం విరాజమానమై దైవం పట్ల భక్తి ప్రపక్తి త్తులు పెరిగి ఆత్మ విచారణ చేయగలుగుతున్నాము. ధర్మ బద్ధమైన జీవనాన్ని ఎంపిక చేసుకుని పుణ్య క్షేత్రాలను సందర్శిస్తూ ముక్తి కోసం ప్రయత్నించడం మన ధ్యేయంగా చేసుకోవాలి. ముఖ్యంగా జీవిత కాలంలో సప్త మోక్ష ధామాలను దర్శించి పునీతులమవ్వాలి. భగవంతుడు భక్తుని నుండి కోరుకునేది కూడా అదే.

ఆసేతు హిమాలయ పర్యంతం వ్యాపించిన మన భారతావనిలో ఎన్నో జాతులు, తెగల ప్రజలు, భాషలు ఉన్నా మొత్తం జాతినంతటినీ సమైక్య పరచి ముందుకు నడిపిస్తోంది మన సనాతన సంస్కృతి. అట్టి సంస్కృతికి ప్రతిరూపాలు మన పుణ్య క్షేత్రాలు, తీర్థాలు. వాటిలో అనాదికాలం నుంచి విఖ్యాతి చెంది భక్తులకు మోక్షదాయికాలుగా ఏడు పుణ్య క్షేత్రాలు అత్యంత ప్రాముఖ్యత పొందాయి.

**అవి అయోధ్య, మధుర, మాయ (నేటి హరిద్వార్), కాశీ, కంచి, అవంతిక(నేటి ఉజ్జయిని) మరియు ద్వారక.**

# 2. మధుర

## పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం
## ధర్మ సంస్థాపనాయ సంభవామి యుగే యుగే

(గత సంచిక తరువాయి)

**బృందావనం - ఆలయాలు**



**1) ప్రేమ మందిరం :**

ఈ ఆలయాన్ని దర్శించుకున్న ప్రతి భక్తుడూ కృష్ణుడి మధుర స్మృతులు తన కళ్ళ ముందుకు కానవస్తాయి. విభిన్న లోకాలకు స్వామితో కలిసి విహరిస్తున్న అనుభూతి కలుగుతుంది. ప్రముఖ కృష్ణభక్తుడు, ధర్మ నిరతుడు అయిన శ్రీ కృపాళు మహారాజ్ వారి మార్గదర్శకత్వంలో భవన నిర్మాణం జరిగింది. ఇది అత్యంత సుందర మందిరం. రోజూ వేలాది భక్తులు ఈ ఆలయాన్ని భక్తి శ్రద్ధలతో దర్శించుకుంటారు. కృష్ణాష్టమి వేడుకలు అంగ రంగ వైభవంగా జరుపుతారు. ఎన్నెన్నో నృత్యాలు తిలకించవచ్చును.

**2)బంకే బిహారీ ఆలయం:**

కృష్ణుడు అని అర్థం. 1862 లో ఈ ఆలయాన్ని నిర్మించారు. స్వామి హరిదాస్ కు నిధివనంలో కన్నయ్య విగ్రహం లభించింది. ఆ విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠించారు.

**3) శ్రీ రంగాజీ ఆలయం:**

1858 సంవత్సరంలొ దక్షిణ భారత సంప్రదాయంలో నిర్మించిన ఈ ఆలయం ఆరు అంతస్థుల రాజగోపురంతో భక్తులను ఆకర్షిస్తుంది. ఇక్కడ గుడిలో శేషశయ్యపై శ్రీ రంగనాథస్వామి దర్శనమిస్తారు. ఆలయ ప్రాంగణమంతా చక్కటి శిల్పాలతోను, ధ్వజ స్థంభానికి బంగారు పూత ఉన్నందువల్ల విశేష ఆకర్షణ లభించింది.

**4) బడే కుంజ్ గోపీశ్వర మందిరం:**

ఒకసారి ఈశ్వరునికి కృష్ణుడితో కలిసి రాసక్రీడలో పాల్గొనాలనే కోరిక కలిగింది. అయితే అక్కడ పురుషులకు ప్రవేశం లేదు. అందుకని పార్వతి సలహాపై స్త్రీ వేషం ధరించి అయినా సరే రాసలో పాల్గొన నిశ్చయించాడు. ఆ వేషంతో కృష్ణుడితో రాసలో పాల్గొన్నాడు. అందంగా ఉన్న కొత్త స్త్రీని చూసి రాధ ఈర్ష్య పడింది. రాస జరుగుతుండగా శివుడి మేలిముసుగు జారి ఆయన జటాజూటం బయటపడింది. శివుడని తెలిసి అక్కడివారు సంతోషించారు.

ఈ గుడిలో రాత్రి శివునికి రాత్రి పూట స్త్రీ అలంకారం చేస్తారు. లింగం మీద గోపిక వేలిముద్రలు స్పష్టంగా కానవస్తాయి. ఆలయంలోని లింగం చిన్నదిగా నేల బారుగా ఉంటుంది. అందరూ చేతితో తాకి పూజలు చేసుకోవచ్చు.

**5) స్నేహ బిహారీ మందిర్:**

బృందావనానికి నడిబొడ్డులో ఉన్న ఈ మందిరం హరిదాసీయ సంప్రదాయంగా ఉంటుంది. పాత ఆలయం స్థానంలో

అత్యంత సుందరమయిన మందిరాన్ని తెలుపు, ఎరుపు రాళ్ళు పొదివి నిర్మాణం చేపట్టారు.

**6) జైపూర్ ఆలయం:**

ఈ దేవాలయాన్ని మాధోసింగ్ మహారాజు నిర్మించి రాధామాధవులకు అంకితం గావించాడు. ఆలయ మూలవిగ్రహాలు అత్యంత ఆకర్షణీయంగా ఉంటాయి.

**7) మీరాబాయి మందిరం:**

నిధివనానికి చేరువలో ఈ ఆలయం మీరాబాయి రచించిన కృష్ణ గీతాలతో ఈ ప్రాంగణమంతా మారుమోగుతుంటుంది. మీరాబాయి కృష్ణ భక్తురాలు. ఆమె ఈ ఆలయంలో కృష్ణునిపై చక్కటి పాటలు రచించి పాడుతూ కృష్ణునిపైనే తన మనస్సు లగ్నం చేసింది. ఆమె ధన్యురాలు. 1547 సంవత్సరంలో మీరాబాయి ఈ ఆలయంలోని కృష్ణునిలో లీనమైపోయింది. మానవజాతికి ఆమె గీతాలు ముక్తిమార్గాలు.

**8)మదన మోహన ఆలయం:**

ఈ కృష్ణ మందిరాన్ని మత్రోస్ కు చెందిన రామదాసు నిర్మించాడు. నగరంలోని ఆలయాలలో-బహుప్రాచీనమైన ఆలయంగా గుర్తింపబడింది. ఆలయంలోని విగ్రహం రాజస్థాన్ లో ఉంచారు. ప్రస్తుతం మనం చూచే విగ్రహం పాత విగ్రహానికి ప్రతిరూపంగా ఉంటుంది.

**9) రాధా గోవింద మందిరం:**

అక్బర్ కు ఆప్తుడైన రాజా మాన్ సింగ్ నిర్మించిన ఏడు అంతస్థుల ఎర్ర రాతి మందిరం ఇది. పాత మందిరం స్థానంలో 2000 సంవత్సరంలో కొత్త ఆలయాన్ని అందంగా నిర్మించారు.

**10) సేవా కుంజ్:**

ఇచ్చటి వఇహరిస్తారట. నాలను రాధామాధవులు, గోపికలు రాసలీలకు ఎంచుకున్నారు. ఇప్పటికీ రాత్రిపూట రాధాకృష్ణులు విహరిస్తారట. ఈ ప్రాంతాన్ని రాత్రి సమయంలో చూడటానికి అనుమతించరు. ఇచ్చటి దాస ఆనందమూర్తి అయిన శ్రీ కృష్ణ భగవానుని ప్రధానలీల ఇది. ఇది జీవునికి విషయ వాసనలనుంచి విముఖుని చేసి చిదానందత్వం వైపు మరలిస్తుందని భావం.



రాధ, వృషభాన మహారాజు గారు యమునాస్నానం చేస్తున్న సమయంలో ఓ కమలమందు చిన్న పాపగా కనిపించింది.

ఆ రాజు ఆ పాపను సంతోషంగా తన కూతురుగా స్వీకరించి అల్లారుముద్దుగా పెంచి పెద్దచేశారు. ఆమె కళ్ళు మూసుకునే ఉండేది. అయితే ఒక పర్యాయం నందరాజు, కృష్ణయ్య వాళ్ళ ఇంటికి వచ్చి, కన్నయ్య ఊయలలో ఉన్న పాప వద్దకు వచ్చాడు. కృష్ణుని దేహం నుంచి వచ్చే అద్భుత సుగంధానికి రాధ ప్రభావితురాలై కనురెప్పలు తెరిచి తన ప్రియ సఖుని చూసింది.

రాధామాధవులు గోకులంలో ఉన్నంత కాలం వనవిహారం చేస్తూ గోపికలతో ఆటపాటలలో మునిగితేలేవారు. వారి ప్రేమ అమర ప్రేమ. నిష్కళంక ప్రేమ. కృష్ణుడు పరమాత్మ అయితే రాధ ప్రకృతి. కృష్ణుని మురళీ గానంతో మైమరచి ఆనందడోలికలలో మునిగిపోయేవారు.

మోక్షమంటే ఆనందమే అయితే అందుకు హామీని ఇచ్చేది బృందావనం. కృష్ణుణ్ణి వెతకటానికి దగ్గర దారి ఖచ్చితంగా బృందావనమే. బ్రతుకు బాధలు మరచిపోయి, వెతల వేదనలు తీరి, కష్టాల కన్నీళ్ళు కరిగిపోయి, బ్రహ్మానందాన్ని దోసిళ్ళతో జుర్రుకోవాలంటే బృందావనాన్ని జీవితంలో ఒకసారైనా దర్శించాల్సిందే.

(ఇంకా వుంది)

# సినిమా!

## (ఇదో సప్త వర్ణాల సినీ జగత్)



నండూరి సరోజాదేవి

సినిమా రంగానికి సంబంధించి.. నేను రాసినట్టు"ఇప్పటి తరం నటీ నటులు..తమ సీనియర్స్ ని చూసి,అవగాహన ఏర్పర్చుకుంటూ ఉపయోగకర పద్ధతులను నేర్చుకోవడం అన్నది,ఎలాగూ వారి భవిష్యత్ కి మరింత తీర్చి దిద్దేదే అవుతుందీ."

అలాగే! ఈ కాలపు చిత్రాల యొక్క "సినీ డైరెక్షన్ విధానంలో, పాటలు-గాయని,గాయకుల విషయంల్లో, మ్యూజిక్ డైరెక్షన్ పరిధికీ "సంబంధించిన వాటిని ఎన్నెన్నింటినో..'ఇప్పటి నూతన డైరెక్టర్లు, మ్యూజిక్ డైరెక్టర్లు,ఈ మధ్య బాగా వెలుగులోకి వస్తున్న యువ గాయని,గాయకులూ కూడా' తమ తమ సీనియర్స్ యొక్క ప్రసిద్ధ విధాన సరళిని ఆకళింపు చేసుకునే ప్రయత్నం చేసి, ఆ సాధనతో ముందడుగు వేస్తే.. 'మరింత మంచి సినిమాలను, ఇంకా చక్కని మ్యూజిక్ ని, వీనుల విందైన అన్ని పాటలని' ప్రేక్షకులకి అందిస్తూ,వారి అభిమానాన్ని ఇంకెంతగానో పొందడం సాధ్యమౌతుందనుకుంటాను.

పైన ఆ విధానాల అన్నింటి విషయమై అలా వివరంగా తెలియ చెప్పాను అంటే.."ఇప్పుడు వచ్చే సినిమాలు బాగో లేవు అన్నది నా ఉద్దేశ్యం కాదూ,ఎవ్వరు దాన్ని అన్యధాగా కూడా భావించద్దు!" వాటి గురించి ఒక క్లారిటీగా చెప్పాలంటే మాత్రం..

"ఈనాటి సినిమాలు తీసే పద్ధతి అయితే చాలా మారింది. కొత్త టెక్నికల్ ఎక్విప్మెంట్స్ వాడకం జరుగుతోంది కాబట్టే అతి తొందరగా, తక్కువ సమయంలో పిక్చెర్స్ తీయబడుతున్నాయనీ
వింటున్నాము." అలాగే కొన్ని సినిమాలు 'చక్కని కధాంశంతో, ఈ కాలం కుర్రకారు కి ఎంతగానో నచ్చే తీరులో,చిన్న కథలుగా,ఒక ఆలోచనా విధానంతో వుంటూ' బాగానే వస్తున్నాయి. కొన్ని పాటలు, వినసొంపైన మ్యూజిక్ తో చాలా బాగా కుదురుతున్నాయని కూడా చెప్పాలి.

అయితే, "స్క్రిప్ట్ విషయాన మాత్రం" కొన్ని కొన్ని సినిమాలకి ఒక్కొక్కసారి ప్లానింగ్ పూర్తిగా ఉండదనీ.. అవసరాన్ని బట్టి, సందర్భాన్ని బట్టి కొన్ని కొన్ని సీన్స్ ని కూడా ఈజీగా అప్పటికప్పుడు మార్పు చేసేయడం, కథలో క్రొత్త పాయింట్స్ ని మరి కాస్త కలుపుతూ, కొన్ని డైలాగులను సహితం అనుకున్న ఆ క్షణాన్నే రాయడం వంటివి కూడా జరుగుతూ ఉంటుందనీ" అందుకే ఆ సినిమాల కంటిన్యూషన్ అంత సక్రమంగా వుండటం లేదనే విమర్శ,సహజంగా చాలా మంది నుండి వింటూనే ఉండడం అవుతుంది.

**ఇక ఇక్కడ పాత సినిమాల గురించి చెప్పుకోవలసి వస్తే,"ఆ సినిమాలు తీయబడడానికి యూనిట్ పడే కష్టం, శ్రమలను బట్టి, చిత్ర కధాంశాన్ని బట్టి, తారల నటనా వైవిధ్యం, వారి చూడ చక్కని రూపాల కారణంగానూ, ఆ సినిమాలు, అందులోని మాటలు-పాటలు,సంగీతం కూడా ఎంతో రాణింపుగా వుండి" ప్రేక్షకులు, అభిమానుల నుండి వాటి రిజల్ట్ కూడా అద్భుతంగా రావడంతో.. ఆ సినిమాలు చాలా వరకు '100 రోజులు,కొన్ని కొన్ని అయితే ఒక ఏడాది పాటు' థియేటర్లలో ఆడడం జరుగుతూ ఉండేవి!

అంతే కాదు! "ఆ ఆ చిత్రాలకి మొత్తం కథ రెడీ చేసుకున్నాకే.. సినిమాల షూటింగ్ ప్రారంభించుకునే వారు కాబట్టే" ఆ సినిమాలు సంతృప్తికరంగా వచ్చేవి అని, ప్రేక్షక జనం అందరు క్కూడా అవి చూడ చక్కని చిత్రరాజాలుగా అభివర్ణించుకునే వారనడంలో, ఏ మాత్రం ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదేమో.

00000000

1.*సినిమాల వివరాలు అన్నీ రాస్తున్న సందర్భాన..మీకు ఒక ముఖ్యవిషయం కూడా వెల్లడి చేయాలి అనిపిస్తోంది!

టీ.వీ లో చాల కాలం ప్రసారమైన "ఝుమ్మంది నాదం" ప్రారంభం అప్పుడు,ఆ కార్యక్రమంల్లో 'గాన కోకిల శ్రీమతి సుశీల' కూడా వెలుబుచ్చిన చక్కని అభిప్రాయాలు విన్నప్పుడు.. నాకు అదెంతో వాస్తవంగా, నా యొక్క ఆలోచనకు దగ్గరగా అనిపించింది!

**(ఈ ఎపిసోడ్ 7 సం// ల క్రితం వచ్చింది..నేను ఈ మధ్యన మళ్ళీ చూడ్డం జరిగింది)..అందుకే, అది ఇంచుమించుగా కొంత మీ ముందు పెడుతున్నాను :-

"ఆ ప్రోగ్రాం కి గాయని P.సుశీల గెస్ట్ అయితే..ఉపద్రష్ట సునీత యాంకరింగ్ చేసింది" :- ఇది వారి ఇరువురి మధ్యన సరదా నవ్వుల సంభాషణగ కూడా జరిగింది. ఆ వివరాలు ఇలా..

(ఇంకా వుంది)

# పదునాలుగవ రాష్ట్రపతి

# రామ్ నాథ్ కోవింద్



పాలెపు బుచ్చిరాజు

రామ్ నాథ్ కోవింద్ జననం 1945 అక్టోబరు 1వ తేదీన జరిగింది. ఆయన పుట్టినది ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో, కాన్పూర్ దేహాత్ జిల్లాలోని "పరౌఖ్' అనే కుగ్రామం. తల్లి పేరు కళావతి. తండ్రి పేరు మైకూ లాల్. ఆయనకి కిరాణా సామాను, బట్టలు అమ్మే చిన్న దుకాణం ఉండేది. దాని మీద వచ్చిన ఆదాయమే వారి జీవనాధారం. మైకూ లాల్ కి కొంత ఆయుర్వేద వైద్యం చేయడం కూడా వచ్చును.వనమూలికలు,చూర్ణాలు తెచ్చి ఊరి వారికి ఉచితంగా వైద్యం చేసేవాడు. ఆ గ్రామంలో సింహభాగం జనాభా అంతా బ్రాహ్మణులు, ఠాకూర్ లు వంటి అగ్రకులాల వారు. వారంతా సంపన్నులు. దళితుల కుటుంబాలు నాలుగు మాత్రమే ఉండేవి. వాటిలో వీరిది ఒకటి. వెనుక బడిన జాతివారు కనుక సహజంగానే కోవింద్ కుటుంబం నిరుపేదలు. వారు నివసించేది ఒక పూరి గుడిసె. కోవింద్ కి నలుగురు అన్నలు, ఇద్దరు అక్కలు ఉండేవారు.


కోవింద్ కి వెనుకబడిన జాతుల వారు ఎంతటి నికృష్టమైన జీవితం గడుపుతున్నారో, వారి పరిస్థితి ఎంత దయనీయమైనదో సమాజంలో వారి స్థానం ఏమిటో, బాగా చిన్నతనంలోనే అవగాహనలోకి వచ్చింది. ఆయన సుమారు అయిదేళ్ళ వయసులో ఉండగా, వారు నివసించే ఇల్లు ప్రమాదవశాత్తూ నిప్పంటుకుని కాలిపోయింది. ఆ సమయంలో అంతా బైట పడ్డారు కాని తల్లి లోపలే ఉండిపోయింది. వారు అంటరాని వారు కనక ఊరి వారెవరూ సహాయం చేయడానికి ముందుకు రాలేదు. ఈ సంఘటన చిన్నారి కోవింద్ మనసులో చెరగని ముద్ర వేసుకుంది. ఆ తరవాత వెనుకబడిన వారికి సహాయం చేయడంలో ఆయన ఎప్పుడూ వెనుకంజ వేయలేదు.




చిన్నప్పటినుంచి కూడా కోవింద్ కి చదువుకోవడం అంటే చాలా ఇష్టం. ఉన్న ఊరిలో వానాకాలం చదువు మాత్రమే సాగింది. కాస్త మంచి బడిలో చదవాలంటే, అక్కడికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న 'ఖాన్‌పూర్' వెళ్ళాలి. రాజ్ కిషోర్ సింగ్ అనే మరొక మి-

త్రుడితో కలిసి అంత దూరం రోజూ నడిచి వెళ్లి చదువుకున్నాడు. నడక దారే తప్ప మరొక గత్యంతరం లేదు. రోడ్లు లేవు. అయినా సైకిలు కొనే సామర్థ్యం కూడా లేదు. మిత్రుడు అయితే అక్కడితో చదువుకు స్వస్తి చెప్పి, బడి పంతులు అయ్యాడు. కాని కోవింద్ కి కాలేజికి వెళ్లి ఇంకా పై చదువులు చదవాలని కోరిక గా ఉండేది. తెలివైన వాడు. ఎప్పుడూ పరీక్షల్లో తప్పలేదు. అందువల్ల అందరూ ఆయన్ని ప్రోత్సహించారు. పట్టుదలతో కాన్పూర్ సిటీకి వెళ్లి అక్కడ దయానంద్ ఆంగ్లో వేదిక్ కాలేజీలోను, డి ఎ వి కాలేజి లోను, బికాం, ఎల్ ఎల్ బి పూర్తి చేశాడు. ఆయన కాంక్ష అంతటితో తీరలేదు. దిల్లీ లో మకాం పెట్టి, ఐ. ఏ. ఎస్. పరీక్షకి కట్టాడు. ఆ కోరిక అయితే ఆయనకు తీరలేదు కాని దిల్లీ నివాసం ఆయన జీవితాన్ని ఒక పెద్ద మలుపు త్రిప్పింది ఆ రోజుల్లో ఉజ్జయినికి చెందిన 'హుకుం చంద్' అనే జన సంఘ్ కార్యకర్తతో పరిచయం కలిగింది.

అది మొదలు కోవింద్ రాజకీయాల్లో ఉత్సాహంతో పాల్గొనడం ప్రారంభించాడు. ఎలాగూ తనకి న్యాయ శాస్త్ర పట్టా ఉంది కాబట్టి 1971వ సంవత్సరంలో దిల్లీ బార్ కౌన్సిల్ లో లాయరుగా రిజిస్టరు చేయించుకున్నాడు. ప్రాక్టీసులో మంచిపేరు సంపాదించాడు. తరువాతి కాలంలో 1977-1979 సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం తరపున లాయరుగా నియమించబడ్డాడు. అదే సమయంలో అప్పటి ప్రధాన మంత్రి మొరార్జీ దేశాయ్ కి అంతరంగిక సచివుడిగా కూడా పని చేశాడు. అడ్వొకేట్ గా ప్రాక్టీసు చేస్తూనే, 1991వ సంవత్సరంలో భారతీయ జనతా పార్టీలో చేరి ఉత్తర ప్రదేశ్ నుంచి లోక్ సభకి పోటీ చేశాడు. కాని విజయం సాధించ లేకపోయాడు. ఆఖరికి 1994వ సవత్సరంలో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక అయ్యాడు. ఢిల్లీ హైకోర్టులోను, సుప్రీం కోర్టులోనూ పని చేసే సమయంలో వెనుకబడిన వర్గాల వారిని ఆదుకోవడానికి చాలా కృషి చేశాడు. దళిత, అనుసూచిత జాతుల ఆందోళన సమయంలో,



1997వ సంవత్సరంలో వారి తరపున ప్రభుత్వంతో పోరాడి, రాజ్యాంగంలో చేసిన మార్పుల్ని సరిదిద్దడంలో ముఖ్య పాత్ర పోషించాడు.

ఒక పేద కుటుంబంలో పుట్టి, స్వశక్తితో అంచెలంచెలుగా ఎదిగి ఢిల్లీ సభలో పీఠం వేసినా, కోవింద్ తన జన్మ భూమి అయిన 'పరౌఖ్' గ్రామాన్ని ఎన్నడూ మరిచి పోలేదు. అప్పటికి వారి కుటుంబం కారణాంతరాల వల్ల వివిధ ప్రదేశాల్లో స్థిరపడ్డారు. ఆయన పుట్టిన ఇల్లు కూలిపోయి శిధిలావస్థలో ఉంది. ఆయన 2001వ సంవత్సరంలో ఆ స్థలాన్ని దానం చేసి, అదే స్థలంలో ఒక మంచి డాబా ఇల్లు కట్టించి, ఊరివారు దానిని కమ్యూనిటీ హాలుగా వాడుకోవడానికి ఇచ్చాడు. దానిలో వారు ఉచితంగా పెళ్ళిళ్ళు,

సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాలు జరుపుకోవచ్చు. దానికి 'మిలన్ కేంద్రం' అని పేరు పెట్టి, ఆ స్థలం తన తండ్రిది కనుక ఆయనకే అంకితం చేశాడు. అదే సమయంలో అక్కడ మరొక సంఘటన కూడా జరిగింది. ఆ గ్రామంలో సంపన్నుల కుటుంబాలు ఎక్కువ కదా!. వారంతా తమ పల్లెనుంచి, అంత గొప్ప గౌరవాన్ని సాధించిన కోవింద్ ని సన్మానించాలనే ఉద్దేశంతో ఆయన కోసం పదకొండు వెండి కిరీటాల్ని, ఒక బంగారు కిరీటాన్ని తయారుచేయించి, బహుమతిగా ఇవ్వాలని సంకల్పించారు. కోవింద్ మర్యాద పూర్వకంగా వాటిని తిరస్కరించి, ఆ డబ్బుతో ఊరిలోని పేద ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు చేయమని సలహా ఇచ్చాడు. ఈ సంఘటన ఆయనలోని వ్యక్తిత్వాన్ని చెప్పకనే చెప్పుతుంది.

కోవింద్ సహజంగా చాల బిడియం కల మనిషి, మితభాషి.. సంకోచం ఎక్కువ. అలాగని ఓటమిని మౌనంగా అంగీకరించే రకం కాదు. ఆయన కేంద్రంలో అధికారంలో ఉన్నంత కాలం తన ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కొంత సహాయం అందిస్తూనే ఉన్నాడు. ఉత్తర ప్రదేశ్ లోను, ఉత్తరాఖండ్ లోను విద్యారంగంలో విశేష కృషి చేసి, తన




నియోజక వర్గంలో ఎన్నో పాఠశాలల స్థాపనకి తోడు పడ్డాడు. తనకి జన్మనిచ్చి ఇంతటి వాడిని చేసిన తన జన్మ భూమికి చేయగలిగినంత సహాయం చేసి, తన ఋణం తీర్చుకోవాలనేది ఆయన జీవితాశయం. కోవింద్ హయాంలో 'పరౌఖ్' గ్రామానికి పక్కా సిమెంటు రోడ్డు ఏర్పడింది. దగ్గరలో ఉన్న ఇటుకల కార్ఖానాకి దారి ఏర్పడింది. దానితో కూలీల రాకపోకలకి సులభ మార్గం ఏర్పడింది. గ్రామానికి నాలుగు బోరుబావులు వచ్చాయి. ప్రజలకి మంచినీటి కొరత తీరింది. ఉన్న బడికి ప్రహరి గోడ కట్టించాడు. జూనియర్ కాలేజి ఏర్పాటు చేయబడింది. భారతీయ స్టేట్ బ్యాంకు బ్రాంచ్ వచ్చింది. ఈ అభివృద్ధి అంతా మా 'దాదాజీ' (కోవింద్) వల్లనే అని సగర్వంగా చెప్పుకుంటారు అక్కడి వారు. ఆయన బంధువర్గంలోని వారిలో కొందరు ఇంకా అక్కడే స్థిరపడిన వారు ఉన్నారు.

మన దేశంలో పల్లెటూళ్ళ పరిస్థితి ఎంత దయనీయం అంటే, రాష్ట్రపతివంటి అధికారికి కూడా అన్ని విషయాల్లోనూ వాటిని అభివృద్ధి పరచడం అంత సులభం కాదు. ఇంత చేసినా, పరౌఖ్ ఇంకా లోటులోనే ఉంది. అక్కడ సరైన వైద్య సదుపాయాలు లేవు. ఏజబ్బు వచ్చినా పది కిలోమీటర్ల దూరం పోవాలి. కొంచెం పెద్ద రోగమైతే, ఏకంగా 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాన్పూర్ జిల్లా ఆసుపత్రికి పోవలసిందే! 2011లో ప్రారంభం అయిన ఆసుపత్రి భవనం పూర్తి కానేలేదు. ఇక విద్యుత్తు సరఫరా గురించి చెప్పనే అక్కర లేదు. చిన్న గాలి వీస్తే, కరెంటు పోతుంది. ట్రాన్స్ ఫార్మర్ పాడయితే, పదిహేను రోజులపాటు చీకటిలో భజన చేయవలసిందే! కూలీ నాలీ చేసుకుని బతికే జనం దగ్గరలో పరిశ్రమలు

లేక, సుదూర ప్రాంతాలకి వలస పోవాలి.

కోవింద్ ఒకసారి 2016వ సంవత్సరంలో స్వగ్రామానికి వెళ్ళినప్పుడు, బహిరంగ సభలో ప్రజలు ఈ కష్టాలన్నీ ఏకరువు పెట్టి, 'మావూరి మనిషి రాష్ట్రపతి అని చెప్పుకుంటాం. మాకీ కష్టాలేమిటి?' అని నిలదీశారు. అప్పుడాయన బీహారు గవర్నరుగా ఉన్నాడు. వారి అభ్యర్ధనలకి ఆవేశ పడకుండా, ప్రశాంతంగా ఇలా చెప్పాడు. "కొంచెం ఓపిక పట్టండి. అభివృద్ధి అన్నది బజారులో దొరికే వస్తువు కాదు. తెల్లారి లేచి కావాలంటే దొరకదు. కొంత సమయం పట్టుతుంది. అన్ని సమస్యలు సానుకూలంగా పరిష్కారం అవుతాయి. ప్రస్తుతం నేను బిహారుకి గవర్నరుగా ఉన్నాను. మీ ముఖ్య మంత్రిగారితో మీ సమస్యల గురించి చర్చిస్తాను." అని వారిని సముదాయించాడు.

ఆయన కేంద్ర ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఎన్నో పార్లమెంటరీ కమిటీలలో సభ్యుడిగా ఉండి తనదైన ప్రత్యేకతని నిలుపుకున్నాడు. న్యాయం వైపు పోరాడి, వెనుక బడిన జాతుల అభివృద్ధికి ఎంతగానో దోహదం చేశాడు. భారతదేశం తరపున అంతర్జాతీయ సమితిలో 2002వ సంవత్సరంలో మాట్లాడాడు.



కోవింద్ ఎంతటి నిజాయితీ పరుడంటే, రాజకీయాల్లో తన స్థానాన్ని తన ఆప్తులు, బంధువులు ఎవరూ కూడా వాడుకుని లబ్ది పొందడానికి ఒప్పుకోలేదు. అందుకే, ఈ నాడు కూడా తనకి దగ్గర వారెవరూ రాజకీయాల్లో ప్రముఖులు లేరు. ఆయన కుటుంబ సభ్యులంతా మామూలు జనసామాన్యంలో భాగంగానే జీవిస్తున్నారు. గొప్పగా ఆలోచించడం, సర్వ సాధారణంగా బతకడం ఆయన జీవిత ధ్యేయాలు. ఎవరంతట వారు నిస్వార్ధంగా కృషి చేయాలని, ఫలితాలు వాటంతట అవే వస్తాయని ఆయన అందరికీ చెప్పుతూ ఉండేవాడు. చిన్న పెద్దా అనే తేడా లేకుండా అందరితోను స్నేహ భావంతో మెలిగేవాడు.

జీవితంలో ఇంత పరిశ్రమ చేస్తూ కూడా కోవింద్ దైవ చింతనని ఎన్నడూ విస్మరించ లేదు. ఆయనకి రామాయణం అంతా కంఠతా వచ్చునని సన్నిహితులు చెప్పుతారు. ఈ సంస్కారం ఆయనకి తండ్రి ద్వారా సంక్రమించిందని చెప్పవచ్చును. ఆయన గొప్ప దైవ భక్తుడు. అన్నదానం చేయడం, పిల్లలకి తారకమంత్రం రాసిన పుస్తకాలు పంచడం ఆయనకి అలవాటు. పరౌఖ్ లో ఒక గుడి కట్టించాలని ఆయన ఆశయం. అది తండ్రి జీవితకాలంలో నెరవేర లేదు. కాని తరవాత జరిగింది.

ఆఖరికి కోవింద్ దేశానికి రాష్ట్రపతి అయ్యాక కూడా ఏదో గొప్ప పదవిని సాధించానని గర్వపడి విర్ర వీగలేదు. రాష్ట్రపతి భవనంలో అడుగు పెట్టగానే ఆయన ని ఆకర్షించిన మొదటి విషయం అక్కడ జరుగుతున్న ఆహార దుర్వినియోగం. ఒక్క మనిషి పేరు మీద వందలకొద్దీ ఆహార పదార్ధాల తయారీ. ఎన్ని రుచికరమైన వంటలు చేసినా ఒకమనిషి ఎంతని తినగలడు?

ఉదయం పూట అల్పాహారం పేరు మీదనే రకరకాల వంటకాలు దర్శన మిచ్చేవి. ఇక మధ్యాహ్నం, రాత్రి భోజనాల సంగతి చెప్పనే అక్కర లేదు. ఇవన్నీ కేవలం భేషజం కోసం మాత్రమే అన్న విషయం గ్రహించిన కోవింద్, ముందుగా ఆ అనవసర ఖర్చులకి స్వస్తి చెప్పాడు. ఉదయపు అల్పాహారం కేవలం రెండు వం-టకాలకి మాత్రమే పరిమితం చేయించాడు. విందు భోజనాల్లో భారీ ఖర్చులు తగ్గించాడు.



కోవింద్ కి 1974వ సంవత్సరంలో 'సవిత కోవింద్,'తో వివాహం జరిగింది. వారికి ఒక  కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

కోవింద్ వంటి, సదాచార సంపన్నుడు, ఆదర్శవాది, మితభాషి, కార్యశూరుడు మన దేశానికి రాష్ట్రపతిగా ఉండడం మనకెంతో గర్వ కారణం.

## అహం - బ్రహ్మాస్మి

(10 వ పేజీ తరువాయి)

నిన్నుగా' సృష్టించాడు దేవుడు. లేదా, ఓ శక్తి.

అందుకే తామరాకు మీద నీటిబొట్టులా, కాలప్రవాహంలో చిట్టి బుడగలా ఉండు. అద్భుతమైన యీ లోకానికి మనం వచ్చింది అతిథులుగా మాత్రమే. వచ్చాం గనక వెళ్ళిపోతాం. .. ఏదో ఓనాడు. ఆ నిజాన్ని తెలుసుకుంటే- నాదీ, నా అన్న అహంకారం ఉండదు. అహంకారం లేనినాడు మమకారమూ ఉండదు. మరొక్క విషయం.

ప్రపంచ ప్రఖ్యాత రచయిత ఖలీల్ జిబ్రాన్ అంటారు, "నీ పిల్లలు నీ పిల్లలు కారు. వాళ్ళు తమకోసం జీవి-తాల్ని కోరుకుని వచ్చినవాళ్ళు. వాళ్ళు నీ ద్వారా కలిగినవాళ్ళే కానీ, నీకు కలిగినవాళ్ళు కాదు. నీ ప్రేమని పంచి ఇవ్వు...., నీ ఆలోచనల్నీ, ఆశల్నీ కాదు. వాళ్ళ ఆలోచనలూ ఆశలూ వాళ్ళవే అని గ్రహించు" అని.

ప్రకృతే సమస్త జీవుల్నీ స్వేచ్ఛగా వదిలిపెడుతున్నప్పుడు మన పిల్లలకి మనం స్వేచ్ఛ ఎందుకివ్వం. ఇస్తే యీ 'పరువు హత్యలూ' 'ఆత్మహత్యలూ' 'బలవన్మరణాలూ' వుంటాయా? ఆలోచించండి.

గాన గంధర్వ శ్రీ 'ఎస్ పి బి' కి వినయంతో యీ కథని అంకితమిస్తున్నాను,

నమస్సులతో

భువనచంద్ర

# గ్రీసు దేశపు పురాణ గాథలు



## వేమూరి వేంకటేశ్వరరావు

**“Knowledge is acquired when we succeed in fitting a new experience into the system of concepts based upon our old experiences. Understanding comes when we liberate ourselves from the old and so make possible a direct, unmediated contact with the new, the mystery, moment by moment, of our existence.”**

**Aldus Huxley. “Knowledge and Understanding”**

## ముందు మాట

నేను ఈ వ్యాసాలు రాయడానికి ప్రేరణ కారణం ఒక విమాన ప్రయాణం. భారత దేశం వెళుతూ, శేన్ ఫ్రాన్సిస్కో లో ఉదయం 8 గంటలకి బయలుదేరి, నూ అర్క్ చేరునేసరికి సాయంత్రం అయిదు అయింది. పరుగుబాట మీదకి దిగడానికి విమానం సంసిద్ధం అవుతూ ఉండగా, “మనం దిగబోయే పరుగుబాట మీద మరొక విమానం ఉంది. కంట్రోలు టవర్ లో ప్రజలు నిద్రపోతున్నట్లు ఉన్నారు. మరో చుట్టు తిరిగి వస్తాను. అరగంట సేపు ఓపిక పట్టండి,” అని చోదకుడు విమానం జోరు పెంచుతూ పైకి లేచేసరికి ఇహ చేసేది ఏమీ లేకపోవడంతో నా కుర్చీకి ఎదురుగా ఉన్న టి.వి. లో ఏదైనా “ఇరవై నిమిషాల కార్యక్రమం” చూద్దామని వెతకడం ఉపక్రమించేను. “అపస్వరం అనే ఏపిల్ పండు కథ” ట. పదిహేను నిముషాలు ట. చూడడం మొదలు పెట్టేను.

పురాతన గ్రీసు దేశపు కథ. ఇంతకు పూర్వం నేనెప్పుడూ ఈ కథ గురించి వినలేదు. ఆసక్తితో చూసేను. గమ్యం చేరుకోగానే గూగుల్ లో వెతికేను. చాల ప్రాచుర్యం ఉన్న కథ. మా అమ్మాయిని అడిగితే, “చిన్నప్పుడు హైస్కూల్ లో చదివేను” అని చెప్పింది. నేను పుస్తకాల పురుగుని అయినా ఈ కథ నా కళ్ళ పడడానికి ఎనభై ఏళ్ళు పట్టిందంటే ఈ కథని వినని వాళ్ళు ఇంకా ఎంతమంది ఉంటారో అనిపించింది. ఈ కథ గురించి పరిశోధన చేస్తూ ఉంటే ఆసక్తికరమైన అంశాలు ఎన్నో తెలుసుకున్నాను. వాటన్నిటిని క్రోడీకరించి వ్యాసాలుగా రాసేను.

ఇక్కడ ఉటంకించిన అంశాలన్నిటినీ కేవలం ఒక నఖచిత్రంలా స్పర్శించినా ఇది పెద్ద గ్రంథం అవుతుంది. అందుకని కొన్ని ముఖ్యమైన అంశాలని మాత్రమే ముచ్చటించేను.

వేమూరి వేంకటేశ్వరరావు
ప్లెజంటన్, కేలిఫోర్నియా

# 3. గ్రీసు దేశపు పురాణ గాథలు: క్రోనస్ (Cronus)

2020

గ్రీసు దేశపు పురాణం గాథలలో మూడు తరాల “శాల్తీలు” కనిపిస్తారు: మొదటి తరం సృష్ట్యాదిలో ఉండే అస్తవ్యస్తత (chaos) నుండి పుట్టినవారు. వీరిని “దేవుడు,” “దేవత” అని అభివర్ణించడానికి బదులు వీటిని మూర్తిత్వం లేని అభిజ్ఞానాలు (amorphous symbols) గా కానీ, అపరావతారాలు (personified concepts) గా భావించవచ్చు. రెండవ తరం వారు టైటనులు. సాంప్రదాయికంగా వీరిని దేవగణాలలో ఉంచుతారు కానీ, ఒక విధంగా చూస్తే వీరిలో కొందరు మన రాక్షసులని పోలిన శాల్తీలులా అనిపిస్తారు. మూడవ తరం వారు ఒలింపస్ పర్వతం మీద స్థిరనివాసం ఏర్పరచుకున్న ఒలింపియనులు. ఈ మూడవ తరం వారు మనకి పరిచయమైన దేవగణాల (అనగా, “దేవుళ్ళు,” “దేవతలు”) కోవ లోకి వస్తారు.

ఇక్కడ gods అనే ఇంగ్లీషు మాటని “దేవుళ్ళు,” “దేవతలు” అని అనువదించడం జరిగింది కానీ, నిదానం మీద ఆలోచిస్తే “gods” అన్న మాటని సురులు, అసురులు అని తెలిగించి సురులని “దేవతలు” గా పరిగణించి, అసురులులో మంచి వాళ్ళని “దేవతల” కోవలో పడేసి, చెడ్డ వాళ్ళని రాక్షసులుగా లెక్కలోకి తీసుకోవచ్చు. కానీ ఈ సూక్ష్మ భేదాలని విస్మరించి అందరినీ “దేవుళ్ళు” అనే - లింగ భేదం లేకుండా - అనడం జరిగింది.

గ్రీసు దేవుళ్ళు హిందూ దేవుళ్ళలాంటి వాళ్లు కాదు; వీళ్లల్లో ఈర్ష్య, అసూయ, పగ, జుగుప్స వంటి లక్షణాలు మానవులలో కంటె ఎక్కువ మోతాదులో ఉన్నట్లు అనిపిస్తుంది. వీరు మానవులని సృష్టించి వారిని చదరంగంలో పావులని నడిపినట్లు నడిపి ఆడుకుంటారు. ఉదాహరణకి అందంలో ఎవరు గొప్ప అని పోటీ పడి ముగ్గురు దేవతలు ట్రోయ్ నగరంలో మహా సంగ్రామానికి కారకులు అవుతారు.

మొదటి తరం మూర్తిత్వం లేని అభిజ్ఞానాలు (“దేవశక్తులు”)

మొదట్లో - సృష్ట్యాదిలో - అంతా అస్తవ్యస్తం. ఆ అస్తవ్యస్తం (chaos) నుండి మొట్టమొదట గాయా (Gaia) లేదా భూదేవి, మరి కొన్ని ఇతర ప్రాథమిక శక్తులు (లేదా అపరావతారాలు, లేదా దైవాంశాలు) పుట్టుకొచ్చేయి: (1) ఈరోస్ (Eros) అనే కామ దైవం, (2) ఎబిస్ (Abyss); ఇక్కడే పాతాళ లోకానికి అధిపతి అయిన టార్టరస్ ఉంటాడు. అతని పేరనే ఒక బందిఖానా ఉన్నది, (3) ఎరెబస్ (Erebus); చీకటికి అధిపతి, (4) నిక్స్ (Nyx ); ఈమె రాత్రికి అధిపత్ని, మొదలైనవి.

టార్టరస్ (పాతాళ లోకం) నుండి రకరకాల రాక్షసాకారాలు పుట్టు-




(ఇంకా

కొచ్చేయి. వాటిల్లో ముఖ్యమైనవి: (1) సెర్బిరస్ (Cerberus) అనే మూడు తలకాయల కుక్క. ఇది నరకపు ద్వారాల దగ్గర కాపలా కాస్తూ ఉంటుంది. (2) డ్రేగన్ (Dragon, జేసన్, ఆర్గోనాట్లు, బంగారు ఉన్ని కథలో వచ్చే పెద్ద పామును పోలిన శాల్తీ). (3) స్ఫింక్స్ (Sphinx, మనిషి ముఖం, సింహం శరీరం, పక్షి రెక్కలు కల ఒక వింత జంతువు). (4) హార్పీస్ (Harpies, మనిషి ముఖం ఉన్న ఒక రకం పక్షి ). (5) సైరన్లు. (6) గోర్గన్ లు (ఈ వికృతాకారులలో పేరెన్నిక గన్నది మెదూసా. ఈ మెదూసా (Medusa) తలలో జుత్తుకి బదులు పాములు ఉంటాయి. ఈ మెదూసా ఎవరిని చూస్తే వారు రాయిగా మారిపోతారు.

ఎరెబస్ కీ నిక్స్ కీ పుట్టిన ఖేరాన్ (Charon) పాతాళలోకంలో ఉన్న నరకానికి వెళ్లే దారిలో వచ్చే స్టిక్స్ (Styx) వంటి నదులని దాటడానికి పడవ నడుపుతూ ఉంటాడు. చనిపోయినవారు ఈ నదులని దాటుకుని అటు వెళ్ళాలి. మన వైతరణికి ఇక్కడ స్టిక్స్ కి పోలిక చూడండి.

## రెండవ తరం దేవగణాల (టైటనుల) కథ

గ్రీకు పురాణాలలో గాయా సంతానం గురించి పరస్పర విరుద్ధమైన కథలు ఎన్నో ఉన్నాయి. బాగా ప్రచారంలో ఉన్న కథనాల ప్రకారం పురుషుని సహాయం లేకుండా గాయా, ఆకాశానికి అధిపతి అయిన యూరెనస్ కి




జన్మనిచ్చింది, అప్పుడు అతను ఆమెనిఫలవంతురాలిని చేసాడు. వారి కలయిక నుండి మొదట టైటనులు (కాసింత రాక్షస అంశ ఉన్న వారులా అనిపిస్తారు కానీ వీరిని "టైటన్ దేవగణాలు" అనే అంటారు.) జన్మించారు. తరువాత ఒంటికన్నుతో ఉండే సైక్లాపులు (Cyclops) ముగ్గురు పుట్టేరు. తరువాత అందవికారంగా, ఏభయ్ తలలు, వందేసి చేతులతో, హెకటాంకీర్ లు (Hecatonchires) అనే శతబాహులు ముగ్గురు పుట్టేరు. వారి పేర్లు ప్రస్తుతానికి అనవసరం. అందవికారంగా ఒంటికన్నుతో ఉన్న సైక్లాపులని, వందేసి చేతులు ఉన్న హెకటాంకీర్ లని చూసి యూరెనస్ అసహ్యించుకుని వారిని తిరిగి తల్లి గాయా (అనగా, భూదేవి) గర్భకుహరంలోకి (అనగా, పాతాళం లోకి) తోసేసేడు. ఈ అమానుష చర్యకి కడు దుఃఖ పడి ప్రతీకారం కోసం గాయా ఒక కొడవలిని తయారు చేసి, అదను కోసం ఎదురు చూస్తూ ఉంటుంది.

సైక్లాపులు, హెకటాంకీర్ లు జన్మించిన తరువాత ఇంక రాక్షస ఆకారాలు ఉన్న పిల్లలు పుట్టకుండా గాయా-యూరెనస్ లు విడిపోయారు.

యూరెనస్-గాయా ల కలయిక వల్ల పుట్టిన పన్నెండుమంది టైటనులలో ఆరుగురు మగ, ఆరుగురు ఆడ:

మగవారు: (1) ఓషనస్ (సముద్రాలకి అధిపతి), (2) హైపీరియాన్ (కాంతికి అధిపతి), (3) కోయస్ (బుద్ధి, దూరదృష్టికి అధిపతి), (4) క్రీయస్ (గగన వీధిలోని నక్షత్ర రాసులకి అధిపతి), (5) క్రోనస్ (కాలానికి అధిపతి), (6) ఇయాపిటస్ (నీతికి అధిపతి). ఆడవారు: (1) టేథీస్ (మంచినీటికి అధిపత్ని), (2) థియా (దృష్టికి అధిపత్ని), (3) నెమోసీన్ (జ్ఞాపక శక్తికి అధిపత్ని), (4) ఫీబీ (వర్చస్సుకి అధిపత్ని), (5) రేయా (మాతృత్వానికి అధిపత్ని), (6) థెమిస్ (ధర్మదేవత లేదా చట్టబద్ధతకి అధిపత్ని). బొమ్మ. క్రోనస్ తన బిడ్డనే తినె-

య్యడం! (వికీపీడియా నుండి)

ఈ టైటన్ దేవగణాల గురించి తరువాత, సందర్భం వచ్చినప్పుడు, సావధానంగా మాట్లాడుకుందాం. ప్రస్తుతానికి కొన్ని ఆసక్తికరమైన చిల్లర విషయాలని చూద్దాం. (ఇక్కడ ఏకోదరుల మధ్య వివాహాలు గమనించండి.)


"సముద్రపు జంట" అయిన ఓషనస్ (Oceanus) కీ టేథీస్ (Tethys) కీ అనేకమంది ఎలనాగలు లేదా "జలదేవతలు" (Nymphs) పుట్టేరు.

"ఆకాశపు జంట" అయిన హైపీరియాన్ (Hyperion) కీ థియా (Theia) కీ పుట్టిన పిల్లలలో హీలియోస్ (సూర్యుడు), సెలీన్ (చంద్రుడు) ముఖ్యులు.

"భూ జంట" అయిన క్రోనస్ (Cronus) కీ రేయా (Rhea) కీ పుట్టిన పిల్లలే టైటనులు.


ఇయాపిటస్ (Iapetus) కి పుట్టిన పిల్లలలో చాలా మందిని మనం గుర్తించగలం: (1) ఏట్లస్ (Atlas) నిరంతరం భూమిని భుజాల మీద మోసే శాల్తీ

(2)ప్రొమీథియస్ (Prometheus)




మనుష్యుల పుట్టుకకి కారకుడు

(3)ఎపిమీథియస్ (Epimetheus) మొట్టమొదటి మానవ స్త్రీని - పెండోరా ని - జూస్ ఆజ్ఞానుసారం తయారు చేసేడు. ప్రొమీథియస్, ఎపిమీథియస్ లు దేవతలకి, మానవులకి మధ్య లంకె వంటి వారు.





## 3. క్రోనస్ పతనం

మొదటి తరం టైటనులలో క్రోనస్ కడసారం. క్రోనస్ కుతంత్ర బుద్ధి కలవాడు, అత్యంత భయంకరమైనవాడు. తల్లి గాయాకి జరిగిన అవమానానికి పగ తీర్చుకోగల సమర్ధుడు. క్రోనస్ ఒక రాత్రి యూరెనస్ మీదకి లంఘించి అతని జననాంగాలని తల్లి ఇచ్చిన కొడవలితో నరికేసి వాటిని సముద్రంలో విసిరేసాడు. ఆ జననాంగాల నుండి స్రవించిన స్రావములతో ఒక రకం రాక్షసులు, జలకన్యలు, తదితరులు పుట్టుకొచ్చేరు. అలా పుట్టుకొచ్చిన వారిలో ఏఫ్రొడైటి (Aphrodite) ఒకామె. ఈ సౌందర్యవతి లైంగిక ప్రేమకి చిహ్నం.

అంగవిహీనుడైన యూరెనస్ భూమిని వదలి పోతూ తనకి చేసిన అవమానానికి క్రోనస్ ప్రతిఫలం అనుభవిస్తాడనిన్నీ, తనకి జరిగినట్లే క్రోనస్ కి అతని పిల్లల చేతిలోనే ప్రతీకారం జరుగుతుందనిన్నీ చెబుతాడు (శపిస్తాడు?)

తండ్రిని పదవీ భ్రష్టుడిని చేసి రాజ్యం నుండి బహిష్కరించిన తరువాత క్రోనస్ సైక్లాపులని, హెకటాంకీర్ లని టార్టరస్ లో బంధిస్తాడు. హేడిస్ పాతాళానికి, పొసైడన్ సముద్రాలకి, జూస్ ఆకాశానికి అధిపతులు అవుతారు. జూస్ దేవలోకానికి అంతటికి పాలకుడుగా చెలామణి అవుతాడు.




ఇతర టైటనులు అతని సభికులుగా అయ్యారు. క్రోనస్ తన తండ్రిని తరిమేసిన తరువాత తన యొక్క సోదరి అయిన రేయాని జీవిత భాగస్వామినిగా స్వీకరిస్తాడు.
క్రోనస్-రేయాలకి పుట్టిన సంతానంలో ముగ్గురు మగ, ముగ్గురు ఆడ:
మగ వారు: హేడిస్, పొసైడన్, జూస్.
ఆడ వారు: హేస్టియా, డిమిటర్, హేరా.

తండ్రి యూరెనస్ ఇచ్చిన శాపం పదే పదే గుర్తుకి రాగా, రేయాకి పుట్టిన పిల్లల్ని పుట్టిన వెంటనే క్రోనస్ కబళించడం మొదలు పెడతాడు. అప్పుడు రేయా తన కడసారపు కొడుకు జూస్ ని ఒక పన్నాగం పన్ని రక్షిస్తుంది. క్రేట్ లో ఉన్న ఒక కొండ గుహలో జూస్ ని ప్రసవించగా అక్కడ జలకన్యలు జూస్ ని పెంచి పెద్ద చేస్తారు. అప్పుడు రేయా ఒక రాయిని పొత్తిళ్ళలో చుట్టబెట్టి "ఇదిగో కొడుకు" అని చెబుతూ క్రోనస్ కి అందిస్తుంది. క్రోనస్ ఆ కట్టని అలానే అమాంతం మింగేస్తాడు.

పెరిగి పెద్ద అయిన తరువాత జూస్ మందు కలిపిన సారా ని తండ్రి క్రోనస్ కి ఇస్తాడు. అది తాగగానే వికారం పుట్టి వంటి చేసుకుంటాడు. అలా గర్భకుహరంలో పెరుగుతున్న తన తోబుట్టువులకి విముక్తి కలిగిస్తాడు! పెరిగి పెద్దయిన తరువాత తన తోబుట్టువులతో కలసి పదేళ్ళపాటు టైటానులతో పోరు కొనసాగించి, విజయం సాధించి, ఒలింపస్ పర్వతం తన (దేవతల పక్షం) వశం చేసుకుంటాడు. ఈ పోరాటాన్నే "టైటన్ మహా సంగ్రామం" అంటారు.

చాలమంది స్త్రీలతో సంపర్కం ఉండడం వల్ల క్రోనస్ కి చాలమంది పిల్లలు ఉన్నారు. ఉదాహరణకి క్రోనస్ కి సముద్రపు జలకన్య ఫిలిరాకి పుట్టిన కుమారుడు ఖైరాన్. బొమ్మలలో ఖైరాన్ ని "నరాశ్వం" (centaur) గా చిత్రిస్తారు; అనగా ముందు భాగం మనిషి ఆకారంలోను, పృష్ఠ భాగం గుర్రం ఆకారంలోనూ ఉండే నాలుగు కాళ్ళ శాల్తీ.




## దీపావళి శుభాకాంక్షలు
(కవిత)

దీపాలు దీపాలు దివ్య
సందేశాలు దేవదేవుని కవి
నీరాజనాలు. ..
అజ్ఞాన తిమిరమును అణచు
హారణాలు
ఆత్మ జ్యోతిని ఎరుగ
వెలిగించు కారణాలు
అసుర సంహారమున
ఆనంద దివ్వెలు.
సంధ్యా సమయమున సరి
క్రొత్త వెలుగులు....
దీపాలు...
శ్రీ మహా లక్ష్మి కీ స్వాగతపు
కాంతులు.
తులసమ్మ ప్రాంగణపు
పూజలకు జ్యోతులు
గడప గడపన వెలుగు కడు
శుభ ప్రదములు
శ్రీదేవి పదములకు సింధూర
హారతులు.
దీపాలు.. దీపాలు.

- సుందరవల్లి శ్రీదేవి

# ప్రేమంటే ఇంతే

(గతసంచికతరువాయి)



ఇంద్రగంటి వేంకట సుబ్బారావు

.ఎందుకిలా అనవసరంగా ఆలోచించి భయపడుతున్నారు? ఆయన మాటలు విన్నాక తనకి బావకి వివాహం జరగడం సాధ్యమేనా? ఈ పరిస్థితిలో ఏమిటి మార్గం?" భగవంతుడా నాన్నగారి మనసు మార్చి మా వివాహానికి అంగీకరించేటట్లు చూడు తండ్రీ" అని తన ఇష్టదైవమైన వేంకటేశ్వరస్వామిని వేడుకొంది...ఆమె ఆలోచనలు ఇలా వరద గోదావరిలా ప్రవహిస్తున్నాయి.

మర్నాడు ఉదయం కృష్ణమోహన్ డెహ్రాడూన్ నుండి రవి ఆఫీస్ ఫోన్కి కాల్ చేసి ఇక్కడ పరిస్థితి గురించి, అనూరాధ ఎలా వుందో అడిగాడు. రవి ఇక్కడ విశ్వనాథంగారు, పార్వతమ్మగారు, అనూరాధల మధ్య జరిగిన చర్చ గురించి వివరంగా చెప్పాడు.

"రవి రాత్రి ఇంటికి ఫోన్ చేస్తాను, ఒకసారి రాధతో మాట్లాడించవా?" అని అడిగాడు.

"బావా ఏం చెప్పమంటావు, నాకు చెప్పటానికి ఎంతో సిగ్గుగా వుంది, నాన్నగారు విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు. మొన్న సత్యం అన్నయ్య, వదిన వచ్చి వెళ్ళాక సోమవారము నాడు నాన్నగారు టెలిఫోన్ "సేఫ్ కస్టడి" లో పెట్టించారు. బహుశా నీ దగ్గర నుండి, మీ వాళ్ళ దగ్గరనుండి కమ్యూనికేషన్ని అడ్డగించటానికి అయివుంటుంది".

"ఓహ్ మై గాడ్! ఏమిటిది ఆయన ఎందుకిలా ప్రవర్తిస్తున్నారు? నేను ఆదివారము హైదరాబాదు తిరిగి వస్తున్నాను, వచ్చేక నిన్నుకలుస్తాను" అన్నాడు కృష్ణమోహన్.


*******

శుక్రవారం ఉదయాన్నే విశ్వనాథంగారు కుటుంబ సభ్యులందిరిని సమావేశపరిచి "రేపు పెళ్ళివారు వస్తున్నారు, అన్నీ సవ్యంగా నేను చెప్పిన ప్రకారం జరగాలి. ఒక వేళ ఈ అబ్బాయి నాకు నచ్చలేదు అని టైం పాస్ చేసి ఆ తరువాత మీ స్వంత నిర్ణయాలు తీసుకుని తేడాగా ప్రవర్తించి మోహన్తో అనూరాధ పెళ్ళి జరిపిస్తే నేను సహించను. నాకు పరువు, ప్రతిష్టలు చాలా ముఖ్యం, అవి పోతే మనిషి బ్రతికి వున్నా చచ్చినవాడితో సమానము. వాటికి భంగం కలిగితే నేను ఎంతటి విపరీతమైన నిర్ణయాన్ని అయినా తీసుకోవడానికి వెనుకాడను" అని తన ధృఢ సంకల్పాన్ని మరోసారి చెప్పారు.

మర్నాడు పెళ్ళివారు రావడం, అనూరాధని చూడటం, వెంటనే నచ్చిందని చెప్పటం, ఆ రోజు బాగుందని చెప్పి విశ్వనాథంగారు తాంబులాలు కుడా పుచ్చుకోవడం అంతా క్షణాల మీద ఒక సినిమా సన్నివేశంలా కృష్ణమోహన్ డెహ్రాడూన్ నుండి తిరిగి వచ్చేసరికి జరిగిపోయింది. జరిగినది తెలుసుకుని కృష్ణమోహన్ అవాక్కయ్యాడు. విషయం తెలిసిన నరసింహారావుగారు, సుబ్బలక్ష్మిగారు కృష్ణమోహన్ని ఆ సమయంలో ఒంటరిగా వదలకూడదని కృష్ణమోహన్కి అండగా వుండటానికి హుటాహుటిన హైదరాబాదు వచ్చారు.

కృష్ణమోహన్కి ఏమి చెయ్యాలో అర్థం కావడంలేదు, ఒకసారి అనూరాధని కలిసి మాట్లాడలాని వుంది, అయితే అది సాధ్యమవుతుందా అనేదే అతని అనుమానం. తల్లితండ్రులతో అనూరాధని కలవాలనుకుంటున్నాని చెప్పాడు కృష్ణమోహన్.

"వద్దు అలాంటి పిచ్చి పనులు ఏమీ చెయ్యకు. అయినా వాళ్ళ నాన్న మనమంటే అంత వ్యతిరేకతని చూపించి మీ పెళ్ళికి ససేమిరా ఒప్పుకోకపోతే ఆ అమ్మాయి మాత్రం ఏం చేస్తుంది? నువ్వు ఇప్పుడు కలిసి ఆ అమ్మాయికి అనవసరమైన ఆశలు కల్పిస్తే ఆ అమ్మాయి పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా అవుతుంది. కలిసి నువ్వు ఏమి



సాధిస్తావు? నువ్వు కలిసిన తరువాత ఏదైనా జరగకూడనిది జరిగితే ఆ క్షోభ మనలని జీవితాంతం వెంటాడుతుంది, ఆ విశ్వనాథం మన పరువు బజారుకీడుస్తాడు. అందుకని నువ్వు ఆ అమ్మాయిని కలవద్దు, నాకు ఇష్టం లేదు" అని నిక్కచ్చిగా చెప్పారు సుబ్బలక్ష్మిగారు.

నరసింహారావుగారు కాస్సేపు ఆలోచించి "సరే నువ్వు కలువు నాకు అభ్యంతరం లేదు, కానీ ఒక విషయం గుర్తు పెట్టుకో. ఇంత జరిగాక ఇక ఈ సంబంధం చేసుకోవడం మాకు ఇష్టం లేదు. నువ్వు ఆనూరాధని ఈ సమయంలో కలవడమనేది చాలా సున్నితమైన విషయం. ఈ సమయంలో నువ్వు ఆ అమ్మాయిని కలిసినట్లు అవతల పెళ్ళివారికి తెలిస్తే దాని పర్యవసానము ఎలా వుంటుందో చెప్పలేము. పొరపాటున మీ ఇద్దరి విషయం తెలిసి ఆ పెళ్ళివారు సంబంధం రద్దు చేసుకున్నారనుకో, ఆ విషయం నలుగురి నోళ్ళలో నాని అనూరాధకి ఇబ్బందికర పరిస్థుతులు తలెత్తుతాయి. ఆ సంబంధం రద్దు అయినా విశ్వనాథం మన సంబంధం చేసుకుంటాడని భ్రమలో వుండకు, అతను మూర్ఖుడు ఎప్పటికి అలా చెయ్యడు. మీ ఇద్దరి ప్రేమ విషయం బయటకి పొక్కితే, అనూరాధకి ఉంకో సంబంధంకుదరడంకూడా చాలా కష్టమవుతుంది. పరిస్థితులు అనుకూలించక ఆ అమ్మాయి పెళ్ళి కుదరకపోయినా, లేదా ఒత్తిడి తట్టుకోలేక ఖర్మ కాలి ఎవరైనా ఏదైనా అఘాయిత్యం చేసుకుంటే అందరూ మనలనే నిందిస్తారు. ఏ రకంగా చూసుకున్నా అనూరాధ బ్రతుకు అన్యాయమైపోతుంది. అందుచేత అన్ని విషయాలు జాగ్రత్తగా ఆలోచించి సరి అయిన నిర్ణయం తీసుకో" అన్నారు.

"అవును వీళ్ళు చెప్పిన విషయాలు కూడా ఆలోచించవలసినవే, ఇది చాలా సున్నితమైన విషయం, నా తొందరపాటు నిర్ణయంతో రాధని ఇబ్బందులలోకి నెట్టకూడదు, జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి" అనుకున్నాడు కృష్ణమోహన్.

మర్నాడు అనూరాధ కృష్ణమోహన్ ఆఫీసుకి ఫోన్ చేసి..."అంతా అయిపోయింది బావా, నా జీవితం సర్వనాశనం అయిపోవడమే కాకుండా నీ జీవితాన్ని కూడా నాశనం చేస్తున్నాను. నా కలలన్నీ కల్లలు అయిపోతున్నాయి, నేను ఊహించుకున్న రంగుల ప్రపంచం ఈ గోత్రాల సునామీలో కొట్టుకుపోతున్నాది. మా పెద్దల అర్ధంలేని ఛాందసానికి మనలని బలిపశువులు చేస్తున్నారు" అంటూ ఫోన్లోనే వెక్కి వెక్కి ఏడుస్తూ చెప్పింది.

అనూరాధ ఏడుపు విన్న కృష్ణమోహన్కి కూడా దుఃఖం కలిగి ఏడుపు వచ్చింది, కానీ ఆఫీసులో వుండటం వలన నిగ్రహించుకున్నాడు. తను కూడా ఏడుస్తే అవతల అనూరాధ పరిస్థితి ఏమిటి అని ఆలోచించి తన బాధని బిగపట్టి వుంచాడు. లేని గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ..."ఊరుకో రాధా, నువ్వు ఏడిస్తే నేను చూడలేను, నేను మీ నాన్నగారిని కలిసిమాట్లాడతాను, ఆయన సందేహాలని, భయాలని నివృత్తి చేస్తాను" అన్నాడు.

"ప్రయోజనం వుండదు బావ, ఆయన ఎవ్వరి మాట వినడం లేదు, ఎవరైనా నచ్చ చెప్పటానికి ప్రయత్నిస్తే ఆయన ఇంకా కోపంతో రెచ్చిపోతున్నారు. ఆయన ఎంత దారుణంగా ప్రవర్తిస్తున్నారంటే నిన్న పెళ్ళివారిని కలిసి ముహూర్తం పెట్టించుకు వచ్చారు. ఈ విషయం ఆయన తిరిగి వచ్చేదాకా అమ్మతో సహా ఇంట్లో ఎవ్వరికీ తెలియదు, మా అందరిని శతృవులిని చూసినట్లు చూస్తున్నారు. పెళ్ళి ముహూర్తానికి వ్యవధి ఇంక సరిగ్గా పదిహేను రోజులుంది. ముహూర్తం పెట్టించుకు వచ్చాక ఈ ముహూర్తానికి నా పెళ్ళి ఆ అబ్బాయితో ఏ కారణాలవల్ల జరగపోయినా ఆయన

వురేసుకుంటానని అందరినీ హెచ్చరించారు. ఈ పరిస్థితులలో ఏం చెయ్యాలో నాకు దిక్కు తోచడం లేదు బావా" అంటూ మళ్ళీ ఏడవడం మొదలు పెట్టింది.
"వూరుకో రాధా, వూరుకో" అనడం తప్పించి కృష్ణమోహన్కి కూడా ఏం చెయ్యాలో తోచడం లేదు.
"బావా నిన్ను చూడాలని వుంది, రేపు శెలవు పెట్టు బావా, రేపు ఉదయం మా స్నేహితురాలి పెళ్లి వుంది అందుకని నేను కూడా యూనివర్సిటీకి వెళ్ళడం లేదు. దయచేసి కాదనకు బావా, నా జీవితం భవిష్యత్తులో ఇంకా ఏ మలుపు తిరుగుతుందో, ఏం జరుగుతుందో తెలియదు, అందుకని రేపు నా బాధని, ఆవేదనని, క్షోభని, నీతో పంచుకుంటాను. రేపు నీతో గడిపే మధుర క్షణాలని నేను జీవితమంతా తలచుకుంటూ గడిపేస్తాను, ఇంకెప్పుడూ నిన్ను ఇబ్బంది పెట్టను బావా ప్లీజ్" అంటూ తన బాధని, ఆవేదనని తన రోదన ద్వారా వ్యక్తం చేసింది అనూరాధ.
ఆమె మాటలు విన్న కృష్ణమోహన్ హృదయం ద్రవించి పోయింది.
"అలాగే రాధా, రేపు ఉదయం ఎన్ని గంటలకు ఎక్కడ కలుద్దాము" అని అడిగాడు కృష్ణమోహన్.
"రేపు ఉదయం పది గంటల కి సికంద్రాబాదులో మా స్నేహితురాలి పెళ్ళి. నేను పదకొండు గంటలకి సికంద్రాబాద్ క్లాక్టవర్ దరి ప్రశాంతి థియేటర్ దగ్గర నీ కోసం వేచి వుంటాను, నన్ను పికప్ చేసుకో" అంది అనూరాధ.

***********

మర్నాడు అనుకున్న ప్రకారం ప్రశాంతి థియేటర్ దగ్గర అనూరాధని కలిసాడు కృష్ణమోహన్. అనూరాధని చూస్తూనే అతని దృష్టి ధగధగా మెరుస్తున్న ఆమె కుడి చేతి ఉంగరం వేలుకి వున్న నిశ్చితార్థపు ఉంగరం మీద పడింది.
"రాధా ఎక్కడికి వెళదాము"
"నీ ఇష్టం బావా"
"జూకి వెళదామా?"
"పద ఈ మనసు లేని మనుషుల కన్నా మనసు లేకపోయినా తమకి హాని తలపెడితేనేగాని హాని చేయని ఆ జంతువులే మేలైనవి"
"ఏమైనా తింటావా? త్రాగుతావా?"
"వద్దు బావా, పెళ్ళివారింట్లో బ్రేక్ఫాస్ట్ చేసాను, జూకి వెళ్ళాక ఏదైనా త్రాగుదాము"
జూకి చేరుకుని కాస్తా కాఫీ త్రాగి ఒక చెట్టు నీడలో కూర్చున్నారు.
"ఇప్పుడు చెప్పు రాధా ఈ వ్యవహారమంతా మృదువుగా ముగుస్తుంది అనుకుంటే ఇలా ఎందుకు జరిగింది?" అని అడిగాడు కృష్ణమోహన్.
అనూరాధకి దుఃఖం కట్టలు తెంచుకొని వచ్చి వెక్కి వెక్కి ఏడవసాగింది. అతి కష్టం మీద అనూరాధని ఊరుకోబెట్టాడు కృష్ణమోహన్. అనూరాధ ఏం జరిగిందో మొత్తం పూసగుచ్చినట్లు చెప్పింది.
"అసలు మామయ్యగారికి నేనంటే ఎందుకంత అయిష్టం? నేనెప్పుడైనా మీ పట్ల తప్పుగా గాని లేదా ఆయన పట్ల అగౌరవంగా గాని ప్రవర్తించానా?"
"లేదు బావా, అలాంటిదేమీ లేదు. ఆయన సత్యం అన్నయ్య పెళ్ళిలో జరిగినదానికి గిల్టీగా ఫీల్ అవుతున్నారు. అది మనసులో వుంచుకొని మీ వాళ్ళు నన్ను అడ్డం పెట్టుకొని ఆయనని ఎక్కడ సాధిస్తారో అని భయం. దానికి తోడు ఈ గోత్రాల విషయం ఆయన తనకి ఉపయోగపడేటట్లు వాడుకుంటున్నారు. ఆయన తన అర్థం లేని భయాలకి, నిరర్థకమయిన చాదస్తాలకి మనలని బలి చేస్తున్నారు. బావా పద ఎక్కడికైనా పారిపోయి పెళ్ళి చేసుకుందాము, ఈ మనుషులకి దూరంగా వెళ్ళి పోయి బ్రతుకుదాము"
"రాధ ఏమిటి మాట్లాడుతున్నావు, నీ నిశ్చితార్థము కూడా ఆ అబ్బాయితో జరిగిపోయింది. ఇది ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా, ఎవరికి నచ్చినా, నచ్చకపోయినా యథార్థము, మనము వాస్తవాన్ని విస్మరించలేము. ఇప్పుడు మనం పారిపోయి పెళ్ళి చేసుకుంటే అది మన రెండు కుటుంబాల పరువు, ప్రతిష్టలని మంటగలుపుతుంది. దానివల్ల ఎక్కువ నష్టపోయేది మీ కుటుంబమే. దాని ప్రభావం వాణి వివాహం విషయంలో చూపించి అది ఒక అవరోధము కావచ్చు. ఒక విషయం మాత్రం నేను స్పష్టంగా చెప్పగలను. అదేమిటంటే మీ నాన్నగారు చాలా తెలివిగా నేను డెహ్రాడూన్ నుండి వచ్చేసరికి నిశ్చయ తాంబులాలు పుచ్చేసుకుని ముహూర్తాలు కూడా పెట్టించేసారు, ఎందుకంటే ఇంత జరిగిన తరువాత నేను ఏమీ చెయ్యనని, చెయ్యలేనని ఆయన ధైర్యం" అన్నాడు కృష్ణమోహన్.
"బావా నువ్వు వస్తావు, నన్ను

ఎక్కడికైనా తీసుకుని వెళ్ళి పెళ్ళి చేసుకుంటావని ఆశతో వున్నాను, నువ్వేమిటి ఇలా మాట్లాడుతున్నావు" అంటూ నిరాశతో అడిగింది అనూరాధ.

"రాధా నిన్ను పెళ్ళి చేసుకోవడానికి నాకు ఒక్క నిముషం చాలు, కానీ ఆ నిముషం మన జీవితాలని దుర్భరమైన పరిస్థితులలోకి నెట్టకూడదు, ఆ నిముషం మనం జీవితమంతా వగచేటట్లు చేయకూడదు. మీ నాన్నగారు పంతం, పట్టింపు వున్న మనిషి, ఆయన మాట నెగ్గలేదని ఏ అఘాయిత్యమైనా చేసుకుంటే అది మీ కుటుంబానికి అపారమైన నష్టం కలిగించడమే కాకుండా ఈ రోజు నీ పట్ల సానుభూతితో వున్న మీ కుటుంబ సభ్యులు కూడా నీ వల్లే ఇదంతా జరిగిందని నిన్ను నిందిస్తారు, నిన్ను ఒక దోషిగా చూస్తారు. నిన్ను దోషిని చెయ్యడం నాకు ఇష్టం లేదు ఎందుకంటే నేను నిన్ను మనసారా ప్రేమించిన మనిషిని. నీ సుఖాన్ని, నీ మంచిని ఔన్నత్యాన్ని కోరుకొనే మనిషిని నేను, దాని కోసం మన ప్రేమని త్యాగం చెయ్యడానికి కూడా నేను సిద్ధం. 'రాధా ప్రేమ లోంచి త్యాగం పుడుతుంది, ప్రాణాలు పోసేదే ప్రేమ కాని ప్రాణాలు తీసేది ప్రేమ కానే కాదు. ఈ సందర్భములో "త్యాగంలోనే తృప్తి, ఆనందం వుంటాయి. అర్ధం చేసుకున్న హృదయాలకు ప్రేమకు త్యాగానికి తారతమ్యం లేదు. త్యాగం లేని చోట ప్రేమకు తావు లేదు" అని ఆత్రేయగారు అన్నమాటలు నీకు గుర్తు చేస్తున్నాను. త్యాగాన్ని మించిన గొప్పది ఈ ప్రపంచంలో ఏదీ లేదు' అని నేను నమ్ముతున్నాను. మనం ఏం పాపము చేసుకున్నామో గాని ఈ జన్మలో మన ప్రేమ పెళ్ళి వరకు వెళ్ళడము లేదు అది మన దురదృష్టం. ఈ నా మాటలు విని నువ్వు నన్ను పిరికివాడుగా భావిస్తే నేనేమీ చెప్పలేను, కానీ ఒక్కటి మాత్రం స్పష్టంగా చెప్పదలచుకున్నాను. 'ప్రేమ అనేది ఇద్దరు వ్యక్తుల మధ్య ఏర్పడే బంధం, పెళ్ళి అనేది రెండు కుటుంబాల మధ్య వ్యవహారం. పెళ్ళి తరువాత ఆ రెండు కుటుంబాల మధ్య ఒక స్నేహపూర్వకమైన సంబంధం నెలకొనాలి, లేదంటే మొత్తం రెండు కుటుంబాలకు ప్రేమికులతో సహా సుఖశాంతులు కొరవడుతాయి'. కారణాలు ఏమైనా, కారకులు ఎవరైనా మనం పెళ్ళి చేసుకుందామని అనుకున్న దగ్గర నుండి ఒక ప్రతికూల వాతావరణం ఏర్పడింది. 'పొరపాటు అయితే సరిదిద్దుకోవచ్చు, కానీ ఇది ఉద్దేశ్యపూర్వకంగా చేసినది అందువలన దిద్దుబాటుకి అవకాశం లేదు'. విషయం ఎంతవరకు వెళ్ళిందంటే తిరుగదోడడానికి అవకాశం లేకుండా చేసారు, ఇదంతా మన దురదృష్టం"

"బావా మనం ఏం పాపం చేసుకున్నాము, ఎప్పుడూ అందరి మంచే కోరుకున్నాము, మనకి చేతనైన సహాయం చేసాము, ఏం తప్పు చేసామని మనకి ఈ శిక్ష?" అంటూ బాధపడింది.

"వూరుకో రాధా, అన్నీ మనము అనుకున్నట్లే జరగవు, అన్నీ మనము అనుకున్నట్లే జరిగితే మనిషికి దైవానికి తేడా ఏముంటుంది? నిజమే ఇలా జరగడం చాలా బాధాకరం, నాకూ దుఃఖము వస్తుంది" అంటూ వుండగా కృష్ణమోహన్ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ముందుగా అతను తేరుకుని కన్నీళ్ళు తుడుచుకొని అనూరాధని వూరు కోబెట్టాడు, కాస్సేపు మౌనం రాజ్యమేలింది.

"రాధా గతాన్ని మరచిపో, గతాన్ని తలచుకొని బాధ పడటం వలన ఉపయోగం లేదు. నా జ్ఞాపకాలని తుడిచివెయ్యి. ప్రకాష్ని పెళ్ళి చేసుకొని సంతోషంగా వుండు. పద ఇక బయలుదేరుదాము, భోజనం చేసి నిన్ను దిగబెడతాను"

"బావా నిజం చెప్పు, నువ్వు నన్ను మరచిపోగలవా?" సూటిగా అడిగింది అనూరాధ. సమాధానం చెప్పలేక మౌనంగా వుండిపోయాడు కృష్ణమోహన్.

"నాకు తెలుసు బావా నీకైనా, నాకైనా అది అసాధ్యమని"

"రాధా నాకు తెలుసు అది అంత తేలిక కాదని, కానీ 'గతం తలచుకుని వర్తమానంలో కుమిలిపోతూ వుంటే భవిష్యత్తు అంధకారమై పోతుంది. ఏది ఏమైనా బ్రతుకు బండి ముందుకు సాగాలి 'ది షో మస్ట్ గో ఆన్'. రాధా ప్రేమించి పెళ్ళి చేసుకోవడం ఒక్కటే జీవితం కాదు, ఎన్నో మంచి చెడుల, బంధాల అనుబంధాల, గెలుపు ఓటముల, బాధ్యతల, చీకటి వెలుగుల మిశ్రమమే జీవితము.

(ఇంకా వుంది)

# బహుముఖ ప్రజ్ఞాశాలి...
# శ్రీమతి భానుమతి రామక్రిష్ణ



పోడూరి శ్రీనివాసరావు

భానుమతి పేరు వినగానే స్వాతిశయం, స్వాభిమానం, చక్కటి అభినయం, అంతకన్నా గొప్ప గానం, మనసుకు హత్తుకునే రచనావ్యాసంగం, అన్నిటికీ మించి ప్రతిష్టాత్మక భరణీ సంస్థ నిర్వహణ .......... ఇలా ఒకటేమిటి ... బహుముఖ ప్రజ్ఞాశాలి మన మనోఫలకం ముందు ప్రత్యక్షమౌతుంది. కథానాయికగా, అద్భుతగాయనిగా, సంగీతదర్శకురాలిగా, సినీ నిర్మాతగా, దర్శకురాలిగా, స్టూడియో అధినేతగా, రచయిత్రిగా .....అన్నింటికీ మించి విలక్షణమైన వ్యక్తిత్వంతో చలనచిత్రసీమలో మహారాజ్ఞిగా... ఓ వెలుగు వెలిగిన భానుమతి లలితకళలకు మెరుగులు దిద్దిన ధీమంతురాలు. ఆమెకు జ్యోతిషం, చిత్రలేఖనం కూడా వచ్చు. మద్రాస్ ప్రభుత్వసంగీతకళాశాలకు ప్రిన్సిపాల్ గా పనిచేసారు భానుమతి. తిరువయ్యూర్ లో జరిగిన త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలలో పాల్గొని భారతరత్న ఎం.ఎస్. సుబ్బులక్ష్మి తో కలిసి, గళం కలిపి "ఎందరో మహానుభావులు" కీర్తనను ఆలపించిన సంగీతసరస్వతి.

కేవలం పద్నాలుగు నుండి ఇరవై ఎనిమిది సంవత్సరాలలోపు ఎంతోమంది సాధించలేని విజయాలను భానుమతి స్వంతం చేసుకోగలిగింది. పద్నాలుగు సంవత్సరాల వయసు లోనే, ఆమె మొట్టమొదటి సినిమా "వరవిక్రయం" లో నటించింది. పద్దెనిమిదేళ్ళ వయసులో, ఆరోజుల్లోనే, రామకృష్ణారావును ప్రేమించి, వివాహం చేసుకుంది. పంతొమ్మిది సంవత్సరాలకు కొడుకు భరణికుమార్ కు జన్మనిచ్చింది. అపుడే రచయిత్రిగా అవతారమెత్తింది. ఇరవై ఒక్క సంవత్సరాలకే సొంత సినిమా నిర్మించింది. ఇరవై అయిదు సంవత్సరాలకే స్వంత స్టూడియో నిర్మించింది. ఇరవై ఎనిమిది సంవత్సరాలకు "చండీరాణి" చిత్రానికి దర్శకత్వం వహించింది. ఇలా భానుమతి జీవితప్రస్థానంలో అనేక విశేషాలు .... ఆమె బహుముఖ ప్రజ్ఞాశాలి అని తెలియచెప్పడానికి.



భానుమతి సెప్టెంబర్ 7 వ తేదీ 1925 న , ప్రకాశం జిల్లాలోని, మద్దిపాడు మండలం, దొడ్డవరం గ్రామంలో జన్మించింది. తండ్రి శ్రీ బొమ్మరాజు వెంకటసుబ్బయ్య, తల్లి సరస్వతమ్మ. రెవిన్యూ ఇనస్పెక్టర్ గా పనిచేసే శ్రీ వెంకటసుబ్బయ్య మంచి సంగీత వి-

ద్వాంసుడు. తండ్రే భానుమతికి తొలిగురువు. తల్లికూడా సంగీతం నేర్చుకుంది. భానుమతి ఏకసంతాగ్రాహి. భగవంతుడు ఆమెకు ఒకసారి వింటే వెంటనే పాడగలిగే యోగం ప్రసాదించాడు.

***********

తల్లి ఇరుగుపొరుగు పిల్లలకు సంగీతం నేర్పుతుంటే, ప్రక్కన కూర్చుని వారితో కలిసిపాడేది భానుమతి. ఇంట్లో గ్రామఫోన్ రికార్డులుఉండేవి. ఎం.ఎస్. సుబ్బులక్ష్మి, హీరాబాయ్ బదోడ్కర్, నారాయణరావు వ్యాస్, బాలగంధర్వ, రోషనారా బేగం వంటి నిష్ణాతులు పాడిన పాటలువింటూ, యధాతథంగా పాడేస్తూవుండేది. సినిమారంగం మీద సదభిప్రాయం లేని కారణంగా ఆ రంగంలో ప్రవేశించడానికి ఎటువంటి ఆసక్తి చూపించలేదు. డా.గోవిందరాజుల సుబ్బారావు భానుమతి తండ్రికి సన్నిహిత మిత్రుడు. తొలుత సారథి ప్రొడక్షన్స్ వారి 'మాలపిల్ల' చిత్రంలో 1938 లో హీరోయిన్ చెల్లెలి పాత్రకు భానుమతిని తీసుకోవడానికి వొప్పించేందుకు ప్రయత్నించారు. భానుమతి తండ్రిగారికి కూడా ఆమె సినిమాల్లో నటించడం ఇష్టం లేదు. కానీ ఆమెచేత పాటలు పాడించి, రికార్డులుగా ఇవ్వాలనే ఆలోచనలో వున్నారు. అందుకని ఒకసారి మద్రాస్ కు వెళుతూ భానుమతిని వెంట తీసుకెళ్ళారు. అక్కడ గూడవల్లి రామబ్రహ్మం గారిని




కలవడం జరిగింది. అచట టంగుటూరి సూర్యకుమారిని చూసి తనుకూడా సినిమాల్లో నటించేందుకు భానుమతి సుముఖత చూపింది.

అప్పట్లో రేలంగి వెంకట్రామయ్య ప్రొడక్షన్ మేనేజర్ గాను,సహాయ నటీనటులను సమీకరించి నిర్మాణ సంస్థలకు అందజేసే వ్యాపకం లో వుండేవారు. ఆయనవెంట తండ్రితో కలిసి కాకినాడ వెళ్లి భానుమతి చిత్తజల్లు పుల్లయ్యను కలిసారు. అది 1939 వ సంవత్సరం. అప్పుడే 'వరవిక్రయం' సినిమా నిర్మాణం కాబోతోంది. భానుమతిని అందులో "కాళింది" పాత్రకు ఎంపిక చేసారు. అదే భానుమతికి తొలిచిత్రం. అందులో ఆమె "పలుకవేమి నా దైవమా పరులు నమ్మేది న్యాయమా రామా" అనే త్యాగరాయ కృతిని ఆలపించింది. సినిమాల్లో త్యాగరాయ కృతిని ఆలపించిన తొలి గాయని భానుమతే. అదే సినిమాలో " స్వాతంత్ర్యమే లేదా ఈ స్త్రీజాతిలో-

నా", "జాతికి నీసూత్రంబే సంపత్కరమౌ సాధనము" అనే మరో రెండు పాటలు కూడా పాడింది. అపుడు భానుమతికి నెలకు 150 రూపాయల జీతం ఇచ్చేవారు. సినిమా శతదినోత్సవం చేసుకుంది. ఆ తర్వాత భవభూతి కావ్యమును 'మాలతీమాధవం' పేరుతో 1940 లో సినిమాగా నిర్మించారు. అందులో భానుమతిది మాలతీ పాత్ర. భానుమతి పారితోషికం 1500 రూపాయలు. కానీ ఆ చిత్రం ఫ్లాపయ్యింది .



*********

భానుమతి కలకత్తాలోసినిమా షూటింగుల్లో ఉంటున్నప్పుడు శ్రీ విశ్వనాథ కవిరాజు, శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంత కవిలతో పరిచయం ఏర్పడి, వారివద్ద పద్యాలు ఎలా వ్రాయాలో నేర్చుకుంది.

కవిరాజు భానుమతికి కథలు ఎలా వ్రాయాలో నేర్పారు. అప్పుడే ఆయన భానుమతిచేత "మరచెంబు" అనే కథ వ్రాయించారు. ఆ కథ 'చిత్రగుప్త' అనే పక్షపత్రికలో అచ్చుయ్యింది. అప్పుడు భానుమతికి పద్నాలుగేళ్ళు. ఆ తర్వాత భానుమతి పి. పుల్లయ్యా దర్శకత్వంలో నిర్మించిన 'ధర్మపత్ని'లో నటించింది, 1941 లో. 'భక్తిమాల' చిత్రంలో నటిస్తుండగా అందులో నృత్య సన్నివేశాలు ఉండడంతో వెంపటి సత్యం చేత భానుమతికి నృత్యశిక్షణ ఇప్పించారు. ఆ చిత్ర నిర్మాణం పూర్తయ్యాక భానుమతి ఒంగోలు కు వచ్చేసింది. భానుమతి తండ్రి, కొల్హాపూర్ నుంచి ఒక మరాఠీ విద్వాంసుడిని పిలిపించి సంవత్సరంపాటు భానుమతికి హిందుస్తానీ సంగీతంలో శిక్షణ ఇప్పించారు. ఆ తర్వాత ఆమె వీణ, సితార్ వాద్యాలను వాయించడం నేర్చుకుంది.

ఫేమస్ సినీ అండ్ స్టార్ కంబైన్స్ వారు మద్రాస్ వేల్ స్టూడియో లో హెచ్.వి.బాబు దర్శకత్వంలో 1943 లో "కృష్ణప్రేమ" చిత్రం నిర్మించారు. అందులో శాంతకుమారి రాధగా నటించగా భానుమతి చంద్రావతిగా నటించారు. భానుమతికి అది ఐదవ చిత్రం. ఆ చిత్రానికి పి. ఎస్. రామకృష్ణారావు సహాయదర్శకుడు. అతడిని చూడగానే ప్రేమలో పడిపోయింది భానుమతి. దానికితోడు ఆచిత్రం షూటింగ్ లో జరిగిన కొన్ని సంఘటనలు ఆప్రేమను మరింత బలపరచాయి. కానీ భానుమతి తండ్రి ఆమె రామకృష్ణను పెళ్లి ఆడడానికి అంగీకరించలేదు. తరువాత పరిస్థితులు సానుకూలంగా మారడంతో, 8 ఆగస్ట్ 1943 న ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. అలా 'కృష్ణప్రేమ' చిత్రం భానుమతిని వివాహబంధం లోకి లాగింది. గృహిణిగా జీవితాన్ని గడపాలని భర్తతో కలిసి అత్తగారి ఊరు పుంగనూరు వెళ్ళే ప్రయత్నం చేసింది భానుమతి. కానీ, సినిమా ప్రపంచంలో మహారాణిలా ఏలాలని రాసిపెట్టి వుంటే, పుంగనూరు ప్రయాణం ఎలా వీలవుతుంది?

సీనియర్ నటుడు ముదిగొండ లింగమూర్తి భానుమతిని వాహినీ అధిపతి బి.యెన్. రెడ్డికి పరిచయం చేసారు. అప్పట్లో బి.యెన్.రెడ్డి నాగయ్యా హీరోగా, జయమ్మ హీరోయిన్ గా 'స్వర్గసీమ' చిత్రాన్ని నిర్మించే ఉద్దేశంలో వున్నారు. భానుమతిని అందులో వ్యాంప్ పాత్ర కోసం

ఎంపిక చేసారు. 1942 – 43 లో రెండవ ప్రపంచయుద్ధం తారాస్థాయిని చేరుకోవడంతో అందరూ వాహినీ సంస్థను ఖాళీచేసి తాడిపత్రి వెళ్ళిపోయారు.

*********

యుద్ధం హడావుడి తగ్గుముఖం పట్టాక, 'స్వర్గసీమ' నిర్మాణం ఊపందుకుంది. లింగమూర్తి నిర్మాణ వ్యవహారాలను చూసుకున్నారు. 10 జనవరి 1946 న విడుదలైన 'స్వర్గసీమ' సినిమా అఖండవిజయం సాధించి, అనూహ్యమైన ధనార్జన చేసింది.భానుమతి లాంటి నటిని చూడాలంటే, స్వర్గసీమ చిత్రాన్ని చూడాలని అందరూ చెప్పుకున్నారు. ఆమె పాత్ర తీరు మూడు దశల్లో వుంటుంది. మొదట భాగవతుల బృందంలో అమాయకమైన నటి. తరువాత ఆమె కట్టు బొట్టు తీరు అన్నీ మారతాయి. వ్యాంప్ లా అయ్యేందుకు, సుబ్బులు సుజాతలా మారుతుంది. చివరలో పశ్చాత్తాపం. బ్లడ్ అండ్ సాండ్ అనే ఆంగ్లచిత్రంలోని హమ్మింగ్ తీసుకుని "ఒహోహో పావురమా" పాటకు జీవంపోస్తే,ఆ పాటకు భానుమతి అభినయం ఈనాటికీ నిత్యనూతనంగా అనిపిస్తుంది. 1945 లో స్వర్గసీమ చిత్రంనాటికి భానుమతి నాట్యంలో మంచి ప్రావీణ్యం సంపాదించింది. స్వర్గసీమ చిత్రం తెలుగులోనే కాదు....తమిళంలోనూ వందరోజులు ఆడింది.

బి.యెన్. రెడ్డి 'వందేమాతరం' సినిమా షూటింగ్ కోసం హంపీ వెళ్ళినప్పుడు శ్రీకృష్ణదేవరాయలు కాలంనాటి ప్రేమకథ ఏదైనా తీయాలని 1939 లోనే అనుకున్నారు. ఆలోచన రావడంతడవుగా, దేవులపల్లి కృష్ణశాస్త్రిని కాకినాడనుంచి పిలిపించి 'మల్లీశ్వరి' సినిమాను ఒక కళాఖండం గా రూపుదిద్దించేందుకు ప్రణాళిక రచించి మాటలు, పాటలు రాయించారు దర్శకుడు బి.ఎన్.రెడ్డి. పాటల రికార్డింగ్ కి ఆరు నెలలు పట్టింది. భానుమతితో వేగటం అప్పటికే కష్టమైపోయింది. అందుకని రేవతి అనే అమ్మాయిని మల్లీశ్వరి పాత్రకోసం పరీక్షించారు. కానీ భానుమతిస్థాయి ఆ అమ్మాయికి లేదనిపించి భానుమతినే ఆ పాత్రకు తీసుకున్నారు. అందులో ఉషాపరిణయం యక్షగానం ఒక గొప్ప నాట్యశిల్పం. దానికోసం పసుమర్తి కృష్ణమూర్తి రెండు నెలలకు పైగా రిహార్సల్స్ చేయించారు. ఆ చిత్రం 20-12-1951 న విడుదలైంది. విజయవాడలో వందరోజులు ఆడినా అందరూ గొప్ప క్లాసిక్ అన్నరేకాని కమర్షియల్ సినిమా అనలేదు. ఆర్థిక విజయాన్ని అందుకోలేకపోయింది. జయదేవుని అష్టపది 'ధీరసమీరే యమునాతీరే' ట్యూన్ ఆధారంగా 'మనసున మల్లెల మాలలూగెనే' అనే పాట రూపు దిద్దుకుంది. ఈ చిత్ర నిర్మాణ సమయంలో బెంగాలీ దర్శకుడు దేవకీబోస్ మద్రాస్ వచ్చి మల్లీశ్వరి సెట్ లో బి.ఎన్.ను కలిసారు. అపుడు బోస్ కు భానుమతిని పరిచయం చేయడం జరిగింది.ఆమె చేత బోస్ రవీంద్రుని 'గీతాంజలి' లోని కొన్ని పద్యాలూ పాడించుకున్నారు. భానుమతి ఎన్టీరామారావు తో చండీరాణి, చింతామణి, సారంగధర, వివాహబంధం, తోడునీడ, బొబ్బిలియుద్ధం, పల్నాటియుద్ధం, తాతమ్మ కల వంటి చిత్రాలలో నటించింది.



ముందుగా అనుకున్నప్రకారం విజయా వారి 'మిస్సమ్మ' సినిమాలో మిస్సమ్మ టైటిల్ పాత్ర భానుమతిదే. నాలుగు రీళ్ల సినిమా పూర్తయ్యాక ఒకరోజు, వరలక్ష్మీవ్రతం నాడు పూజాకార్యక్రమాలు పూర్తిచేసుకుని షూటింగ్ కి భానుమతి కాస్త ఆలస్యంగా వెళ్ళింది. నిర్మాత చక్రపాణి కి కోపం వచ్చింది. ఆలస్యమైనందుకు క్షమాపణ చెప్పమన్నారు. ముందురోజు సాయంత్రం షూటింగ్ ప్యాకప్ చెప్పేటప్పుడు మరునాడు ఆలస్యంగా వస్తానని ప్రొడక్షన్ సిబ్బందికి నోట్ రాసి చక్రపాణికి ఇవ్వమని చెప్పానని భానుమతి వాదించింది. అందుచేత క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని చెప్పి వెళ్ళిపోయింది. ఆ సంఘటనకు ఎంతో కోపం తెచ్చుకున్న చక్రపాణి, అంతవరకు తీసిన నాలుగు రీళ్ళను కాల్చివేసి భానుమతి స్థానంలో సావిత్రిని తీసుకొని సినిమా పూర్తిచేసారు. ఒకవిధంగా మిస్సమ్మ సినిమా సావిత్రి చిత్రసీమలో నిలదొక్కుకోవడానికి దోహదపడింది. భానుమతి 1954 లో 'చక్రపాణి' అనే చిత్రం నిర్మించింది. విజయా నిర్మాత చక్రపాణి మీద కక్ష సాధింపుకే భానుమతి సినిమాకు ఆయనపేరు పెట్టిందని సినీ పండితులు గుసగుసలాడుకున్నారు. ఆ సినిమాకి భానుమతి తొలిసారి సంగీత దర్శకత్వం వహించింది.



వినోదా వారి 'దేవదాసు' సినిమాలో పార్వతి పాత్రకు నిర్మాత డి.ఎల్.నారాయణ మొదట భానుమతికి ఆఫర్ ఇచ్చారు. కానీ, భానుమతి ఆ ఆఫర్ ను తిరస్కరించింది. ఎందుకంటే 'దేవదాసు' చిత్రనిర్మాత డి.ఎల్. నారాయణ గతంలో భరణి స్టూడియో లో మేనేజర్ గా పనిచేసారు. "నా దగ్గర పనిచేసినవాడు తీసే సినిమాలో నేను నటించాదమా... అది నాకే అవమానం" అంటూ తిరస్కరించింది. తరువాత ఒకరకమైన ఫాల్స్ ప్రెస్టేజ్ తో డి. ఎల్. నారాయణ నిర్మించిన "కన్యాశుల్కం" చిత్రం లో మధురవాణి పాత్రను కూడా వదులుకుంది. పొగరుమోతుతనంతో వ్యవహరించే భానుమతి వ్యవహారశైలి ఎక్కువమంది నిర్మాతలకు నచ్చలేదు. "పాత్రలు నా దగ్గరకు వచ్చాయి గాని నేను పాత్రలవద్దకు వెళ్ళలేదు." అని ఆమె గర్వంగా చెప్పుకునేది. 'హరిశ్చంద్ర' సినిమాలో చంద్రమతి పాత్ర చెయ్యమంటే చెయ్యానంది.

భానుమతిది విలక్షణమైన, విశిష్టమైన వ్యక్తిత్వం. ఆమెకు గర్వమని, అహంభావమని దూరంగా చూసినవాళ్ళు అనుకుంటారు. అది కేవలం తన ఆత్మవిశ్వాసం అని భానుమతి చెప్పుకున్నారు. మగ ఆధిక్యం ప్రదర్శించే ఈ చిత్రసీమలో అలా పొగరు, వగరు గానే వుండాలని ఆమె చెబుతూండేవారు. 1966 లో వచ్చిన "పల్నాటియుద్ధం" లో భానుమతి నాయకురాలు నాగమ్మ పాత్రలో కన్నాంబనే మరిపించింది. లైలామజ్ను చిత్రంలో భగ్నప్రేమికురాలిగా, బాటసారిలో మాధవి పాత్రలో జీవించింది. విప్రనారాయణ చిత్రంలో పరమభక్తుడైన విప్రనారాయణుని భ్రష్టుపట్టించే పాత్రలో భానుమతి మంచి మార్కులు తెచ్చుకుంది.

^^^^^^^^^^^^^

అనురాగం, అంతస్తులు,

పుణ్యవతి వంటి సినిమాల్లో సెంటిమెంట్ నిండిన పాత్ర-ల్లో రాణించింది. "అంతా మన మంచికే" సినిమాలో అన్నీ-తానై నిలిచి సినిమాను గొప్ప హిట్ చేసింది. అప్పటినుండి భానుమతి ధోరణి మారిపోయిం-ది. మల్లీశ్వరి పాత్రలోని ముగ్ధ-త్వం మరుగున పడిపోయింది. మగరాయుడిలా పాత్ర పోషణ చెయ్యడం ప్రారంభించింది. వి-చిత్రవివాహం , అమ్మాయిపెళ్ళి, మంగమ్మగారి మనవడు, బామ్మ మాట బంగారు బాట చిత్రాల్లో ఈ ధోరణి బాగా కనిపిస్తుంది. తమిళంలో కూడా భానుమతి చాలా సినిమాల్లో నటించింది. "మాన్ మగన్ తెవి" వంటి చి-త్రాల్లో కొన్ని హస్యపాత్రలు కూడా పోషించింది. భానుమతి విప్రనా-రాయణ, బాటసారి, వివాహబం-ధం వంటి సినిమాల్లో సంగీతం చేసానని చెప్పుకుంది.

ఆమె మంచి రచ-యిత్రి . ఆమె రచించిన "అత్త-గారి కథలు" కథాసంపుటికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. 'నాలో నేను' పేరుతో భానుమతి ఆత్మ-కథ రాసుకుంది. లలితకళా అకాడమీ కి భానుమతి ఐదేళ్ళు సభ్యురాలిగా వుంది. తమిళనా-డు ప్రభుత్వ సంగీత కళాశాలకు ప్రిన్సిపాల్ గా వ్యవహరించింది. మద్రాస్ సాలిగ్రాం లో తనపేరిట ఒక పాఠశాలను నెలకొల్పింది. 'చండీరాణి' సినిమాను మూడు భాషల్లో నిర్మించి, అందులో ద్వి-



పాత్రాభినయం చేసి, దర్శకత్వ బాధ్యతలను కూడా నిర్వహించిన వ్యక్తిగా భానుమతిపేరు రికార్డుల కెక్కింది.

1966 లో ఆమెకు భారతప్రభుత్వం "పద్మశ్రీ" అవార్డ్ ను బహూకరించింది. ఆం-ధ్రప్రదేశ్ ప్రభుత్వం "రఘుపతి వెంకయ్య అవార్డు" తో సత్కరిం-చింది. 'అన్నై', 'అంతస్తులు', 'పల్నాటియుద్ధం' సినిమాలలో ఆమె నటనకు ప్రాంతీయ చిత్రాల కేటగిరి లో జాతీయబహుమతు-లు అందుకుంది. అన్నాదురై ఆమెను 'నడిప్పుకుం ఇళక్క-నం' (నటనకు వ్యాకరణం) అనే బిరుదును ప్రదానం చేసారు. 1984 లో తమిళనాడు ప్రభుత్వం 'కలైమామణి' బిరుదుతో భాను-మతిని సత్కరించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. 2013 లో తంతి తపాలా శాఖ భానుమతి స్మారక స్టాంప్ ను విడుదల చేసింది. యాభై సంవత్సరాలక్రితం కొలంబియా రికార్డింగ్ కంపనీ వాళ్ళు భానుమతి పాటల ఆల్బం విడుదల చేస్తూ రికార్డు స్లీవ్ మీద ముద్రించిన పరిచయవాక్యాలను చదివితే భానుమతి ప్రజ్ఞ విదిత-మౌతుంది.

ఆ రికార్డు కవర్ మీద "స్వర వాహిని, స్వరమోహిని, స్వరారోహ స్వరవర్షిని, చలనచిత్ర ధరణి నేలు భరణి రాణి భానుమతికి, సంగీతపు సామ్రాజ్ఞికి సాటి లేరు... లేరు...లేరు. సప్తస్వరసాగరాల గుప్తమ్మగు అమృతమ్ము చిలికి చిలికి వెలికితీసి నిలుపుకున్నదా గళమ్ము.... ఆ మంగళ గళమున చిరుపొగరు, వగరు రంగరించి సరిగమపదనిసలు ఆమె స్వర-సుధలకు సంతరించె" అంటూ ముద్రించారు. ఇంతకన్నా గొప్ప పొగడ్త మరేం కావాలి. భాను-మతికి ఒకే కుమారుడు....డాక్టర్ భరణి.


భానుమతి 2005 డిసెంబర్ 24 న మద్రాస్ లో స్వర్గస్తులయ్యా-రు.

( మిత్రుడు శ్రీ షణ్ముఖ కు కృ-తజ్ఞతలతో )

........ డా. పోడూరి శ్రీనివాస్ రావు (98494 22239)

# గడి - నుడి

డా. చాగంటి కృష్ణకుమారి




## సూచనలు : అడ్డము:

1.ఒక మొక్కనుండి పుప్పొడి అదేజాతికి చెందిన మొక్కలకు లేదా దగ్గరి సంబంధంగల మొక్కలకు చేరితే ఆప్రక్రియను ---- అంటారు (9)

6. లయబద్ధమైన పద్యము నడకలో సహజంగా వచ్చే విరామ స్థానం.

7. సర్పములు (3)

9. ప్లంబం (2)

10. పూర్తిగా మాగని, ఎర్ర బారిన (2)

11. వానర రాజైన వాలి భార్య (2)

12 . పీత బాధలు - వి. (వెనకనుండి) (2)

13 ఎర్ర తామర (3)

15 కాపర్ గిరాగిరా తిరిగి తిరగబడింది.(2)

18. మందుసీసాలలో వుంచే సిలికా జెల్ పొట్లాలకి, ప్రయోగశాలల్లో వాడే కాల్షియం క్లోరైడ్ , గాఢ సల్ఫ్యూ-రిక్ ఆమ్లానికీ ఈ లక్షణం వుంటుంది .(9)

## సూచనలు :

1. అయస్కాం త ధృవాలవైపుకి బలహీనంగా ఆకర్షింపబడి , శాశ్వంతంగా అయస్కాంత ధర్మాన్ని నిలుపు లేని ధర్మము . ఉదాహరణకి అటువంటి ధర్మాన్ని ఆక్సి జన్ ప్రదర్శి స్తుంది.(9)
2. పదిహేనురోజులు(3)
3 విషము(4)
4. కొణతాడు (3).
5. ఒక మొక్కలోని పరాగరేణువులు అదే మొక్క-లోని కీలాగ్రాన్ని చేరడము (9) కిందనుండి పైకి.
7. ఏరకుమీ కసుగాయలు, దోరకుమీ బంధుజ-నుల దోషముసుమ్మీ- - - మీ రణమందున (3)
8. దంత్యములు పుట్టు స్థానము. (3) కిందనుండి పైకి
14. పసిడి (Au) (4) కిందనుండి పైకి
16.ఈ భాండములోని అన్నరాశి అక్షయము కాదు (3) కిందనుండి పైకి
17.మజ్జిగ చిలకడానికి వాడే కర్ర పరికరం (3) కిందనుండి పైకి

---

### అక్టోబర్ నెల గడి-నుడి సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| తు | ల్యా | భా | ర | ము | | హా | ర | ము |
| ల్యా | | | | చ | | లా | | |
| ము | క్ర | ప | | కో | లా | హ | ల | ము |
| | | | | వ్యా | | ల | | |
| వి | న్న | పా | | | కు | ము | ద | ము |
| | | ల | | మ | | | | |
| అ | ర | మీ | ట | రు | | బు | రా | ష |
| | | గ | | వ | | | | ర |
| ద | ప | డ | | ము | డ | దం | లా | తు |

# తెలుగు పద్య రత్నాలు - 19



ఆర్. శర్మ దంతుర్తి

ధర్మరాజు మాయాజూదంలో ఓడిపోయాక అరణ్యావాసం చేస్తున్నప్పుడు కృష్ణుడు వస్తాడు చూడ్డానికి. రాజ్యం పోయిన వాళ్లని ఊరడిస్తూన్నప్పుడు మార్కండేయ మహర్షి వస్తాడు అటుకేసి. కృష్ణుడు ఆయనని పిలిచి ధర్మరాజుతో కొన్ని విషయాలు మాట్లాడి స్వాంతన కలిగించమంటే, ఆయన సృష్టి క్రమం, యుగాలు, కల్పాలు ఎలా కలుగుతాయో చెప్తున్నప్పుడు భగవంతుడి గుణగణాలు వివరిస్తూ తనకేం జరిగిందో చెప్తాడు. ఆ క్రమంలోనే కల్పాంతకాలంలో తనకి జరిగిన విషయం చెప్తున్నప్పుడు నారాయణుడు ఆయనకి చెప్పిన విషయమే ఈ నెల పద్యం.

ఉ. ఎప్పుడు ధర్మహాని యగు, నెప్పు డధర్మము మీఱు, గ్రూరులై
యెప్పుడు దైత్యు లుబ్బుదురు హీనతబొందు రెప్డు వేల్పు లే
నప్పుడు సత్కులీనుల గృహంబుల నుద్భవ మొంది లీనమై
నెప్పటియట్ల నిల్పుదు సురేంద్రుల నంచితధర్మపద్ధతిన్ (అరణ్యపర్వం చతుర్థాశ్వాసం. 276)

కల్పాంతకాలంలో అంతా నీరు ఆవిరించి ఉన్నప్పుడు మార్కండేయ మహర్షి – తాను చిరంజీవి కనక - దారి తెలియక తిరుగాడుతుంటే అంతటా నిండి ఉన్న నీళ్ళలో ఒక మర్రిచెట్టు, ఆ చెట్టుకో ఆకు, ఆ ఆకు మీద నిద్రిస్తున్న ఓ బాలుడు కనిపించారుట. మహర్షి వెళ్ళి ఆ పిల్లవాణ్ణి అడుగుతాడు, ఇదేం వింతో. ఆ బాలుడు చెప్పేదేమంటే, 'మీరు బాగా అలిసిపోయి ఉన్నారు, విశ్రాంతి తీసుకుందామనుకుంటున్నారా?' ఈ మహర్షి సమాధానం చెప్పేలోపులే ఆ బాలుడి నోట్లోకి బలవంతంగా వెళ్ళిపోయి అక్కడ పధ్నాలుగు లోకాలనీ విశ్వాన్నీ చూసాక చాలా కాలం అటూ ఇటూ తిరిగాక ఏమీ దిక్కుతోచదు. మళ్ళీ ఆ బాలుడి గురించే తలపోస్తుంటే బయటకి వస్తాడు ఆ కుర్రాడి కడుపులోంచి. 'అయ్యా మీరెవరు, ఈ ఆకు ఏమిటి, ఇంత చిన్న ఆకుమీద పడుకుని ఉన్న మీ ఉదరంలో విశ్వం అంతా ఉండడం, ఏమిటి ఈ వింత?' అని అడుగుతాడు. అప్పుడు కుర్రాడు చెప్పినదే ఈ నెల పద్యంలో యర్రాప్రగడ చెప్పినది. నారము అంటే నీరు, నీటికి ఆధారమైనవాడు కనక నారాయణుడు భగవంతుడు. నారాయణుడు సర్వ ప్రపంచానికీ, సమస్త విశ్వానికీ ఆధారభూతమైనవాడు కనక వాటిని తన కడుపులో ఇముడ్చుకోగలడు. అయితే మరి మనకి ఎలా కనిపిస్తాడు? ఆయన్ని తెలుసుకోవడం అతి కష్టం కనక మనమీద ప్రేమతో ఓ అవతారంగా అవతరించినపుడు 'ఓహో భగవంతుడు ఇలా ఉంటాడన్నమాట' అని మనకి తెలుస్తుంది. మరి భగవంతుడు అంటే మనకి కనిపించిన ఆ అవతారమేనా అంటే కాదు. ఆ అవతారంలో భగవంతుడి ఒక అంశ మనకి కనిపిస్తుంది. మరి భగవంతుడు అవతారం ఎప్పు-

డొస్తుందో మనకి తెలిసేది ఎలా? దానికి సమాధానం చెప్తున్నాడు.

ధర్మానికి హాని కలిగినప్పుడు, అధర్మం ప్రబలుతున్నప్పుడూ, దైత్యులు (దితి సంతతివారు, రాక్షసులు) పెరుగుతున్నప్పుడు, ఎప్పుడు వేల్పులు హీనస్థితికి చేరతారో అప్పుడు తాను అవతారం ధరిస్తాడు. ఎక్కడ? సత్కులీనుల గృహంలో. అలా పుట్టి ధర్మం స్థాపించడానికి సాయపడతాడు. అలా సాయపడినపుడు ఇంద్రుడితో సహా అందరికీ అన్నీ అందేలా చేసి ధర్మమార్గంలో నిలబెడతాడు. ఇది దాదాపుగా భగవద్గీతలో చెప్పే 'యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత ..' అనే శ్లోకానికి సరిగ్గా సరిపోతుంది. భగవంతుడు ఎప్పుడు సత్కులీనుల ఇళ్ళలో పుట్టడం అనేది మనకి మరో భగవద్గీత శ్లోకంలో (శుచీనాం శ్రీమతాం గేహే...) తెలుస్తుంది. ఎందుకయ్యా ఈ ధర్మం అనేదాన్ని ఉద్ధరించడం అంటే భగవంతుడే ఈ ధర్మానికి మూలవిరాట్టు కనకా, ఏ ధర్మం వల్లైతే మనం సరైన మార్గంలో బతకగలమో, అసలు అలాగే ఎందుకు బతకాలో, అలా బతికినపుడు "మా-త్ర-మే" లోకాలన్నీ సంతోషంగా ఉంటాయి కనక అని అర్థం చేసుకోవచ్చు. దీన్నే గౌతమ బుద్ధుడు కూడా, మొత్తం రాజ్యం, అన్నీ వదులుకుని ధర్మం తెలుసుకోవాలనుకోవడం, పట్టుబట్టి దాన్ని సాధించడంలో చూడవచ్చు.

బుద్ధుడి శిష్యుడు అశ్వజిత్ అనే ఆయన మొదటిసారి శారిపుత్రుడికి కనిపించినపుడు ఆయన అడుగుతాడు, 'మీరు చాలా సంతోషంగా ఉన్నట్టున్నారు, మీ గురువు ఎవరు' అని. దీనికి అశ్వజిత్ శ్లోక రూపంలో ఇచ్చిన సమాధానం మొత్తం బౌద్ధ సాహిత్యానికి తలమానికమైనటువంటిది అంటారు. ఆ శ్లోకం ఇలా ఉంటుంది

**యే ధర్మా హేతుప్రభవా హేతుం తేషాం తథాగతోహ్యవదత్**
**తేషాం చ యో నిరోధో ఏవం వాదీ మహాశ్రమణః**

ఏ కారణంలో నుంచి ధర్మాలన్నీ ఉద్భవిస్తున్నాయో ఆ కారణాలకి మూలం, వాటినన్నింటినీ చేరుకోవడానికి, ఈ జన్మమరణాల ని అంతమొందించడానికీ దారి కనిపెట్టిన మహాశ్రమణుడే నా గురువైన ఈ తథాగతుడు. ఇదే సరిగ్గా పైన చెప్పిన యర్రాప్రగడ పద్యం కూడా చెప్పేది – ధర్మమే భగవంతుడు. అందుకే ఆ ధర్మం – దేని వల్ల అయితే మనం భగవంతుణ్ణి తెలుసుకోగలమో ఆ ధర్మం కలకాలం బతికి ఉండడం కోసం – అది నాలుగు పాదాలమీద అయినా, చివరకి ఒకపాదం మీద అయినా సరే – భగవంతుడు అవతరిస్తూ ఉంటాడు. అసలీ ధర్మం అనేదే లేకపోతే ఏమిటి గొడవ అంటే అప్పుడు అసలు మనుష్యులలో కనికరం, మానవత్వం అనేవి నశించిపోయి మనం మానవులం అని చెప్పుకోవడానికి పనికిరాము కనక. అందుకే సత్యం ధర్మం అనేవి – కంచెర్ల గోపన్న అనే 'కరుణాపయోనిధి' అనే పదం కూడా – భగవంతుడికి ఆపాదించబడ్డాయి. దీనినే మరోవిధంగా చెప్పాలంటే, "సత్యం పరం ధీమహి" (పరమాత్మ సత్య స్వరూపుడు). సంస్కృతంలో మహాభాగవతంలో మొదటిశ్లోకంలోనే ఈ సత్యం పరం ధీమహి అనేది చెప్పబడింది. పరమాత్మ సత్య, ధర్మ స్వరూపుడు. అందువల్లనే 'యధా యధాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత' అనేది చెప్పడం.

# పట్టుదల



## ఆదూరి హైమవతి

పూర్వం సముద్రతీరాన ఒక అడవి ఉండేది.ఆఅడవి లో చాలా పక్షులు చెట్లమీద గూళ్ళు కట్టుకుని నివశించేవి. ఆ అడవిగుండా ఒక నది పారుతూ వచ్చి సముద్రంలో కలిసేది. నదికీ సముద్రానికీ మధ్య వున్న చెట్లమీద చాలా పక్షులే నివసించేవి. నీటిలో కొట్టుకొచ్చే చేపలనూ ,నత్తలనూ, తింటూ కాలక్షేపం చేసేవి.

వాటిలో ఒక టిట్టిభం అనే చిన్నపక్షి ఉండేది. మిగతా పక్షులన్నీ చెట్లమీద గూళ్ళు కట్టుకుని గుడ్లుపెట్టి పొదిగి పిల్లలను చేసుకుంటుంటే ,అది మాత్రం సముద్ర తీరాన ఇసుకలో ,ఇసుకత్రవ్వి గూడులా చేసుకుని గుడ్లు పెట్టుకుంది.ఒక పౌర్ణమిరోజున పెద్ద పెద్ద అలలులేచి ముందుకు వచ్చి టిట్టిభం గుడ్లు పెట్టుకున్నతీరం వరకూ వచ్చి గుడ్లను లోనికి కొట్టుకెళ్ళేవి. టిట్టిభం చాలా బాధపడింది.ఐతే మరలా అక్కడే రెండోమారూ గుడ్లు పెట్టుకుంది.మరలా సముద్ర కెరటాలకు గుడ్లు కొట్టుకు పోయాయి. ఇలా చాలా మార్లు జరిగినా నేను గుడ్లు పెట్టుకోను ఇది అనువైన ప్రదేశంకాదు మిగతా పక్షుల్లా చెట్టుమీద గూడు కట్టుకుని గుడ్లు పెట్టుకుందా మన్న ఆలోచనే లేక అది అక్కడే పెట్టుకోడం అలలకు గుడ్లూ కొట్టుకుపోడం జరుగుతూ వచ్చింది. మిగతాపక్షులన్నీ తమ పిల్లలతో గూళ్లలో కోలాహలంగా ఉండటం చూసి టిట్టిభానికి చాలా బాధేసింది.తాను ఏనాడూ తన పిల్లల్లను చూసుకునే భాగ్యానికి నోచుకోలేక పోయానే అని విచారించింది. సముద్రం మీద చాలా కోపం వచ్చింది దానికి. ఓక్రోజున ఉదయాన్నే సముద్రంలోని నీటిని ముక్కున పట్టూకుని దూరంగా సముద్ర తీరాన పోయసాగింది.


'ఎలాగైనా ఈ సముద్రాన్ని నీరులేకుండా ఎండకట్టి నా గుడ్లను పొదిగి నా పిల్లలను చూసుకుంటను 'అను కుంటూ సముద్రంలోని నీటిని తన చిన్ని ముక్కుతో బయట పోయ సాగింది.అసలే టిట్టిభం చాలాచిన్నపక్షి దానిముక్కెంత ?దానిలో పట్టే నీరెంత? ఐతేనేం దాని పట్టుదల చాలాపెద్దది. అలా టిట్టిభం ఆహారం నిద్రా లేకుండా లేకుండా సముద్ర జలాన్ని అలా బయట పోయడం చూసిన మిగతా పక్షులు వచ్చి టిట్టిభాన్ని అడిగి విషయం తెలుసుకుని 'తామూ సాయం చేస్తామని ' స్వఛ్ఛందంగా చెప్పి, అడవిలో పక్షులన్నీ సముద్ర జలాన్ని బయటపోయసాగాయి. విష్ణూమూర్తి ఆనతిన వైకుంఠానికి బయల్దేరిన గరుడపక్షి , పక్షుల రాజు ,తమజాతి పక్షులన్నీ అలా సముద్ర తీరాన ఉండటం చూసి క్రిందకు దిగివచ్చి విషయం అడిగి తెల్పుకుని, తనజాతి ఒక చిన్న పక్షికి వచ్చిన ఆపద తీర్చను తనజాతి వారంతా సహకరించడం చూసి, తానూ తగిన సాయం అందించాలని తలచింది.

నేరుగా వైకుంఠానికి వెళ్ళింది."-స్వామీ! నన్ను తమరే పక్షులరాజును చేశారు. ఈనాడు నాజాతి చిన్న పక్షి ఒకటి పెద్ద బాధ ఎదుర్కుంటున్నది. మీ సాయం అర్ధిస్తున్నను " అని విషయం చెప్పి " తమరు సముద్రుని ఆజ్ఞాపించండి ప్రభూ! నాజాతి చిన్నపక్షి టిట్టిభం గుడ్లను సముద్రపు అలలు కొట్టుకుపోకుండా కట్టడి చేయండి ప్రభూ!" అని అర్ధించింది. వెంటనే విష్ణు భగవానుడు తన వాహనమైన గరుని కోర్లెను మన్నించి సముద్రుని హెచ్చరించాడు. సముద్రుడు కూడా" ప్రభూ! ఆగ్రహించకండి, నా అలలు పౌర్ణమిరోజున పైకి ఎగుస్తాయి. ఐనా తనఆజ్ఞ ప్రకారం నేను టిట్టిభం గుడ్లజోలికి వెళ్ళకుండ అనా అలలను కట్టడి చేస్తాను. " అని చెప్పాడు వినయంగా. పక్షులన్నీ తమరాజు తమకు సాయం చేసినందుకు కృతజ్ఞతలు చెప్పుకున్నారు. టిట్టిభం సముద్రపుతీరాన గుడ్లు పెట్టుకుని ,పొదిగి బిడ్డలను చూసుకుని ఆనందించింది.

పట్టుదల ఉంటే పైపైకి ఎదగడం కష్టంకాదు అని మనకు ఈ చిన్నారి టిట్టిభపక్షి ద్వారా తెలుస్తున్నదికదా!

# మా ఊరి నందుల ఆత్మీయ కథ

నందుల ప్రభాకర శాస్త్రి



(గత సంచిక తరువాయి)

## రైతులు

ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణ. ఈ రాష్ట్రంలో పల్లెటూరిలో పుట్టినవాడు రైతు కాకుండాపోడు. ప్రతి మనిషికీ కనీసమంటే రెండు ఎకరాల పంటపొలం వుండితీరుతుంది. కారణమేమంటే ప్రతి కులవృత్తి చేసేవారికి మాన్యాలు వుంటాయి. అగ్రహారీకులకు, పెద్ద రైతులకు పొలాలు ఎక్కువే వుంటాయి. ఊర్లో వున్న దేవాలయానికి భక్తులు ఇచ్చిన ఆస్తులుంటాయి. ఊర్లో ఉన్న దేవాలయానికి భక్తులు ఇచ్చిన ఆస్తులు ఉంటాయి. ఈ గుడి వైపు నుండి పూజారులకు, భజంత్రీలకు, ఇతర పనివాళ్ళకు మాన్యాలుంటాయి.

మరికొంతమందిని గౌరవించటం కొరకు, పండితులకు, విద్వాంసులకు 'ఇనాం' గా భూములనే యిస్తారు.ఈ విధంగా ఇచ్చిన పొలాన్ని ఏదో ఒక రకంగా సాగు చెసుకోవాలి. ఎలాగూ ప్రతి ఇంటికి ఒక పాడి బర్రె వుండనే వుంటుంది. ఎక్కువ పొలం వుండే వాళ్ళకు రెండు మూడు కాండ్లు ఎద్దులుండేవి. అప్పటికి ఇంకా ట్రాక్టర్లతో దున్నటం, యంత్రాలతో పనిచేయటం తెలియదు.

ఎకరం, రెండెకరాల పొలం వుండేవాళ్ళు ఒక ఎద్దును లేదా ఒక దున్నపోతును కొని కాడి కట్టాలన్నపుడు తనలాగే ఒకే ఎద్దు లేదా ఒకే దున్న వున్నవాళ్ళతో భాగస్వామ్యం పెట్టుకుంటారు. నాలుగు రోజులు వీళ్ళ పశువును వాళ్ళకు యిచ్చి మిగతా నాలుగు రోజులు వాళ్ళ పశువును తీసుకుంటారు. మేత, నీళ్ళు వీళ్ళే చూసుకోవాలి. తమ పశువుకు అధిక భారం వెయ్యకుండా ఆహారం తక్కువ చెయ్యకుండా పర్యవేక్షిస్తూ వుంటారు కూడా. ఇది చిన్నకారు, సన్నకారు రైతుల విషయం.

ఇరవై,ముప్పై ఎకరాలు వుండేవాళ్ళు జత ఎద్దులతో, యాభై ఎకరాలు వుండేవాళ్ళు రెండు, మూడు జతల ఎద్దులను, చాలా పాడి పశువులను కొనేవాళ్ళు, ఎరువు కూడా వాళ్ళకు సరిపోయేది.

భాకరాపేటలో ఒక పెద్ద రైతు కుటుంబాన్ని గురించి చెప్పాలి. ఈయన పెద్దగోపవరం వారి ఇంటికి ఇల్లిటం వచ్చినాడు. ఈయన భార్య నాగమ్మ.

ఉమ్మడి కుటుంబానికి ప్రతీకగా వుండేది ఆ యిల్లు. వందల కొద్దీ గొర్రెలు, మేకలు, పదుల సంఖ్యలో పాడి పశువులు, రెండు మూడు కాండ్ల ఎద్దులు, దున్నపోతులు... ఉదయం లేస్తే ఎవరి పనిమేద వారు వెళ్ళేవాళ్ళు. ఈ ఇంటి పెద్దను పెద్దరామన్న అనేవారు.

ఇంట్లో నలుగురు యువకులు, ఓ వితంతు యువతి వుండేవారు. ఇద్దరికి వివాహాలు జరిగాయి. మరి ఇద్దరికి జరగాల్సి వుంది. అయితే.. నాగమ్మ మాట అంటే ఆ యింట్లో వేదవాక్కు. అంతే ప్రేమగా అందరికి పనులు అప్పగించేది.

ఉదయం అయ్యేటప్పటికి నాలుగు కుండల మజ్జిగ ఊరం-



దరికి పంచటానికి సిద్ధంగా వుండేవి. పనికి పొయ్యేవాళ్ళ-కు 'అన్నం' మూటలు సిద్ధంగా వుండేవి. ఎక్కడ పట్టినా ధాన్యం కనిపించేది. కళ్ళంలో కోడూరు కొండంత గడ్డివామి, పొలాల్లో గొర్రెల, మేకల ఎరువు. పచ్చని పైర్లు, పాడి పశువులు, సంతాన లక్ష్ములు, ఇల్లు కళకళలాడుతూ వుండేది.

దీనికి తోడు వడ్డీ వ్యాపారం కూడా నడిచేది. అవసరమైన వాడికి డబ్బు సర్దేవాడు. 'బాండు' రాయించుకుని ఇనుప బీరువాలో పెట్టుకునేవాడు. సమయం అయ్యేవరకు అడిగేవాడు కాదు.

పెళ్లి కానివాళ్ళలో మిగతా ఇద్దరిలో ఒకరికి తన మనుమ-రాలిని ఇచ్చి చేసింది. మరొకరి-కి బయటి సంబంధం చేసింది నాగమ్మ. ఆజానుబాహురాలు నాగమ్మ. ఊర్లో భజంత్రీలు నేసిన తొమ్మిది గజాల చీరను నాలుగు వైపుల చెరుగులు చెక్కి నడిచేది.

పొలం పనులు, ఇంటి పనులు, వంట పనులు అన్నీ సజావుగా సాగేవి. ఊరిలో ఏ ఇంటికి చుట్టం వచ్చినా ఊరి మర్యాద పోకూడదని విచారించి అవస-రమైనవి సర్దిపోయేది. నాగమ్మ ఊరిలోకి బయలుదేరితే నాలుగు చెరుగుల ఒడిలో నాలుగు రకాల వస్తువులు ఉండేవి.

నాగమ్మ చనిపోవటం ఆ యింటికే కాదు, ఆ ఊరికి కూడా నష్టమే జరిగింది. ఉమ్మడి కుటుంబంలో లుకలుకలు బయలుదేరటం, పెద్దరామన్న పెద్దగా మాట్లాడలేకపోవటం, ఇల్లు సర్దటం చేతగాకపోవటం నష్టపరిచేవిగా తయారయ్యాయి.

గోరుచుట్టు మీద రోకటిపోటు అన్నట్లు వాళ్ళ ఇంటి దగ్గర వున్న స్థలం కొనుగోలు విషయంలో తగాదాలు రావటం, కొలతల్లో తేడా వుందని పెద్దరామన్న మా పెద్దన్నయ్యను పిలవటం, అప్ప-టికే పాలిటెక్నిక్ పూర్తిచేసుకుని వుండటం వల్ల సరైన కొలతలు వెయ్యటం, కాదనలేక ఒప్పుకు-న్న ఊరి పెద్ద 'సంవత్సరం తిర-క్కుండానే నీ పతనం చూస్తానని' శపథం చేయటం జరిగింది.

కొలతల్లో తనకు న్యాయం జరిగినందుకు ప్రతిఫలంగా మా అన్న రామమూర్తి తన దగ్గర తీ-సుకున్న బాకీ వందరూపాయల బాండు వద్దంటున్నా చించి-పారేశాడు. అలా వుండేవి రైతు కుటుంబాలు.

## అతిథులు

ప్రతి ఇంటికి చుట్టాలు వస్తూంటారు. కానీ ఊరు మొత్తా-నికి అతిథులు వేరుగా వుంటారు. తిథి, వార, నక్షత్రాలు లేకుండా వస్తూవుంటారు. వీరిలో సం-వత్సరానికి ఒకసారి వచ్చేవా-రు, వారానికి ఒకసారి వచ్చేవా-రు, సీజన్ ప్రకారం వచ్చేవారు వుంటారు. ప్రతి సంవత్సరం వచ్చి ఆనందింపచేసేవాళ్ళలో 'బొ-మ్మలాటగాళ్ళు' ఒకరు. వారు కనీసం పది, పదిహేను మంది వుంటారు. నాలుగు ఎద్దుల బండ్ల మీద వాళ్ళ సంసారం, సామగ్రి అంతా వేసుకుని వచ్చి ఊరి ముంగిట్లో గుడారాలు వేసుకుని వుంటారు. రెండు, మూడు బొ-మ్మలాటలు, రెండు మూడు వీధి నాటకాలు వేసేవరకు వదలరు. ఊరిలో అందరు చందాలు ఇచ్చి, భోజనాలు పెట్టి వారి పశు-వులకు మేత కూడా ఇచ్చి వారం, పది రోజులు సత్కరించేటప్పటి-కి ఊరికి భారమై పోతుంది. ఆ తర్వాత వేరే ఊరికి బయలుదేర-తారు.

(ఇంకా వుంది)



## మాటనే పాటగా మనసంతా జనజాగృతి పుంతగా చేసుకున్న

# గోరటి ఎంకన్న



తుమ్మూరి రాం మోహనరావు

పాల నురగల ఏరు పాట దారి
గాలికెగసె తెల్లుగడ్డె దరువు నేర్పింది
నీటి తెప్పల ఇసుక తిప్ప వేదికయినది
ఊటసెలిమె పాటలకు తల ఊపి ఊగింది
నెలవంకయే కరుణించి నా తల నిమిరి
తడిమింది
నేనల్లుకున్న గుడిసెలో కొలువయ్యి
మురిసింది
సల్లంగ తనువెల్లల్లుకొని ఉయ్యాలలూపింది
నిలువెల్ల పాటైపూసినను లోకాన
నిలిపింది.....

ప్రకృతి ఒడిలో పాటలు నేర్చిన కవిగోరటి వెంకన్న మొదటిసారి సిరిసిల్ల తెలంగాణా విద్యావంతుల వేదిక మీద చూశాను పదిపదిహేనేళ్లక్రితం.

మొన్న మార్చ నెలలో ప్రజా కవి కాళోజీ షూటింగ్‌లో కలుసుకోవడం జరిగింది. ఆట పాట ఆయనకు కవచకుండలాల్లాసహజాతాలు.

కుబుసం సినిమాకు ఆయన రాసిన పాట ఆయన పల్లెతో ఎంతమమేకమయ్యారోతెలుపుతుంది. పల్లె కన్నీరు పెడుతుందో కనుపించని కుట్రల అంటూ సాగే ఆ గీతం వింటుంటేహృదయం ద్రవించక మానదు.

ప్రజాజీవితాలను,పల్లెబతుకులను పాటలు కట్టి వేదికలమీద ఎగురుతూ పాడి వినిపిస్తూతన్మయుడైపోయే గానయోగి గోరటి వెంకన్న. 2016 లో తెలంగాణ ప్రభుత్వము ద్వారా కాళోజీ పురస్కారాన్ని పొందిన ఈ కవి తానురాసిన పాటల సంపుటులు రేలపూతలు గా ఏకనాదం గా అలసెంద్ర వంక గా ప్రచురించారు.

పల్లె దృశ్యాలను అలవోకగా జానపదగీతంగా మలచగల సహజకవి గోరటివెంకన్న.ఆయన గుండె నిండా పల్లెవాసనలు గుబాళిస్తుంటాయి.మనసునిండాజనజీవన స్రవంతులు ప్రవహిస్తూ ంటాయి.గజ్జె కట్టిన కాలు వేదిక పై ఘల్లు ఘల్లు మని చిందులు వేస్తుంది. మామూలుసమయంలో రోజుకో ఊరి దారి పడుతుంది.తన సంచార జీవితం ఎంత తృప్తినిస్తుందోఆయనపాటలోనే చూడండి.

సంచారమే ఎంతో బాగున్నది
దీనంత ఆనందమేదున్నదీ
ఇల్లు పొల్లు లేని,ముల్లె మూటలేని
వెంబడించే వెర్రి జ్ఞాపకాలు లేని
సేద తీర సెరువు కట్టున్నది
నీడ కోసం సింత సెట్టున్నది
జోలనూపె గాలి పిట్టున్నది
ఘుర్తులేని ఘడ్డి నిదరున్నది
బరువు దిగిన గుండె బలె ఉన్నది
సంచారమే సంతసంగ వున్నది

గోరటి నిస్సందేహంగా ఈ కాలపు మేలిమి ప్రాకృతిక కవి. ఏటి పాటను ఆలపిచినా, వాగుగురించి కలవరిం చినా,అది ఆయనకే చెల్లుతుంది సంత గురించి చెప్పినా ,బతుకమ్మ గురించి రాసినా, ఉగ్గుపాలలో అమ్మతనాన్ని చూపినాసెరువు గురించి తన్లాడినా ,,.మనసుపెట్టి రాసే కవిగోరటి.మమకారంతో రాసే ఈ కవి,తనపాటతో మనల్ని మమేకం చేస్తాడు.

"ఓ పుల్లా,పుడకా,ఎండుగడ్డి సిన్నకొమ్మ
సిట్టిగూడు పిట్ట బతుకే ఎంతో హాయి
సిగురుటాకు వగరు పూత లేత పిందె


**తీపిపండో**
**నోటికంది సింతలేక కునుకు తీసె పక్షి**
**బతుకే స్వర్గమోయీ.**
**ఆ తాజ్ మహల్ అందాల కన్న..నా**
**వాగు పిచ్చుక గూళ్లే మిన్న..అంటాడు**
**గోరటి.**
**తెలుగుగంగ నీళ్లు అలుగెల్లిపోతుంటే**
**పలుగు రాళ్లు తేలి**
**పాలమూరేడ్సింది"**
అని తన జన్మభూమి దీనావస్థను ఎత్తి చూపుతాడు.
గోరటి వెంకన్న 1963లో నాగర్కర్నూలు జిల్లా గౌరారంలో గోరటి ఈరమ్మ. నర్సింహదంపతులకు జన్మించాడు .ఈయనకు ఒక తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్లు. బడిలో పాట పాడమంటే ఎక్కువగా భక్తి పాటలు పాడేవాడు. ఆయన తండ్రి కూడామంచి కళాకారుడే. తల్లి కూడా భక్తి పాటలు పాటలు పాడేది. అలా ఆయనకు చిన్నప్పటినుంచీ పాటల మీద ఆసక్తి కలిగింది. చిన్నతనంలో ఈయనకు సినిమా పాటలంటేఅంతగా ఇష్టం ఉండేది కాదు. అలా ఉండగా ఆయన ఊర్లో కమ్యూనిస్టు భావాలున్న వెంకటరెడ్డి అనేఉపాధ్యాయుడు వెంకన్న లోని సృజనాత్మకతను గుర్తించి కొన్ని పాటల పుస్తకాలనుతీసుకువచ్చి ప్రోత్సాహాన్నందించాడు.వాటిలో పాటలను ఆయన అలవోకగాపాడేవాడు. అలా పాటమీద పట్టు దొరికింది. ఆ తరువాత తాను చూచిన వాటిని పాటలు కట్టాడు.తన ఎదురుగా కనిపించిన రైతుసమస్యలపై పాటలు రాసాడు.తనను ప్రోత్సహించిన వెంకటరెడ్డి సారు ప్రమేయంతోకమ్యూనిస్టు పార్టీ పాటలు రాసాడు. ఒక వైపు ప్రకృతి పల్లెతో కరువు కాటకాల ఆటలు ఆడి హింసిస్తే, మరో వైపు బహుళ జాతికంపెనీలొచ్చి కుల వృత్తుల సడుగులు ఇరుగదన్ని మూలకు కూర్చోబెట్టాయి . పల్లె యొక్కఈ దీనావస్తను చూసి, కవి - "పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రలో తల్లి బందీయైపోతుందో" అని ఆవేదన చెందుతాడు. పల్లె విధ్వంసం గురించి ఇంత విషాద భరితంగాపాడిన మరే కవి మనకు కనించడంటే అతిశయోక్తి కాదేమో! ప్రపంచీకరణ మాయా మబ్బులు పల్లెలను సైతం కమ్మేసి, కుమ్మేస్తున్నప్పుడు, కులవృత్తులు ధ్వంసమై, మూలకు పడుతున్నప్పుడు, పల్లెలను మింగి పట్టణాలుబలుస్తున్నప్పుడు, మానవత్వపు విలువలు మృగ్యమైపోతున్నపుడు కవి హృదయంవేదనతో రగిలి, పాటగా రూపుదాల్చి, రేల పూతలు' పూశాయి. ఎంకన్న పాట పల్లె చుట్టేప్రదక్షిణాలు చేస్తుంది. నిత్యం జనం నోట్లో నానే పల్లె పదాలు,జానపదుల పాటల్లోని పదబంధాల తియ్యందనాలూ కలిసి గోరటి పాటై పరిమళిస్తుంది... ప్రకృతికిమల్లే పరవశిస్తుంది.జీవ నదిలా పొంగి,ఉప్పొంగి జనం గుండెల్ని తడిపేస్తుంది.

**“అస్సోయి..ఇస్సోయి హైలెస్సా రంగోయీ**
**విసురోయీ..గుంజోయీ వల విసిరి**
**గుంజోయీ**
**ఎద్దుల నాపోయీ..నీళ్లను దాపోయీ**
**గంతేసి దూకోయీ..సెరువంత ఈదోయీ**
**పిట్టల సుట్టూతా..పిల్లల పరుగోయీ**
**కట్టమీద కొంగ బావలూసులోయీ”**

గోరటి భాషలో ఎక్కడా తెచ్చిపెట్టుకున్న పైపై మెరుగు లుండవు. సామాజిక మాధ్యమాల నిండాల ఈ రోజు ఆయన గురించిన వార్తలు వెల్లువెత్తాయి. ఒకఆధునిక ప్రజా వాగ్గేయకారునికి రాష్ట్ర ప్రథమ పౌరురాలినుండి అందిన సముచితగౌరవాస్పద నియామకాహ్వానంగోరటి వెంకన్నకు శాసనమండలి సభ్యత్వము అనగానే హర్షించని వారు లేరు. తెలంగాణ ప్రభుత్వ సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ గా పని చేస్తున్న గోరటి వెంకన్న పలు చిత్రాలకు పాటలు రాయటమే గాక కొన్ని టివి షోస్ లో కూడాపాల్గొన్నారు.



RNI No. TELTEL/2011/39497 NOVEMBER 2020 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication: 1st November Date of Posting: 8th November







Published, Edited and Printed by T Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad-500048. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.